గురువారం
7•2•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 223
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



బుధవారం తెల్లవారుజామున ఫ్రెంచి గయానాలోని కౌరు అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి జీశాట్-31ను తీసుకొని నింగిలోకి దూసుకెళ్తున్న ఏరియన్-5 రాకెట్

కక్ష్యలోకి జీశాట్-31

- బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ప్రయోగం
- కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్-5 రాకెట్ ద్వారా నింగిలోకి
- మెరుగుపడనున్న డీటీహెచ్ సర్వీసులు, ఏటీఎం నెట్‌వర్క్స్

5



కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్‌పర్సన్స్‌తో బుధవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి

పంచాయతీలు ప్రగతి ప్రణాళికల అమలు వేదికలు ■ సర్పంచ్‌లు ప్రజలతో కలిసి గ్రామవికాసానికి పాటుపడాలి

రాష్ట్రవ్యాప్తంగా 25 తనిఖీ బృందాలు.. ఓ బృందంలో నేనే ఉంటా ■ రిసోర్స్‌పర్సన్ల సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

గ్రీన్ విలేజ్- క్లీన్ విలేజ్

- పచ్చదనం, పరిశుభ్రత, శ్మశానవాటికల నిర్మాణంపై దృష్టిసారించాలి
- ప్రతి ఇంటికి కనీసం ఆరు మొక్కలు.. రోడ్లపై చెత్తవేస్తే ఫైన్
- గ్రామాల అభివృద్ధికి ఐదేండ్లలో 40 వేల కోట్లు
- 500 జనాభా ఉన్న పంచాయతీకి ఏటా కనీసం 8 లక్షలు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ నిధులు ఈసారి గ్రామాలకే
- లేబర్ కాంపోనెంట్‌కు నరేగా నిధులు.. అభివృద్ధికి ఇతర నిధులు
- నిధులను పూర్తిగా వినియోగిస్తే అద్భుతాలు సృష్టించొచ్చు: సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామాలు వేదికగానే ప్రగతి ప్రణాళికలు అమలుకావాలని.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. గ్రామ పంచాయతీలకు అవసరమైన అన్ని నిధులు కేటాయిస్తామన్న సీఎం.. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డుసభ్యులు ప్రజలను కలుపుకొని గ్రామవికాసానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారుల నిర్మాణంలాంటి ముఖ్యమైన పనులన్నీ ప్రభుత్వమే నేరుగా చేస్తున్నదని.. గ్రామాల్లో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత పాటించడం, వైకుంఠధామాల (శ్మశానవాటికలు) నిర్మాణంపై పంచాయతీలు ఎక్కువ దృష్టి సారించాలని చెప్పారు. కొత్త గ్రామీణ తెలంగాణను తయారుచేసే చేంజ్ ఏజెంట్లుగా, మెంటార్లుగా రిసోర్స్‌పర్సన్లు వ్యవహరించాలని అన్నారు. ఆరునెలలకోసారి వారితో తాను స్వయంగా సమావేశమవుతానని వెల్లడించారు. గ్రామపంచాయతీలకు అధికారాల బదిలీ, నిధుల కేటాయింపుపై అత్యంత ఉదారంగా ఉంటామని తెలిపారు. అదేసమయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు నిధుల దుర్వినియోగానికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సస్పెండ్ చేసేవిధంగా కఠినచట్టాన్ని రూపొందించినట్టు వెల్లడించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్‌పర్సన్స్‌తో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బుధవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. ప్రతి పంచాయతీ తన పరిధిలోని వనరులు, అవసరాలను బేరీజు వేసుకుంటూ.. ఐదేండ్ల ప్రణాళిక తయారుచేసుకోవాలని, అందుకు అనుగుణంగా పనులు చేయాలని ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో



అయోమయంలో వెయ్యి కోట్లు

- కెనడా క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ సీఈవో ఆకస్మిక మరణం
- వేల ఖాతాలకు తెలియని పాస్‌వర్డులు
- ఎవరికీ అందని 145 మిలియన్ డాలర్ల ఆస్తులు

10



ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తిలో 85శాతం రాష్ట్రానికే

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

5

10 నుంచి మానేరు నీళ్లు

ఎల్‌ఎండీ దిగువకు వదిలేందుకు సన్నాహాలు



బుధవారం జలసౌధలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్. చిత్రంలో ఎంపీ బీ వినోద్‌కుమార్ కూడా ఉన్నారు.

- జూన్ నెలాఖరుకు ఆధునీకరణ, ఇతరత్రా పనులన్నీ పూర్తి
- ఎస్సారెస్పీ చివరాయకట్టుకు నీరందేలా ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరాంసాగర్ జలాశయంలో ప్రస్తుతం 30 టీఎంసీల నీరుందని, ఇదివరకే ఎల్‌ఎండీ (లోయర్ మానేరు డ్యాం) ఎగువన ఉన్న ఆయకట్టుకు నీరందించామని, ఈ నెల పదో తేదీ నుంచి ఎల్‌ఎండీ దిగువకు 10 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఎల్‌ఎండీ ఎగువన నాలుగు తడులుగా 20 టీఎంసీల నీటిని అందించనుండగా.. దిగువన ఉన్న ఆయకట్టుకు రెండు తడుల కింద నాలుగు టీఎంసీలు ఇస్తామని తెలిపారు. ఎస్సారెస్పీ కింద వాస్తవానికి 14.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. సమైక్య పాలకులు ఏనాడూ ఐదు లక్షల ఎకరాలకు మించి సాగునీరు అందించలేదని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, కాకతీయ కాల్వ ఆధునీకరణ.. తదితర పనుల పురోగతిపై సమీక్షించేందుకుగాను బుధవారం జలసౌధలో పలువురు ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులు భేటీ అయ్యారు. పనుల

మిగతా 12వ పేజీలో

ఐఎఫ్‌ఎస్ టాపర్ మందాడి నవీన్

అమీర్‌పేట అమ్మాయికి 41వ ర్యాంకు



మోనికా కిశోర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్-2018 పరీక్షల్లో తెలుగు అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. మందాడి నవీన్‌రెడ్డి మొదటిర్యాంకు సాధించారు. హైదరాబాద్ అమీర్‌పేట నివాసి మోనికా కిశోర్ పసుపులేటి 41వ ర్యాంకు, సీ చైతన్యకుమార్‌రెడ్డి 42వ ర్యాంకు, ఆదిత్య 47వ ర్యాంకు, భూక్యా నర్సింహస్వామి 76వ ర్యాంకు సాధించారు. జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తిచేసిన మోనికా కిశోర్.. ఐఏఎస్ లేదా ఐఎఫ్‌ఎస్ కావాలన్న పట్టుదలతో కృషిచేశారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికకావడానికి తాను జువాలజీ, ఫారెస్ట్రీపై ప్రత్యేక దృష్టిసారించానని చెప్పారు. తనకు 41వ ర్యాంకు వస్తుందని ఊహించలేదన్నారు. తాను తెలంగాణ రాష్ట్రంలోనే సేవలందిస్తానని.. తెలంగాణ రాష్ట్రాన్ని ఆప్షన్‌గా ఎంచుకున్నానని చెప్పారు. తన కూతురు పడ్డ కష్టానికి ఫలితం దక్కిందని ఆమె తండ్రి, అడ్వకేట్ కిశోర్ పసుపులేటి అన్నారు.

ఓట్ల కోసం దరఖాస్తులు 24 లక్షలు



- కొత్తగా ఓటు నమోదుకు 18 లక్షల అప్లికేషన్లు
- జాబితాలో మార్పులు, చేర్పులకు ముగిసిన గడువు
- 14వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన
- 22న ఓటర్ల తుది జాబితా విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి దరఖాస్తులు పోటెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయవర్గాలు వెల్లడించాయి. ఓటరు కార్డులో పేరు, చిరునామా మార్పులకు చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమం గడువు ఈ నెల 4వ తేదీతో ముగిసింది. దీంతో ఆన్‌లైన్‌లో 23.71 లక్షల దరఖాస్తులు వచ్చాయి. బూత్‌స్థాయి అధికారులు మాన్యువల్‌గా స్వీకరించిన దరఖాస్తులు ఇంకా ఆన్‌లైన్‌చేయాల్సి ఉన్నదని, అవి కలిపితే దరఖాస్తులు 24 లక్షలు దాటుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, 22వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో 12.45 లక్షల దరఖాస్తులు ఆమోదం పొందగా మిగతా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా ఓటరు నమోదుకు ఫామ్- 6 అప్లికేషన్లు 18 లక్షల వరకు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇందులో 9.32 లక్షల

మిగతా 12వ పేజీలో

జయరాం కేసు తెలంగాణకు



- ఏపీ డీజీపీ ఉత్తర్వులు
- జయశ్రీ ఫిర్యాదుపై తొలగని సస్పెన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో/ బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:

పారిశ్రామికవేత్త జయరాం హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసును తెలంగాణకు బదిలీచేస్తూ.. ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. హత్య హైదరాబాద్‌లోనే జరిగినట్లు దర్యాప్తులో వెల్లడికావడం, ఆంధ్రప్రదేశ్ పోలీసులపై నమ్మకంలేదని జయరాం భార్య పద్మశ్రీ ఆరోపించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి హత్య కేసు బదిలీకావడం ఇటీవలికాలంలో ఇదే ప్రథమం. ఎన్నో అనుమానాలున్న ఈ కేసును హైదరాబాద్ పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని మరింత లోతుగా దర్యాప్తుచేసే అవకాశాలున్నాయి. జయరాం హత్య కేసులో నిందితుడైన రాకేశ్‌రెడ్డి, వాచ్‌మన్ శ్రీనివాస్‌ను కృష్ణాజిల్లా పోలీసులు ఇప్పటికే అరెస్టుచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో జయరాం మేనకోడలు శిఖాచౌదరికి ఎలాంటి సంబంధంలేదని ఏపీ పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జయరాం భార్య.. తనకు ఏపీ పోలీసులపై నమ్మకంలేదని, హైదరాబాద్‌లో హత్య జరిగినందున అక్కడి పోలీసులు విచారణచేయాలని కోరారు. జయరాం మరణం తరువాత శిఖాచౌదరి అక్రమంగా ఇంట్లోకి చొరబడి విలువైన ఆస్తి పత్రాలు, ఇతర వస్తువులను అపహరించిందని మంగళవారం రాత్రి పద్మశ్రీ తన న్యాయవాదితో కలిసి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలోనే ఏపీ డీజీపీ కేసును తెలంగాణకు బదిలీచేస్తామని వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఈ కేసును తొలుత తెలంగాణ డీజీపీకి.. ఆ తర్వాత అక్కడినుంచి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు.. అక్కడినుంచి జూబ్లీహిల్స్ పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగిస్తారు. ఇందుకు కనీసం మూడునాలుగు రోజుల సమయంపట్టే అవకాశం ఉన్నది. ఏపీ పోలీసులు నిందితులను అరెస్టుచేయడంతో న్యాయపరమైన అంశాలు కూడా ఇందులో ముడిపడి ఉన్నాయి. పద్మశ్రీ ఫిర్యాదులోని

మిగతా 2వ పేజీలో

శబరిమల బోర్డు యూటర్న్

- మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పుకు మద్దతు
- తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదన్న కేరళ ప్రభుత్వం
- తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం

5





బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి పెండ్లిపత్రికను అందించి తమ కూతురు వివాహానికి రావాలని ఆహ్వానిస్తున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను తన కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానిస్తున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన మార గంగారెడ్డి



బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్న టీఎస్‌ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ స్వామిరెడ్డి

మార్చి నుంచి వాహనాలకు ఆధార్ లింక్

- వాహన డీలర్లతో సమావేశమైన రవాణాశాఖాధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మార్చినెల నుంచి కొనుగోలుచేసే ప్రతి వాహనానికి ఆధార్ అనుసంధానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రవాణాశాఖ జాయింట్ కమిషనర్ రమేశ్ తెలిపారు. దీనిపై అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. వాహన్ పోర్టల్, వాహనాల రిజిస్ట్రేషన్ సందర్భంగా ఆధార్ లింక్‌చేసే అంశాలపై వాహనాల డీలర్లతో ఆయన బుధవారం ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కంపెనీలనుంచి దిగుమతిచేసి, వినియోగదారులకు అందించే వాహనాలకు ఆధార్‌లింక్ తప్పనిసరిగా ఉండాలని, దీనికోసం బయోమెట్రిక్ మిషన్లు సైతం ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సాఫ్ట్‌వేర్ అధికారి మధుసూదన్, టెక్నికల్ ఇంచార్జ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

18 నుంచి టీసీసీ పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 21 వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన హాల్‌టికెట్లు www.bse.telangana.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

జయరాం కేసు తెలంగాణకు

మొదటిపేజీ తరువాయి...

అంశాలను పరిగణనలోనికి తీసుకొని, ఏపీ నుంచి వచ్చే కేసుతో కొత్తగా ఇక్కడ కేసు నమోదుచేస్తారా? లేక ఆ కేసును వేరుగా.. పద్మశ్రీ ఫిర్యాదును వేరుగా పరిగణిస్తారా? అనే విషయాలపై పోలీసులు న్యాయసలహాల మేరకు నడుచుకోనున్నారు. ఇప్పటికైతే తమకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. అక్కడినుంచి కేసు బదిలీ అయి హైదరాబాద్ పోలీసుల చేతికి వచ్చిన తరువాత పూర్తి స్పష్టత ఇస్తామని పేర్కొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.50 గంటలకు

సూర్యాస్తమయం: 6.10 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం విదియ ఉదయం 7.55 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: శతభిషం మధ్యాహ్నం 12.10 వరకు, తదుపరి పూర్వాభాద్ర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం మధ్యాహ్నం 1.55 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి 4.40 వరకు, వర్జ్యం: రాత్రి 7.19 నుంచి 8.55 వరకు.

లోకం పోకడ



లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతే తలో కారణం చెప్పకుండా అందరం ఓ ఏకాభిప్రాయానికి వద్దాం.. సరేనా?!



బుధవారం ప్రగతిభవన్‌లో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే రిసోర్సుపర్సన్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, రెడ్యానాయక్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సుంకె రవిశంకర్, గువ్వల బాల్‌రాజు, జైపాల్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి

మొదటిపేజీ తరువాయి...

సూచించారు. గ్రామం ఇప్పుడు ఎక్కడుంది? ఐదేండ్ల తర్వాత ఎక్కడికి పోవాలి? ఐదేండ్లలో ఎన్ని నిధులు వస్తాయి? వాటితో ఎలాంటి పనులు చేయాలి? అనే విషయాలను నిర్ధారించుకుని రంగంలోకి దిగాలని సూచించారు. చీకట్లో బాణం విసిరినట్లు కాకుండా, లక్ష్యసిద్ధితో గురిచూసి కొట్టాలన్నారు. 'గ్రీన్ విలేజ్-క్లీన్ విలేజ్' నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంచడానికి, పారిశుద్ధ్య పరిరక్షణకు, శ్మశానవాటికల నిర్మాణానికి, పన్నుల వసూలుకు మొదటి దఫాలో ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళిక తయారుకావాలని చెప్పారు. ప్రణాళిక తయారీలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రిసోర్సుపర్సన్లు తగిన సలహాలు, సూచనలు, ఇవ్వాలని కోరారు. సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, గ్రామ వికాసానికి పాటుపడేలా వారిలో స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందనే విషయం చెప్పి, అప్రమత్తం చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి దిశానిర్దేశం ఆయన మాటల్లోనే..

పదవి సేవ కోసం.. అధికారం కోసం కాదు

ప్రజాప్రతినిధులు తాము ప్రజాసేవకులమనే విషయాన్ని మరువొద్దు. చట్టసభల్లో అధికారపార్టీ, ప్రతిపక్షపార్టీ అనే పదాలు పోవాలి. గ్రామాల్లో కూడా అధికారం అనేమాట రావొద్దు. ప్రజాప్రతినిధులు తాము ప్రజాసేవకులమే తప్ప, అధికారం చలాయించే వాళ్లంకాదు అనే భావన కలిగి ఉండాలి. సర్పంచ్‌గా ఎన్నిక కాగానే కొందరి వేషభాషల్లో మార్పు వస్తుంది. అదితప్పు. సహజత్వాన్ని కోల్పోవద్దు. తాము పెత్తనం చేయడానికి ఉన్నామనే భావన మనసులోకి రానీయవద్దు. దురదృష్టవశాత్తూ ప్రజాస్వామ్యం (డెమోక్రసీ).. నిరంకుశత్వం (అటోక్రసీ)గా మారుతున్నది. ఇది మంచిది కాదు. ప్రజలందరినీ సంఘటిత పరిచి, గ్రామసమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రజల సంఘటితశక్తిలోని బలమెంతో గుర్తెరగాలి.

పల్లెలు పచ్చగా కళకళలాడాలి

గ్రామంలో పచ్చదనం పెంచడం పంచాయతీల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలి. గ్రామానికో నర్సరీ కచ్చితంగా ఉండాలి. ప్రతి ఇంటికి ఆరు మొక్కలకు తక్కువ కాకుండా.. అడిగిన రకాల మొక్కలను సరఫరాచేయాలి. గ్రామంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి. మొక్కల పెంపకానికి నరేగా నిధులు వాడుకోవాలి. ప్రతి ఇంటి నుంచి ఇండెంట్ సేకరించాలి. వీధుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో నీడను, ఆక్సిజన్‌ను ఇచ్చే వేప, రావిలాంటి చెట్లు నాటాలి. పొలాల గట్ల మీద కావాల్సిన మొక్కలను రైతులకు అందించాలి.



బుధవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందించి, సమస్యలను వివరిస్తున్న రిసోర్సుపర్సన్లు



ప్రగతిభవన్‌లో నిర్వహించిన శిక్షణకు హాజరైన రిసోర్సు పర్సన్లకు భోజనం అందుతున్న తీరును పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

రోడ్డుపై చెత్త వేస్తే ఫైన్ వేయండి

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కట్టుదిట్టంగా జరగాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తాచెదారం రోడ్లపై కనిపించకూడదు. ప్రజలు తమ ఇండ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో ఊరిని కూడా అలాగే ఉంచుకోవాలి. రోడ్డుపై చెత్త వేసేవారికి రూ.500 జరిమానా విధించాలి. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడానికి ట్రై సైకిళ్లను ఏర్పాటుచేయాలి. డంపింగ్ యార్డు ఏర్పాటుచేయాలి. పాడుపడిన, వాడని బావులను, బోర్లను వెంటనే పూడ్చివేయాలి. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి.

ఆర్నెల్లలో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు

సొంత స్థలం లేనివారు తమ కుటుంబసభ్యులు చనిపోతే ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియదు. ఆ బాధ వర్ణనాతీతం. కాబట్టి ప్రతి గ్రామంలో కచ్చితంగా వైకుంఠధామం నిర్మించాలి. దీనికోసం పంచాయతీ స్థలం ఇవ్వాలి. అదిలేకుంటే ప్రభుత్వభూమి వాడుకోవాలి. రెండూ లేకుంటే పంచాయతీ నిధులతో కొనాలి. దాతలు ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలి. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే వైకుంఠధామం నిర్మించాలి. అన్ని గ్రామాల్లో ఆర్నెల్లలో వైకుంఠధామాలు నిర్మించాలి.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

గ్రామంలో నూటికి నూరుశాతం పన్నులు వసూలుచేయాలి. వసూలుచేయని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటాం.

గంగదేవిపల్లి మాజీ సర్పంచ్‌కు అరుదైన గౌరవం



కూసం రాజమౌళి అనే మాజీ సర్పంచ్ కృషి కారణంగా వరంగల్ జిల్లా గంగదేవిపల్లి ప్రపంచానికే ఆదర్శ గ్రామంగా ఎలా తయారైందో సీఎం కేసీఆర్ వివరించారు. ఈ సందర్భంగానే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ సర్పంచ్ గురించి మాట్లాడారు. అయితే ఆశ్చర్యకరంగా పంచాయతీరాజ్‌శాఖ ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్లలో రాజమౌళి కూడా ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి ఆయనను సభకు పరిచయం చేసి.. ఆదర్శనాయకుడని కొనియాడారు. వేదికమీదకు పిలిపించి, సీనియర్ అధికారులు, ఎమ్మెల్యేల సరసన కూర్చోబెట్టి గౌరవించారు. రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకుని గంగదేవిపల్లిలో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించానని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. గ్రామస్థులు, ముఖ్యంగా మహిళల సాధికారితకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామం ఓ ఉదాహరణగా చెప్పిన సీఎం, గ్రామాల స్వయం సమృద్ధికి, లాభదాయక వ్యవసాయానికి ఆ ఊరు రోల్‌మోడల్ అని వివరించారు. ఒక్క దోమ కూడా లేకుండా పరిసరాలను ఎలా కాపాడుకోవచ్చో హైదరాబాద్ నగర శివారు ప్రగతిరిసార్ట్స్ చేసి చూపించందని చెప్పారు. రిసోర్స్ పర్సన్లంతా తమ శిక్షణా కాలంలో గంగదేవిపల్లి, అంకాపూర్, ప్రగతిరిసార్ట్స్‌ను సందర్శించాలని కోరారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ప్రారంభోపన్యాసం చేశారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెత చెప్పి, కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, కొత్తగా నియామకమయ్యే గ్రామ కార్యదర్శులకు సరైన అవగాహన కల్పించి, గ్రామ వికాసానికి చేంజ్ ఏజెంట్లుగా మార్చాలని చెప్పారు.

సర్పంచ్‌లు గ్రామంలోనే నివాసం ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి. నెలకోసారి విధిగా గ్రామపంచాయతీ సమావేశం, రెండునెలలకోసారి గ్రామసభ నిర్వహించాలి. పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి. వివాహ రిజిస్ట్రేషన్, జనన, మరణ రికార్డుల నిర్వహణ పంచాయతీ ఆధ్వర్యంలోనే ఉండాలి. గ్రామంలో వ్యక్తిగత ఆస్తుల మ్యుటేషన్ (పేరుమార్పిడి)పై కూడా కొత్త పంచాయతీలు నిర్ణయం తీసుకోవాలి. కరంట్ సమస్యల పరిష్కారానికి పవర్‌డే నిర్వహించాలి. ప్రతి గ్రామంలో దోబీఘాట్లు నిర్మించాలి.

నిధులు వచ్చే మార్గాలివీ..

తెలంగాణ గ్రామాల్లో 2.2 కోట్ల జనాభా ఉన్నది. 14వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామాల అభివృద్ధికి రాష్ట్రానికి ఏడాదికి రూ.1,628 కోట్లు కేంద్రం నుంచి వస్తాయి. మన రాష్ట్రం దానికి మరో రూ.1,628 కోట్లు జోడిస్తుంది. ఏటా మొత్తం రూ. 3,256 కోట్లు సమకూరుతాయి. దీని ప్రకారం ఒక్కో మనిషికి రూ.1,611 చొప్పున 500 జనాభా కలిగిన గ్రామానికి కూడా ఏటా రూ.8 లక్షలు వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు ఎక్కువ నిధులు వస్తాయి. ఇవికాకుండా ఏటా రూ.3,500 కోట్ల నరేగా నిధులు వస్తాయి. ఈ నిధులను సమర్థంగా వాడుకోవాలి. లేబర్ కాంపోనెంట్‌కు నరేగా నిధులు వాడి, మెటీరియల్ కాంపోనెంట్ కోసం గ్రామపంచాయతీ నిధులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఆర్థిక సంఘం నిధులు వాడుకోవాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధులను కూడా ఈసారి గ్రామాల అభివృద్ధికే వినియోగిస్తాం. వీటిద్వారా రూ.480 కోట్లు వస్తాయి. ఇలా మూడు మార్గాల ద్వారా గ్రామాల అభివృద్ధికి ఏడాదికి రూ.7,236 కోట్లు సమకూరుతాయి. ఇవే కాకుండా రాష్ట్రబడ్జెట్‌లోనూ నిధులు కేటాయిస్తాం. మొత్తంగా ఐదేండ్లలో రూ.40 వేల కోట్లు గ్రామాలకు సమకూరుతాయి. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి అద్భుతాలు చేయవచ్చు.

25 ఆకస్మిక తనిఖీ బృందాలు

పంచాయతీలకు కావాల్సిన నిధులిస్తాం.. విధులిస్తాం.. బాధ్యతలూ అప్పగిస్తాం. అన్నీ ఇచ్చినా పనిచేయని పంచాయతీల విషయంలో సీరియస్‌గా ఉంటాం. ప్రభుత్వ నిధులు ఎలా ఖర్చు పెడుతున్నారో తెలుసుకోవడానికి 25 ఆకస్మిక తనిఖీ బృందాలు ఏర్పాటుచేస్తాం. ఒక బృందంలో నేనే ఉంటా. దూరప్రాంతాలు పర్యటించడానికి హెలికాప్టర్లు కూడా సమకూరుస్తాం. ఎవరు ఎప్పుడు ఎక్కడికి పోతున్నారో తెలియకుండా తనిఖీలుంటాయి. ప్రతిరోజూ ఏదో ఓచోట ఈ తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. ఇంటెలిజెన్స్ ద్వారా కూడా సమాచారం తెప్పించుకుంటాం. పచ్చదనం పెంచడానికి, పరిశుభ్రత కాపాడటానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తాం. ఎక్కడ తేడా వచ్చినా సర్పంచ్, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తాం. దీనికోసం చట్టంలో కూడా నిబంధనలు పొందుపరిచాం.

కరంటు బిల్లు బకాయి పెడితే సస్పెండే

వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం వాడే కరంటుకు స్థానిక సంస్థలు బిల్లులు సరిగా చెల్లించడం లేదు. పంచాయతీలు విద్యుత్ సంస్థలకు రూ.2,570 కోట్ల బకాయిలు చెల్లించాలి. మున్సిపాలిటీలు రూ.455 కోట్లివ్వాలి. మొత్తం రూ.3,025 కోట్ల బకాయిలున్నాయి. ఇట్లయితే విద్యుత్ సంస్థలు ఎలా నడవాలి. ఇకపై ఎప్పటికప్పుడు కరంటు బిల్లులు చెల్లించాలి. జాప్యంచేసిన వారిని సస్పెండ్ చేస్తాం.

పెదిరిపాడు ఘటన దారుణం

మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ బాలప్పను నేలపై కూర్చోబెట్టిన ఘటనను సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇలాచేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిష్ణాతులతో రిసోర్స్‌పర్సన్ల బృందం

స్థానిక సంస్థలను పనిచేసే పరిపాలనా విభాగాలుగా తీర్చిదిద్దడం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థల ప్రతినిధులకు తగిన శిక్షణ ఇవ్వడం, ఎప్పటికప్పుడు వారి పనితీరును మదింపుచేసేందుకు నిష్ణాతులైన రిసోర్స్‌పర్సన్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రామ వికాస ప్రణాళికలపై అవగాహన కలిగి, పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన 320 మందితో రాష్ట్రస్థాయి బృందాన్ని తయారుచేసింది. పంచాయతీరాజ్ అధికారులతోపాటు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మాజీసర్పంచ్‌లు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఇందులో ఉన్నారు. ప్రస్తుతం వీరికి తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ ఇస్తారు. అనంతరం వీరు జిల్లాల వారీగా సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా తరగతులు ఆరునెలలకోసారి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, ఎండీసీ చైర్మన్ శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, సెర్ప్ సీఈవో పౌసమి బసు, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన ముఖ్యమంత్రి

రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. ప్రతి విషయంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయిన సమావేశంలో మధ్యాహ్నం రెండుగంటల వరకు నిల్చునే మాట్లాడారు. భోజన విరామం తర్వాత 3 నుంచి 5 గంటల వరకు మళ్లీ నిల్చున్నారు. పంచాయతీరాజ్ కొత్త చట్టం, పంచాయతీల బాధ్యతలు- విధులు, నిధులు సమకూరే మార్గాలు, ఖర్చుపెట్టే పద్ధతులు, ప్రజాప్రతినిధులకు నైతిక నియమాలు, రిసోర్స్ పర్సన్ల బాధ్యతలపై సుదీర్ఘంగా మాట్లాడారు. అనేకమార్లు సీఎం కేసీఆర్ హాస్యం పండించడంతో సమావేశంలో నవ్వులు విరబూశాయి. 5 నుంచి 6 గంటల వరకు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ల సందేహాలకు సీఎం ఓపికగా సమాధానాలు ఇచ్చారు.

పద్యాలు పాడుతూ.. తాత్పర్యం వివరిస్తూ..

అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశంలో పలుమార్లు సందర్భోచితంగా పద్యాలు చదివి, దాని అర్థం చెప్పారు. 'అనగననగ రాగ మతిశయిల్లుచునుండు' అనే వేమన పద్యం పాడి వినిపించి.. తినగా తినగా వేపాకు తియ్యగా మారినట్టే గ్రామాల్లో సంస్కరణల అమలు నిరంతర ప్రక్రియగా సాగితే.. కొంతకాలానికి ప్రజలకు, ప్రతినిధులకు అది అలవాటుగా మారుతుందన్నారు. 'నయమున బాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా' అనే సుమతి శతకంలోని పద్యాన్ని ఉదహరించి.. పంచాయతీల విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే కఠినంగా శిక్షించాలని చెప్పారు. భయముంటేనే బాగా పనిచేస్తారని, పాలన పారదర్శకంగా ఉంటుందన్నారు. 'జాతస్యహి మరణం ధృవం' అంటూ భగవద్గీత శ్లోకం చదివి.. చనిపోయిన తర్వాత కూడా మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానవాటికలు నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'బతికినంతకాలం కులం, మతం పేరిట కొట్టుకు చచ్చినం. చనిపోయిన తర్వాతనైనా ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి' అని ముఖ్య మంత్రి అన్నారు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై' అనే ఏనుగు లక్ష్మణకవి సుభాషితం చదివి, గ్రామాల వికాసానికి మంచి సంకల్పంతో నడుం బిగించి, తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన స్ఫూర్తితో పనిచేయాలని ఉద్బోధించారు.

స్ఫూర్తిప్రదాతల గాథలను వివరించిన సీఎం

గ్రామాల అభివృద్ధిలో ఎంతో కృషిచేసిన వ్యక్తులు, సంస్థలు, గ్రామాలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల భాగస్వామ్యంతో వారు సాధించిన విజయాలను, దేశానికి ఉపయోగపడిన విధానాన్ని విడమరిచి చెప్పారు. కేంద్ర మాజీమంత్రి ఎస్కే డే దేశంలో పంచాయతీరాజ్ ఉద్యమానికి పురుడు పోసిన విధానాన్ని, ఆయన సలహాలు, సూచనల మేరకే మొదటి ప్రధాని నెహ్రూ నీటిపారుదల నిర్మాణానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి చర్యలు తీసుకున్న వైనాన్ని వివరించారు. గ్రామాల వికాసం కోసం ఎస్కే డే హైదరాబాద్‌లో నెలకొల్పిన ఎన్ఐఆర్డీ గురించి చెప్పారు. కొంకణ్ ప్రాంతంలో ప్రజలను చైతన్యపరిచి, ఎత్తుపల్లాలుండే భూభాగంలో వ్యవసాయం ఎలా చేయాలో చేసి చూపించిన బండార్కర్ సేవలు, మహారాష్ట్రలోని వన్రాయ్ సొసైటీ గ్రామాల్లో స్వచ్ఛందంగా వైకుంఠ ధామాలు నిర్మించడాన్ని ప్రస్తావించారు.

మాకు గ్రామాల బాధ్యత అప్పగించారు : చాడ మంజులారెడ్డి, టీవోటీ

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు టీవోటీగా ఎంపికయ్యాను. గ్రామాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ మంచి సందేశం ఇచ్చారు. మాకు ఇక్కడ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత జిల్లాస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఆరు నెలలకోసారి ప్రత్యేక శిక్షణ కోసం మమ్మల్ని పిలుస్తామన్నారు. ఒకట్రెండు గ్రామాల బాధ్యత తీసుకుని, మోడల్ విలేజ్‌లుగా చేయాలని బోధించారు. సీఎం మాపై ప్రధాన బాధ్యతపెట్టారు.

గ్రామాలకు మంచిరోజులు: శోభ, టీవోటీ

గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చేవిధంగా మాకు ట్రైనింగ్ ఇస్తున్నారు. మొదటిరోజు సీఎం కేసీఆర్ మాకు మార్గదర్శకంచేశారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వార్డుసభ్యుల బాధ్యతలను వివరించారు. వారికి ఎలా చెప్పాలో బోధించారు. సీఎం కేసీఆర్ చెప్పిన విషయాలు గ్రామాల్లో అమలుచేస్తే అవి చాలా అభివృద్ధి చెందుతాయి. ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. ఇది గ్రామాలకు మంచి పరిణామం.

గ్రామాలను అభివృద్ధి చేసుకుంటాం : సురేందర్, టీవోటీ

స్థానికసంస్థలను బలోపేతంచేయడం, గ్రామాల నుంచి బంగారు తెలంగాణ సాధించడంపై సీఎం కేసీఆర్ మాకు రోజంతా శిక్షణనిచ్చారు. గ్రామాల్లో అభివృద్ధిచేసే అంశాలను సమగ్రంగా వివరించారు. సీఎం కేసీఆర్ చెప్పినవిధంగా సర్పంచ్‌లకు అవగాహన కల్పించడమే కాకుండా మేం కూడా భాగస్వాములమవుతాం.

మాకు కొత్త విషయాలు తెలిశాయి: లింబగిరి స్వామి, గ్రామీణాభివృద్ధి సంస్థ సీనియర్ రిసోర్సర్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో టీవోటీలకు శిక్షణ ఇస్తున్నాం. చట్టంలో అన్ని రకాల నిబంధనలను వివరిస్తున్నాం. దీనిపై మాకు కూడా కొత్త విషయాలు తెలిశాయి. కొత్త పంచాయతీరాజ్‌చట్టంతో గ్రామాలు అభివృద్ధిలో ముందుంటాయి.

Aanjan Path Labs
& ALLERGY TESTING CENTRE
AFFORDABLE ACCURACY

అలర్జీ కొరకు టెస్ట్‌లను 8, 9 & 10 ఫిబ్రవరిన సగం కంటే తక్కువ ధరలకే కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లిల వద్ద చేయించుకోండి.

ఒక బ్లడ్ టెస్ట్‌తోనే అలర్జీకి గల కారణాలను గుర్తించవచ్చు

ముందుగానే గుర్తించుట వలన అలర్జీలకు (చర్మం, ఆహారం, శ్వాస (ఊపిరి)) చికిత్స చేయుటలో దోహదపడుతుంది

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లిల వద్ద అంజన్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్ యొక్క కలెక్షన్ సెంటర్లు 70-80 అలర్జీ కారకాలు (ఆహారం, చర్మం, శ్వాస, విస్తృతమైన) కలిగిన వాటికి 50% కంటే ఎక్కువ తగ్గింపుతో రాయితీగల రేట్ల వంతున అన్నిరకాల అలర్జీ (అలర్జీ) కొరకు అలర్జీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇవి **8, 9 & 10 ఫిబ్రవరిన ఉ. 9 గంటల నుండి సా. 5 గంటల వరకు** నిర్వహించబడతాయి. ఈ పరీక్షలు రెండు రోజులకు మొత్తం ధరలో సగం కంటే తక్కువ ధరకు నిర్వహించబడతాయి.

గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది. ఈ పరీక్ష మా ల్యాబ్‌లో అందుబాటులో వున్న ఫాడియా 250 మరియు యూరో బ్లాట్ ఒన్ వంటి ప్రత్యేకమైన మెషీన్ల ద్వారా చేయబడుతుంది.

డా. జి. సమ్రాట్ యాదవ్ (MBBS) – అలర్జీ అనేది ఒక వ్యాధి. అయితే, ప్రజలు దానిని అలా భావించరు. ఒకసారి అది ప్రారంభమైతే వ్యక్తులను ఇబ్బందికి గురిచేస్తూ వుంటుంది. ఒక వ్యక్తికి సువాసనలు నచ్చకపోతే అతనికి పూలంటే అలర్జీ. వ్యక్తులకు తమ పెంపుడు జంతువుల నుండి కూడా అలర్జీ వుండవచ్చు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స చేయించుకోవాలి. వీటికి చికిత్స వుంది. జాగ్రత్తలు కూడా పాటించాలి. **అలర్జీకి చికిత్స చేయుటకు వ్యాధి నిర్ధారణ మాత్రమే మార్గం.**


గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది.

డా. కె. శివ (MBBS) – ఒక వ్యక్తి రోజువారీ జీవితంలో అనేక సమస్యలను అలర్జీ కలిగిస్తుంది కనుక దానిని నిర్లక్ష్యం చేయకూడదు. ఒక వ్యక్తి ప్రత్యేకించి రుతు సంబంధ అలర్జీతో బాధపడుతుంటే అది ప్రమాదకరం కనుక అతను/ఆమె వెంటనే డాక్టరును సంప్రదించాలి. అలర్జీ వ్యాధుల వ్యాధి నిర్ధారణను వెంటనే చేయడంవల్ల దానికి చికిత్స చేయవచ్చు మరియు జాగ్రత్తలు తీసుకోవాలి. అలర్జీ యొక్క వ్యాధి నిర్ణయం జరిగినప్పుడు రోగికి చికిత్స చేయుట డాక్టరుకు సులభతరమవుతుంది.


డా. జె. రవికుమార్ (MD) – ఈ కాలంలో రోగి యొక్క బ్లడ్ శాంపిల్ ద్వారా అలర్జీ యొక్క వ్యాధి నిర్ధారణ చేయుట చాలా సులభం. ఒకసారి అలర్జీ వ్యాధిని గుర్తించి నిర్ధారించినట్లయితే, అలర్జీ యొక్క ప్రతిచర్యలను ఎదుర్కొనేందుకు అంతర్గతంగా అతని వ్యాధినిరోధక వ్యవస్థను ధృడం చేయుటకు కొంతకాలంపాటు డాక్టరు పేర్కొన్న మందులను రోగి తీసుకుంటూ వుండాలి మరియు దీని ద్వారా అతను జాగ్రత్తలు తీసుకొనవచ్చును మరియు అతని అలర్జీకి చికిత్స చేయవచ్చును.

అలర్జీ అంటే ఏమిటి ?

ప్రతి వ్యక్తి వారు పురుషులైనా లేదా మహిళలైనా ఇతర పదార్థాల ద్వారా కలిగే ఉద్దీపనలు సహించుటకు శక్తి కలిగి వుంటారు. అయినప్పటికీ కొన్ని పదార్థాలు ఒక వ్యక్తి వ్యాధినిరోధక వ్యవస్థలో అసాధారణ ప్రతిక్రియకు కారణమై అలర్జీని కలిగిస్తాయి.

అలర్జీ లక్షణాలు :

- చర్మం ఎర్రబడుట
- చర్మంపై దద్దుర్లు/దురద
- చర్మంపై మచ్చలు
- ముఖం, పెదవులు ఉబ్బుట
- కడుపు నొప్పి
- డయేరియా
- గొంతు నొప్పి, దగ్గు
- గజ్జి
- శ్వాస తీసుకొనుటలో ఇబ్బంది
- సొరియాసిస్
- దద్దుర్లు
- అలర్జిక్ రినైటిస్ (తుమ్ముట)



అలర్జీకి కారణాలు (అలర్జీ)

మన దైనందిన జీవితాలలో మన చుట్టుప్రక్కల వున్న అనేకమైన వాటి వలన అలర్జీలు కలుగవచ్చు.

గాలి ద్వారా వ్యాపించు అలర్జీలు, విత్తులు, జంతువ్యర్థాలు, ధూళి దూసరితాలు మరియు మౌల్డ్.

కొన్ని ఆహారములు, ప్రత్యేకించి పల్లీలు, చెట్టుకాయలు, గోధుమలు, సోయా, చేప, గవ్వచేపలు, గుడ్లు మరియు పాలు.

కీటకాల కాట్లు, తేనెటీగ లేదా వ్యాస్ప్.

మీరు తాకే ల్యాటెక్స్ లేదా ఇతర పదార్థాలు, వీటివలన చర్మానికి అలర్జీ ప్రతిచర్యలు ఏర్పడును.

కేవలం ఒక రక్త నమూనాతో మనం ఏ అలర్జీనైనా కనుగొనగలము మరియు వాటిని రోగనిరోధక బూస్టర్లు, యాంటీ అలర్జీ డ్రగ్స్ మరియు ఇమ్యూనో థెరపీల ద్వారా కూడా చికిత్స చేయవచ్చు.

ఉదాహరణకి గాలి పీల్చుకోవడం, దగ్గు మరియు జలుబుతో బాధపడుతూ ఆస్త్మా చరిత్ర వున్న ఒక 12 సంవత్సరాల బాలికను తీసుకుందాం. ఆమె తన ఊపిరికి చెందిన ఏ రుగ్మతలూ స్పష్టంగా తెలుపలేదు. ఆమె వైద్యచరిత్రలో తాను ఒక ఫిజీషియన్‌ను తన ఆస్త్మా కోసం సంప్రదించి, చక్కగా మందు కూడా తీసుకున్నది. అయినప్పటికీ ఆమెకి నయం కాలేదు. ఆమె డిస్ప్నియా మరియు ప్యూరిటీస్ చరిత్రలు కూడా కలిగి వుండి పీనట్స్, చిక్‌పీస్ మరియు లెంటిల్స్‌కి కూడా గురి అయినది. గతంలో ఆమె వీజింగ్ సందర్భాలు కాలానుసారంగా గడ్డికి, గాలిలో ఎగిరే విత్తులకు సంబంధించి వుండేది. ఆమెకి రక్త అలర్జీ పరీక్ష చేసి రోగనిరోధక థెరపీతో చికిత్స చేసి కొన్ని అలర్జీ నిరోధక డ్రగ్స్ ఇచ్చిన తరువాత ఆమె కోలుకున్నది. ఎవరికైనా శ్వాస సమస్యలు వున్నట్లయితే అతడు/ఆమె అలర్జీ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఒకసారి అలర్జీ (అలర్జీ) గుర్తించబడితే సగం సమస్య తీరినట్లే. దీనివలన ప్రత్యేకత కలిగిన డాక్టర్స్ ప్యానల్ సహాయం ద్వారా సరైన చర్య తీసుకునే అవకాశం కలుగుతుంది మరియు వారి అలర్జీకి సరైన మందులతో చికిత్స చేయవచ్చు.

యూరో బ్లాట్ మరియు ఫాడియాలు ఉపయోగించి అటువంటి అలర్జీలను డయాగ్నైజ్ చేయడానికి మా సర్వోత్తమ డాక్టర్ల ప్యానల్‌కి ప్రత్యేక శిక్షణ ఇవ్వబడినది.

ECHS/ESI/CGHS కార్డు హోల్డర్లు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అదనపు తగ్గింపు

అలర్జీలకు చికిత్స

ఒకసారి రోగనిర్ధారణ జరిగాక కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు మానుట వలన లేదా వైద్యం ద్వారా మందుల ద్వారా చికిత్స చేయవచ్చు. అలర్జీ నిరోధక వైద్యం లేదా అలర్జీలు తొలగించి ఇమ్యూనో థెరపీ అని పిలువబడే అనుభవజ్ఞులైన డాక్టర్లచే ప్రత్యేక వైద్యం కావచ్చు.



భారత్‌లో అలర్జీ పరీక్షకు మొదటి NABL అక్రెడిటెడ్ ల్యాబ్‌లలో జెరత్ పాథ్ ల్యాబ్స్ & అలర్జీ పరీక్షా కేంద్రం ఒకటి. జెరత్ పాథ్ ల్యాబ్స్ యొక్క సహ కంపెనీ ఆంజన్ పాథ్ ల్యాబ్. ఇప్పటివరకూ ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలో JPL ఉన్నది మరియు APL ద్వారా అది దక్షిణ భారత భాగంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో ప్రవేశించియున్నది.

న్యూరో సర్జన్ డా॥ వి.సుందర్, శ్రీమతి బకియావతి సుందర్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూవర్, అడ్మినిస్ట్రేటర్‌లు APLకి నాయకత్వం వహిస్తున్నారు.

EUROBlotOne



Tested by World Famous Modernities Machine (EUROBlotOne & Phadia 250)

Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE AFFORDABLE ACCURACY

CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

పరీక్ష కొరకు మమ్మల్ని సంప్రదించండి

KARIMNAGAR	ADILABAD	NIZAMABAD	WARANGAL	WARANGAL
9440075886, 9177126585	80961-46146, 98482-59306	08462-231458, 94400-90141	98490-83385	9949421565, 9505266230
Tata Hospital & Tata Path Lab, #6-3-370, Karkhanagadda, Peddapally Road, Karimnagar	Suraksha Diagnostic Center, Suraksha Children's hospital 1st Floor bank of baroda Complex, Jyothiba Pule chowk	Bharat Pathological Laboratry, Opp Bus Stand Lane, Beside Old City Cable Building Khaleelwadi	Thirumala Nursing Home,#10-12-73, Kasibuga Chowrsta Nr. Vivekanada Juinor College, Beside Yellamma Temple	Srinivasa Diagnostics, #16-5-104/1, Perukawada, Nr. Railway Gate, Opp. Prathaparudhra Sangam

JAGTIAL	KORATLA	MANCHERIAL	MANCHERIAL	RAMAGUNDAM	WARANGAL	PEDDAPALLI
93941-18119	94912-65834	9652211678, 08736-250678	9866514566, 8555949010	81069-59770	98490-75875	89196-59722
Janatha Diagnostics, Beside Dr. B. Shankar M.d, Hospital, Krishnanagar, Jagtial, Karimnagar,	M.J Diagnostics, Opp. SBI Koratla Branch, Old Bus Stand, Kortla Complex, Ailapur Road, Koratla	Health Care, Bellampally Chowrastha, Beside Andhra Bank, Mancherial	Sri Sai Diagnostics, Opp. Dcp Office, Near Carmel School, Acc, Mancherial	Moon Diagnostics, #4-2-171, Beside SBH-ATM, Jyothinagar, Medipally Rd., NTPC	Care Diagnostics, Beside Old Laxmi Talkies, Water Tank Rd., Charbouli, Warangal (krishna Salendra - Lab Technician)	M K Diagnostics, Masjid Road, Peddapalli

HELPLINE : +91 6383873278, +91 6383848063, +91 9500053404

'కిసాన్ సమ్మాన్' అమలు ఇలా..

మార్గదర్శకాలు విడుదలచేసిన కేంద్రం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలుపై కేంద్రం వేగం పెంచింది. ఈ పథకం మార్గదర్శకాల ముసాయిదాను బుధవారం విడుదల చేసింది. లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా ప్రదర్శించనున్నట్టు స్పష్టంచేసింది. అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే విన్నవించుకోవచ్చని తెలిపింది. ఈ నెల 25నాటికి రాష్ట్రంలో ఉన్న అర్హులైన చిన్న, సన్నకారు రైతుల జాబితాను సిద్ధంచేసి పీఎం-కిసాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. మొదటి విడుత సొమ్మును ఏడాదిలో ఎప్పుడైనా పొందేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 25 తర్వాత వివరాలు అప్‌లోడ్ చేసినా ఏడాదిలో ఎప్పుడైనా సొమ్మును ఖాతాలో వేస్తారు. ఐదెకరాల్లోపు ఉన్న ఒక కుటుంబం మాత్రమే రూ. 6వేలు పొందడానికి అర్హులుగా నిర్ధారించారు. తాజా మార్గదర్శకాలలోని మరికొన్ని ముఖ్యాంశాలు..

అనర్హులు వీళ్లు..

- ఉన్నతాదాయవర్గాల వారు
- వేర్వేరు ప్రాంతాల్లో వివిధ సంస్థల కింద ఐదెకరాల లోపు భూమి ఉన్న వారు
- రైతు కుటుంబంలో ఎవరైనా రాజ్యాంగ పదవుల్లో ఉంటే వర్తించదు
- తాజా, మాజీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ తాజా, మాజీ చైర్మన్లు
- ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు. నాలుగో తరగతి ఉద్యోగులకు మినహాయింపు.
- రూ.10వేల మించి పింఛన్ తీసుకునే ఉద్యోగులు, గతేడాది ఐటీచెల్లించిన వారు

సొంత ధ్రువీకరణే కీలకం..

- లబ్ధిదారులే సొంత ధ్రువీకరణ ఇవ్వాలి. తప్పుడు సమాచారమిస్తే సొమ్ము వాపస్ తీసుకోవటంతోపాటు చట్టపర చర్యలు.
- ఐదెకరాల లోపు భూమిని వివిధ చోట్ల ఉండి ఉన్నా, ఇద్దరు ముగ్గురు కలిసి చేసుకుంటున్నా వారికి కూడా అందజేస్తారు.
- లబ్ధిదారుల డాటాబేస్‌ను సమగ్రంగా పంపాలి. గ్రామం పేరు, వయస్సు, సామాజికవర్గం, బ్యాంకు ఖాతా, ఆధార్, సెల్‌నంబర్లు కూడా పంపాలి.

రాష్ట్రస్థాయిలో నోడ్ వ్యవస్థ ..

- పథకం పర్యవేణకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో కమిటీలు వేస్తారు. జాతీయ స్థాయిలో సమీక్ష కమిటీకి క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వం వహిస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో సమీక్ష కమిటీలు ఏర్పడుతాయి.
- కేంద్రస్థాయిలో ప్రాజెక్టు మానిటర్ యూనిట్ (పీఎంయూ)ను ఏర్పాటుచేస్తారు. దానికి సీఈవో ఉంటారు. ఇది పథకంపై ప్రచారంచేస్తుంది. అవగాహన కల్పిస్తుంది.
- పథకం అమలు పర్యవేక్షణకు ఒకనోడ్ వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. ఏదో ఒక ప్రభుత్వశాఖకు ఈ బాధ్యత అప్పగించాలి. వారికి ప్రోత్సాహకాలు ఇస్తారు.
- జిల్లాస్థాయిలో పీఎంకేఎస్‌వై పోర్టల్‌కు లాగిన్ అవకాశం కల్పిస్తారు. రైతులందరికీ వివరాలు అందుబాటులో ఉంటాయి.
- ఏ బ్యాంకు ద్వారా డబ్బును అందజేయాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించాలి.

'కేంద్రీయ, నవోదయ' ఇవ్వండి

- కేంద్ర మంత్రిని కోరిన కడియం, పెద్ది సుదర్శన్‌రెడ్డి
- 15 రోజుల్లో మంజూరుకు ప్రకాశ్ జవదేకర్ హామీ



బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రి కడియం శ్రీహరి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లోనూ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటుచేయాలని కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను మాజీమంత్రి కడియం శ్రీహరి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయ ప్రారంభం కూడా ఆలస్యమయిందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలిసి రాష్ట్రంలో పరిష్కరించాల్సిన సమస్యలపై వినతిపత్రాలను అందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో 21 నవోదయ, 13 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు అంశంపై సీఎం కేసీఆర్, విద్యాశాఖమంత్రిగా తాను అనేకసార్లతోపాటు ఇప్పుడు కూడా కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. 10-15 రోజుల్లో విద్యాలయాలను మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు.

యువతిపై ఉన్మాది దాడి

- ప్రేమను కాదన్నదని కత్తితో నరికిన డిగ్రీవిద్యార్థి
- బస్తీవాసులు చూస్తుండగానే బరితెగింపు
- షీటీమ్స్ కౌన్సెలింగ్ పొందిన నెలలోపే దారుణం
- గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు
- బాధితురాలు ఇంటర్ విద్యార్థిని
- దవాఖానలో చికిత్స.. పరిస్థితి విషమం



హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితురాలు మధులిక. (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)



నిందితుడు చిటకూరి భరత్

హైదరాబాద్ సిటీబ్యూరో/కాచిగూడ/మలక్‌పేట/ఉస్మానియా యూనివర్సిటీ: ప్రేమను నిరాకరించిందనే కోపంతో ఓ విద్యార్థి.. ఇంటర్ విద్యార్థినిపై కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఉన్మాదిగా మారిన డిగ్రీ విద్యార్థి బస్తీవాసులు చూస్తుండగానే దాడికి పాల్పడ్డాడు. దీంతో విద్యార్థిని తల, మెడ, వీపుభాగంలో తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉన్నది. కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బర్కత్‌పుర సత్యానగర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. స్థానికులు, బాధితురాలి కుటుంబసభ్యులు, తూర్పు మండలం డీసీపీ రమేశ్ కథనం ప్రకారం.. నల్లకుంట డివిజన్ సత్యానగర్‌కు చెందిన రాములు, ఉదయ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. రెండోకూతురు మధులిక (17) శివంరోడ్డులోని ఓ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది. ఇదేబస్తీకి చెందిన వేణుగోపాల్ కుమారుడు చిటకూరి భరత్ అలియాస్ సోను జాగృతి కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. మధులికను ప్రేమిస్తున్నానంటూ రెండేండ్లుగా వెంటపడుతున్నాడు. అతడి ప్రేమను నిరాకరిస్తూ వస్తున్న ఆమె.. వేధింపులు ఎక్కువ కావడంతో విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. వారు పలుమార్లు భరత్‌ను మందలించారు. అయినా వేధింపులు మానకపోవడంతో ఈనెల ఏడున షీ టీమ్‌కు ఫిర్యాదుచేశారు. షీటీమ్ సభ్యులు భరత్‌కు.. అతడి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. కొన్నిరోజులకు మళ్లీ వేధిస్తుండటంతో బాధితురాలి కుటుంబసభ్యులు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా అతడిని పిలిపించి మందలించారు.

అంతమొందించాలనే పథకం!

తన ప్రేమను నిరాకరించడం, కుటుంబసభ్యులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మధులికపై కోపం పెంచుకొన్న భరత్.. ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు. మంగళవారం రాత్రి కొబ్బరిబోండాల బండి వద్దనుంచి కత్తిని ఎత్తుకొచ్చి ఇంట్లో దాచిపెట్టుకున్నాడు. బుధవారం ఉదయం 8.20 గంటల సమయంలో మధులిక ఇంటి నుంచి కాలేజీకి బయలుదేరగా.. అడ్డుగా వెళ్లి ఆమెను బలవంతంగా పక్క గల్లీలోకి లాక్కెళ్లాడు. అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా కత్తితో దాడిచేసి పారిపోయాడు. అక్కడికక్కడే కుప్పకూలిన మధులికను కుటుంబసభ్యులు కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మలక్‌పేట యశోద దవాఖానకు తీసుకెళ్లారు.

15 చోట్ల తీవ్ర గాయాలున్నాయి

పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా పొడవడంతో యువతి శరీరంలో 15 చోట్ల పెద్ద గాయాలున్నాయని, తీవ్ర రక్తస్రావమైందని, శ్వాస తీసుకునే స్థితిలో లేకపోవడంతో కృత్రిమ శ్వాసను అందిస్తున్నామని యశోద దవాఖాన వైద్యులు తెలిపారు. తలపై, వెనుకభాగంలో బలమైన గాయాలయ్యాయని, పుర్రె ఎముక విరిగి మెదడులోకి చొచ్చుకెళ్లిందని పేర్కొన్నారు. 72 గంటల వరకు ఏమీ చెప్పలేమని, పరిస్థితి విషమంగానే ఉన్నదని ఆర్‌ఎంవో కిషన్‌రావు తెలిపారు.

గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు

ఘటన విషయం తెలియగానే ఉన్మాదిని పట్టుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. బుధవారం సాయంత్రానికే భరత్‌ను అరెస్టుచేసినట్టు డీసీపీ రమేశ్ తెలిపారు. ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. అతడికి నేరచరిత్ర లేదని, భయంలో ఉండటంతో ఏమీ చెప్పడం లేదని వివరించారు. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని విచారిస్తామన్నారు. హత్యకు ఉపయోగించిన కొబ్బరిబోండాల కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నామని, ఐపీసీ సెక్షన్ 307తోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసినట్టు వివరించారు.

టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య

- ప్రియుడి వేధింపులే కారణం: సోదరుడు దుర్గాప్రసాద్





సువ్వాడ ఝాన్సీ(ఫైల్) మృతదేహం

ఖైరతాబాద్: టీవీ సీరియల్ నటి సువ్వాడ ఝాన్సీ (21) ఆత్మహత్య చేసుకున్నారు. ప్రియుడు సూర్య వేధింపులే ఆత్మహత్యకు కారణమని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగురోజుల నుంచి తన సోదరి తీవ్ర మానసిక ఒత్తిడితో ఉంటున్నట్టు గమనించానని చెప్పారు.పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా ముదినెపల్లి మండలం వడాలికి చెందిన సువ్వాడ వెంకటేశ్వర్‌రావు, సంపూర్ణమ్మ దంపతుల కుమార్తె ఝాన్సీ తల్లిదండ్రులతో కలిసి సోమాజిగూడ-నాగార్జుననగర్‌కాలనీలోని సాయిరామ్ రెసిడెన్సీలో నివసిస్తున్నారు. గతఏడాది విజయవాడకు చెందిన సూర్యతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆర్నెళ్ల క్రితం ఇరువురు కుటుంబసభ్యులను పెండ్లికి ఒప్పించారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవలు తలెత్తాయి. సూర్యతో ప్రేమలో పడిన తర్వాత ఆమె టీవీ రంగానికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. గతనెల ఎల్లారెడ్డిగూడలో స్నేహితురాలితో కలిసి బ్యూటీపార్లర్‌ను స్థాపించారు.

డ్యూటీకి వెళ్లి వచ్చే సరికి

స్వగ్రామంలో తమ గృహప్రవేశ పనుల నిమిత్తం తల్లిదండ్రులు వెళ్లిపోయారు. అన్న దుర్గాప్రసాద్‌తో కలిసి ఝాన్సీ ఉంటున్నారు. మంగళవారం రాత్రి తొమ్మిదింటికి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన ఆయన తలుపులు కొట్టినా స్పందనరాలేదు. తలుపులను పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఝాన్సీ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని కనిపించింది. దుర్గాప్రసాద్ ఫిర్యాదుతో విచారణచేపట్టిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చూరీకి తరలించారు.

ఆమెకు అర్నెళ్లుగా దూరంగా ఉంటున్నా..



ఝాన్సీతో నాకు ఏడాదిగా పరిచయం ఉన్నది. ఆమెకు సినిమా చాన్స్ ఇప్పిస్తామంటూ బాబీ, గిరి అనే ఇద్దరు మభ్యపెట్టారు. నేను మోసంచేశానన్న ప్రచారంలో వాస్తవంలేదు. ఆర్నెళ్లుగా ఆమెకు దూరంగా ఉంటున్నాను. ఆమె ఆత్మహత్యకు నేనే కారణమని ప్రచారంచేయడం సరికాదు. **- సూర్యతేజ చౌదరి**

అణగారిన కులాల ప్రగతికి కృషి

ఆరెకటిక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ఈటల



బుధవారం రవీంద్రభారతిలో ఆరెకటిక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో గదతో ఎమ్మెల్యే ఈటల రాజేందర్. చిత్రంలో బీసీ కమిషన్ సభ్యుడు కృష్ణమోహన్‌రావు తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని కులాలు, జాతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా అణగారిన కులాల ప్రగతికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఆరెకటిక సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అన్ని కులాలు, జాతులకు అండగా నిలిచేందుకు సర్కారు వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తున్నదని చెప్పారు. బీసీ, ఎంబీసీల్లోని ఇతర కులాల మాదిరిగానే ఆరెకటికలకు ప్రభుత్వపరంగా పూర్తిసాయం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు పథకాలను సిద్ధంచేశామని, ఈ ఏడాదినుంచి వాటిని అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన తెలంగాణను సీఎం కేసీఆర్ ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. టీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, అందుకే అఖండ విజయాన్ని కట్టబెట్టారని ఈటల తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎంబీసీ సంఘం నేత సూర్యారావు, ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోగికార్ సుధాకర్, ఉపాధ్యక్షుడు బాలాజీ, సంఘం ప్రతినిధులు గురుచరణ్, సంతోష్, సుమతి, రమేశ్, నవీన్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో రేపటినుంచి సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఎస్‌ఐహెచ్‌సీ) 39వ వార్షిక సమావేశాలకు ఉస్మానియా యూనివర్సిటీ వేదికైంది. శుక్రవారంనుంచి మూడు రోజులపాటు సమావేశాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఓయూ గెస్ట్‌హౌజ్‌లో నిర్వాహకులతో కలిసి వారు మీడియాతో మాట్లాడుతూ.. చరిత్ర అన్ని సబ్జెక్టుల సమాహారమని అన్నారు. ఓయూలోని చరిత్ర విభాగం వందేండ్లు పూర్తిచేసుకుని శతాబ్ది ఉత్సవాలను జరుపుకొంటున్నదని, ఇందులోభాగంగా సమావేశాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంతోపాటు గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యిమందికిపైగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సమావేశాలకు హాజరుకానున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ అర్జున్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ శివదాసన్ తదితరులు పాల్గొన్నారు.

పాపవ్వకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన స్పీకర్ మాతృమూర్తి అంత్యక్రియలు
- శ్రీనివాస్‌రెడ్డికి పలువురు నేతల ఓదార్పు
- ఫోన్‌లో పరామర్శించిన సీఎం కేసీఆర్
- నేడు పోచారానికి ముఖ్యమంత్రి



బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం పోచారం శివారులో తమ భూమిలో పాపవ్వ అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి



పోచారంలో తన తల్లి పాపవ్వ పార్థివదేహాన్ని చూసి రోదిస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సోదరుడు పరిగె శంభిరెడ్డి

హైదరాబాద్/కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి పరిగె పాపవ్వ (107) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం పోచారం శివారులోని సభాపతి వ్యవసాయ భూమిలో ఆమె చిన్న కొడుకు, శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు పరిగె శంభిరెడ్డి చితికి నిప్పంటించారు. పాపవ్వ మనుమలు పరిగె రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తమ నానమ్మ పాడెమోసి తుది వీడ్కోలు పలికారు. స్పీకర్ తల్లి మరణవార్తను తెలుసుకున్న పలువురు ప్రముఖులు పోచారం గ్రామానికి తరలివచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారు. పాపవ్వ మృతి వార్త తెలిసిన వెంటనే సీఎం కేసీఆర్‌తోపాటు, హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఫోన్‌లో శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, గంప గోవర్ధన్, ఏ జీవన్‌రెడ్డి, షకీల్ అహ్మద్, గణేశ్‌గుప్తా, ఎమ్మెల్సీలు వీ గోవర్ధన్‌గౌడ్, రాజేశ్వర్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదార్ రాజు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు ఎన్ సత్యనారాయణ, ఎంఆర్‌ఎం రావు, నిజామాబాద్ డీఐజీ శివశంకర్‌రెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయ, జిల్లా, స్థానిక నాయకులు పాపవ్వ పార్థివదేహానికి నివాళులర్పించారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కే కేశవులు, తెలంగాణ అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు, అధ్యక్షుడు రాజరత్నం, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ తదితరులు పాపవ్వ మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పోచారం నివాసానికి వెళ్లినప్పుడు పాపవ్వతో ఉన్న చొరవను గుర్తుచేసుకున్నారు.

నేడు పోచారం గ్రామానికి సీఎం కేసీఆర్

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి పాపవ్వ (107) మృతి పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తంచేశారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే స్పీకర్‌ను సీఎం ఫోన్‌లో పరామర్శించారు. సభాపతిని, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు గురువారం పోచారం గ్రామానికి వెళ్లనున్నారు. ఉదయం పది గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడకు చేరుకుంటారు. అక్కడనుంచి రోడ్డుమార్గంలో నేరుగా పోచారం స్వగృహానికి వెళ్లి.. స్వర్గీయ పాపవ్వ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబీకులను కలిసి సానుభూతి వ్యక్తంచేస్తారు.

పాపవ్వకు జన నీరాజనం

పోచారం మాతృమూర్తి పాపవ్వ అంతిమయాత్రకు పోచారం గ్రామస్తులు, బంధువులు భారీగా తరలివచ్చారు. మనుమలు, మనుమరాళ్లు పాపవ్వను కడసారి చూసి, కన్నీరుమున్నీరయ్యారు. ప్రముఖులు, సామాన్య ప్రజల తాకిడితో పోచారం గ్రామం కిక్కిరిసినట్లయింది. శ్రీనివాస్‌రెడ్డి స్వగృహం నుంచి వ్యవసాయక్షేత్రం వరకు అంతిమయాత్ర సాగగా.. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంటకదిలివచ్చారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లుచేశారు.

కంటివెలుగు @ 1.45 కోట్లు

- రాష్ట్రంలో విస్తృతంగా వైద్య శిబిరాల నిర్వహణ



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పాండురంగ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో ఇప్పటివరకు 1,45,67,292 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. బుధవారం వరకు 107 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 8,854 గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని 806 వార్డుల్లో కంటిపరీక్షలు పూర్తిచేశారు. ఇప్పటివరకు మొత్తం 21,94,852 మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. మరో 17,20,859 మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు. శస్త్రచికిత్సలకు 8,93,482 మందిని రిఫర్‌చేశారు. కాగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 68,642 మందికి కంటిపరీక్షలు నిర్వహించి, 4,226 మందికి కండ్లద్దాలు పంపిణీచేశారు. శస్త్రచికిత్సలకు 3,064 మందిని రిఫర్‌చేశారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 4,01,525 మందికి కంటిపరీక్షలుచేసి.. 55,631 మందికి కండ్లద్దాలు పంపిణీచేశారు. వనపర్తి జిల్లాలో మొత్తం 2,94,920 మందికి కంటిపరీక్షలు చేసి.. ఇందులో 35,570 మందికి రీడింగ్ అద్దాలు ఇచ్చారు. 17,281 మందిని శస్త్రచికిత్సలకు రిఫర్‌చేశారు. కామారెడ్డి జిల్లాలో 5,08,105 మందికి కంటిపరీక్షలుచేసి.. వీరిలో 74,391 మందికి కండ్లద్దాలను పంపిణీచేశారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 5,91,344 మందికి, కొత్తగూడెం జిల్లాలో 4,81,672 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు.

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	బుధవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	68,642	1,45,67,292
రీడింగ్ అద్దాలు పొందినవారు	4,226	21,94,852
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	4,751	17,20,859
కంటి సమస్యలపై రెఫరల్	3,064	8,93,482
కంటి సమస్యలులేనివారు	56,601	97,58,099

కంటి వెలుగు

107 వ రోజు

గిప్పుడు మంచిగ కనవడుతున్నది



కొన్నేండ్ల సంది కండ్లు సరిగా కనబడక ఇబ్బందిపడుతున్నాను. పనిదీరక, పైసలెల్లక దవాఖానకు వోలె. మా వూళ్ల కంటివెలుగు శిబిరంల చూపించుకున్న. కంటిపరీక్షలుచేసి కండ్లద్దాలు ఇచ్చిండ్రు. అవి పెట్టుకుంటె గిప్పుడు మంచిగ కనవడుతున్నది. ప్రభుత్వం మంచి పథకం ప్రవేశపెట్టింది. **-నందగిరి మల్లీశ్వరి, బోయినపల్లి, రాజన్న సిరిసిల్ల**

ఆర్డరిచ్చిన కండ్లద్దాలు వచ్చాయి



నేను కంటివెలుగు శిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్నాను. వైద్యులు దూరపు చూపు సమస్య ఉన్నదన్నారు. హైదరాబాద్‌కు కండ్లద్దాలు ఆర్డర్ ఇచ్చి తెప్పించారు. ప్రస్తుతం కండ్లద్దాలు అందాయి. నా సమస్యకు పరిష్కారం లభించింది. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. **- వసంత, కొత్తగూడెం**

రామగుండం ఫర్టిలైజర్స్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి



బుధవారం ఢిల్లీలో కేంద్ర రసాయనశాఖ మంత్రి సదానందగౌడకు వినతిపత్రం అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

- కేంద్రమంత్రిని కోరిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పరిశ్రమ పునరుద్ధరణ పనులు పూర్తికానున్నాయని, ఈ పరిశ్రమలో ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని కేంద్ర రసాయనశాఖ మంత్రి సదానందగౌడను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. బుధవారం ఢిల్లీలో సదానందగౌడను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వీర్లపల్లి గ్రామాన్ని పునరావాసం కింద తీసుకోవాలని బహిరంగ విచారణలో కోరినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పరిశ్రమలో పనిచేసిన కార్మికుల వారసులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరామని, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల నియామకం ఆన్‌లైన్‌లో చేయడంతో స్థానికులకు నష్టం కలుగుతున్నదని కేంద్ర మంత్రికి వివరించినట్టు తెలిపారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందంపై 20సార్లు సమావేశమైనా స్పష్టతరాలేదని, ఈ అంశంపై కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గంగ్వార్‌ను కలిశామని తెలిపారు.



కక్ష్యలోకి జీశాట్-31

- బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ప్రయోగం
- కౌరు అంతరిక్ష కేంద్ర నుంచి ఏరియన్-5 రాకెట్ ద్వారా నింగిలోకి
- మెరుగుపడనున్న డీటీహెచ్ సర్వీసులు, ఏటీఎం నెట్‌వర్క్స్

బెంగళూరు, ఫిబ్రవరి 6: భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-31ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించింది. దక్షిణ అమెరికాలోని ఫ్రెంచి గయానాలో ఉన్న కౌరు అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ఏరియన్ స్పేస్(యూరప్‌కు చెందిన అంతరిక్ష ప్రయోగ సేవల సంస్థ)కు చెందిన ఏరియన్-5 (వీఏ 247) రాకెట్ ద్వారా దీన్ని దిగ్విజయంగా రోదసిలోకి పంపింది. జీశాట్-31భారత్‌కు చెందిన 40వ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇప్పటికే తుది దశకు చేరుకున్న పలు ఉపగ్రహాల స్థానంలో ఇది సేవలందించనుంది. 2,536 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం 15 ఏళ్ల పాటు సేవలు అందిస్తుంది. జీశాట్-31 ప్రయోగం విజయవంతమైందంటూ సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్ కే పాండియన్ ప్రయోగానంతరం ట్వీట్ చేశారు. ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఏరియన్ స్పేస్‌కు అభినందనలు తెలిపారు. ఏరియన్-5 రాకెట్ ద్వారా జీశాట్-31తోపాటు సౌదీ అరేబియాకు చెందిన 1/హెల్లాస్ శాట్ 4 ఉపగ్రహాన్ని కూడా నింగిలోకి పంపారు. జీశాట్-31 ద్వారా భారత్ ప్రధాన భూభాగంతోపాటు, మారుమూల దీవులకు కూడా కమ్యూనికేషన్ సేవలు అందుతాయని, అలాగే భూ స్థిర కక్ష్యలో కేయూ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్ సామర్థ్యం కూడా పెరుగుతుందని ఇస్రో వెల్లడించింది. ఈ ఉపగ్రహ ప్రయోగం ద్వారా డీటీహెచ్ టెలివిజన్ సర్వీసులు, ఏటీఎంలకు అవసరమైన వీశాట్స్ కనెక్టివిటీ, స్టాక్ ఎక్స్ఛేంజ్, డిజిటల్ సమాచారం, ఈ-గవర్నెన్స్ అప్లికేషన్లకు అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తుందని ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడించారు. అలాగే అరేబియా, బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాల్లో చాలా ప్రాంతాలకు కమ్యూనికేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రయోగించిన 42 నిమిషాల అనంతరం ఏరియన్-5.. జీశాట్ 31ను పెరిజి (భూమికి దగ్గరగా) 250 కి.మీ., అపోజి (భూమికి దూరంగా) 35,850 కి.మీ ఎత్తులో భూఅనువర్తిత బదిలీ కక్ష్య(జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టింది. అనంతరం దీన్ని కర్ణాటక రాష్ట్రం హసన్‌లోని మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ కేంద్రం శాస్త్రవేత్తలు తమ అధీనంలోకి తీసుకున్నారు. రాబోయే రోజుల్లో దీన్ని వివిధ దశల్లో 36,000 కి.మీ. ఎత్తులోని భూ స్థిర కక్ష్యలో ప్రవేశపెడతారు. కాగా, త్వరలోనే మరో కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-30ని ఇస్రో ప్రయోగించనుంది. జూన్ లేదా జూలైలో ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు షార్ డైరెక్టర్ పాండియన్ వెల్లడించారు.

లోక్‌పాల్ చైర్మన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులు

- ఎట్టకేలకు కేంద్రం ప్రకటన
- దరఖాస్తులకు 22 వరకు గడువు

న్యూఢిల్లీ: లోక్‌పాల్ నియామకం విషయంలో ఎట్టకేలకు ముందడుగు పడింది. లోక్‌పాల్ చట్టం అమల్లోకి వచ్చిన దాదాపు ఐదేండ్ల తర్వాత, లోక్‌సభ ఎన్నికల ముంగిట లోక్‌పాల్ చైర్మన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వశాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. లోక్‌పాల్ చైర్మన్ పదవికి సుప్రీంకోర్టు ప్రస్తుత, మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు మాజీ, ప్రస్తుత న్యాయమూర్తులు అర్హులు. అలాగే అవినీతి నిరోధక విధానం, ప్రజా పరిపాలన, నిఘా, ఆర్థిక (ఇన్సూరెన్స్, బ్యాంకింగ్) రంగాల్లో 25 ఏండ్ల విశేషానుభవం కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 45 ఏండ్ల లోపు ఉన్న వారు అనర్హులు. నిబంధనల ప్రకారం లోక్‌పాల్‌లో చైర్మన్, మరో ఎనిమిది మంది సభ్యులు ఉండాలి. వీరిలో నలుగురు న్యాయ విభాగానికి చెందిన వారు ఉండాలి. అలాగే 50 శాతానికి తక్కువ కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారు, మహిళలు ఉండనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్, సభ్యులు ఐదేండ్లపాటు లేదా వారికి 70 ఏండ్లు వచ్చే వరకు పదవిలో ఉంటారు. చైర్మన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమానంగా, సభ్యులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా జీతభత్యాలు ఉంటాయి. దరఖాస్తులు పంపడానికి ఫిబ్రవరి 22 చివరి తేదీ.





ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో సిబ్బందితో ప్రియాంక; మొదటిరోజు కార్యకలాపాల అనంతరం బయటకు వస్తున్న కాంగ్రెస్ నేత

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక బాధ్యతలు స్వీకరణ

న్యూఢిల్లీ: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకగాంధీ వాద్రా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమెను ఉత్తర్‌ప్రదేశ్ తూర్పు ప్రాంతానికి ఇంచార్జిగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. గురువారం రాహుల్ అధ్యక్షతన జరుగనున్న పార్టీ ప్రధాన కార్యదర్శులు, పలు రాష్ట్రాల ఇంచార్జిల సమావేశానికి ప్రియాంక కూడా హాజరుకానున్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఆమెకు ఓ గదిని కూడా కేటాయించారు. ఏఐసీసీ కార్యాలయానికి ప్రియాంక చేరుకోగానే అక్కడ ఉన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'ప్రియాంకగాంధీ ఆయీ హై, నయా రోషన్ లాయీ హై' (ప్రియాంకగాంధీ వచ్చారు. కొత్త వెలుగులు తెచ్చారు) అంటూ నినాదాలు చేయడంతో ప్రియాంక నవ్వుతూ అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఐసీసీ కార్యాలయానికి రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

వాద్రాను ప్రశ్నించిన ఈడీ

- స్వయంగా ఈడీ ఆఫీసు వద్ద భర్తను దిగబెట్టిన ప్రియాంక
- ఐదున్నర గంటలు ప్రశ్నించిన అధికారులు.. నేడు మళ్లీ విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: హవాలా లావాదేవీల కేసులో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరయ్యారు. చట్ట విరుద్ధంగా విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారని ఆయనపై ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. లండన్ నుంచి న్యూఢిల్లీకి రాగానే రాబర్ట్ వాద్రా బుధవారం తన భార్య ప్రియాంక గాంధీతో కలిసి మధ్య ఢిల్లీలోని జామ్‌నగర్ వద్దగల ఈడీ కార్యాలయానికి కారులో వచ్చారు. తద్వారా తమపై వచ్చిన ఆరోపణలపై వెనుకకు తగ్గే ప్రసక్తే లేదని బీజేపీకి ప్రియాంక పరోక్షంగా సందేశమిచ్చారు. వాద్రా అక్కడ దిగిన తర్వాత ప్రియాంక ఏఐసీసీ కార్యాలయానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ఆయన నా భర్త. నా కుటుంబం. నా కుటుంబానికి మద్దతుగా ఉంటా' అని ప్రకటించారు. ఇప్పుడే ఇదంతా ఎందుకు జరుగుతుందో అందరికీ తెలుసునని ఆమె వ్యాఖ్యానించారు. ఒక కేసుపై దర్యాప్తు సంస్థ ముందు రాబర్ట్ వాద్రా విచారణకు హాజరు కావడం ఇదే మొదటిసారి. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న వాద్రాను బుధవారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల రెండో తేదీన ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నెల 16 వరకు వాద్రాకు ప్రత్యేక న్యాయస్థానం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. తనను రాజకీయంగా వేధించడానికే ఈ ఆరోపణలు చేశారని, తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని వాద్రా పేర్కొన్నారు.

ఐదున్నర గంటల పాటు ప్రశ్నించిన అధికారులు

ఈడీ జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌లతో పాటు మరో ఐదుగురు అధికారులు వాద్రాను దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రశ్నించినట్లు సమాచారం. రాత్రి 9..40 గంటలకు వాద్రా ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. గురువారం కూడా ఈడీ అధికారుల ముందు వాద్రా విచారణకు హాజరు కానున్నారు. లండన్‌లోని అక్రమాస్తుల విషయమై 40కి పైగా ప్రశ్నలను సంధించి.. వాటికి రాతపూర్వక సమాధానాలు ఇవ్వాలని వాద్రాను ఈడీ అధికారులు కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. లండన్‌లో రెండు విలాసవంతమైన ఫ్లాట్లతోపాటు మొత్తం తొమ్మిది స్థిరాస్తులను (విల్లాలను) 2005-10 మధ్య వాద్రా కొనుగోలు చేశారని, కేవలం రెండు ఇండ్ల విలువే రూ.83 కోట్లు అని ఈడీ అభియోగం. వాద్రా సంస్థ స్కైలైట్ హాస్పిటాలిటీ సంస్థ ఉద్యోగి మనోజ్ అరోరాతో ఉన్న సంబంధాల గురించి కూడా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పరారీలో ఉన్న ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీతో సంబంధాలపై ప్రశ్నించారని తెలుస్తున్నది. యూపీఏ హయాంలో పెట్రోలియం, రక్షణ రంగ ఒప్పందాల్లో ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలపైనా వాద్రాను వారు ప్రశ్నించారని తెలిసింది. వాద్రా తరఫు న్యాయవాది సుమన్ జ్యోతి ఖైతాన్ మీడియాతో మాట్లాడుతూ 'వాద్రాకు వ్యతిరేకంగా దాఖలైన అభియోగాలన్నీ తప్పు. మేం 100 శాతం దర్యాప్తు సంస్థకు సహకరిస్తాం' అని తెలిపారు. కాగా, రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించడాన్ని పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ తప్పుబట్టారు. ఎన్నికల ముందు విపక్ష నేతలకు ఉద్దేశపూర్వకంగానే కేంద్రం దర్యాప్తు సంస్థల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నదని ఆరోపించారు.



ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి తన భార్య ప్రియాంకగాంధీతో కలిసి వస్తున్న రాబర్ట్ వాద్రా

శారీరక ధర్మం కారణంగా

మహిళలపై వివక్ష తగదు

వైఖరి మార్చుకున్న శబరిమల బోర్డు

- మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పుకు మద్దతు
- సమీక్షించాల్సిన అవసరం లేదన్న కేరళ ప్రభుత్వం
- తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కేరళలోని చారిత్రాత్మక శబరిమల ఆలయ ధర్మకర్తల మండలి ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) తన వైఖరిని మార్చుకుంది. అయ్యప్ప దర్శనానికి అన్ని వయస్సుల మహిళలను అనుమతించాలంటూ సుప్రీంకోర్టు గత ఏడాది సెప్టెంబర్ 28న ఇచ్చిన తీర్పునకు బోర్డు అనూహ్యంగా మద్దతు తెలిపింది. మరోవైపు తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను నిర్ద్వంద్వంగా రద్దు చేయాలని కేరళ ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. కాగా తీర్పును సమీక్షించాల్సిందేనని పలు సంస్థలు డిమాండ్ చేశాయి. అన్ని పక్షాల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన పలు రివ్యూ పిటిషన్లపై ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీడీబీ తన వాదన వినిపిస్తూ, 'మతాచారాలు అందరికీ సమానంగా ఉంటాయని ఆర్టికల్ 25(1) చెబుతున్నది. శారీరక ధర్మం కారణంగా మహిళలపై వివక్ష చూపించడం సరికాదు. శబరిమల అంశంలో న్యాయస్థానం తీర్పును అంగీకరిస్తున్నాం' అని పేర్కొంది. యాభై ఏండ్లలోపు రుతుక్రమ వయస్సు మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించబోమని టీడీబీ గతంలో పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఈసారి టీడీబీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదనలు వినిపిస్తూ, శారీరక ధర్మం కారణంగా మహిళల పట్ల ఏ అంశంలోనూ వివక్ష చూపడం సరైనది కాదు అని చెప్పారు. రాజ్యాంగంలో సమానత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అందరూ అంగీకరించాలని అన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడికి లొంగి తమ వైఖరిని మార్చుకోలేదని టీడీబీ అధ్యక్షుడు ఏ పద్మకుమార్ చెప్పారు. కోర్టు తీర్పుపై తాము రివ్యూ పిటిషన్ వేయలేదని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, బోర్డు భక్తుల పక్షాన లేవని పందళం రాజకుటుంబానికి చెందిన శశికుమార్ వర్మ ఆరోపించారు.



శబరిమల ఆలయానికి వస్తున్న మహిళలు (ఫైల్)

రివ్యూ పిటిషన్లన్నీ రద్దు చేయాలి: కేరళ ప్రభుత్వం

న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తాము కూడా అంగీకరిస్తున్నామని, రివ్యూ పిటిషన్లన్నింటినీ రద్దు చేయాలని కేరళ ప్రభుత్వం కోరింది. తీర్పును ఏ ప్రాతిపదికన సమీక్షించాలో ఏ ఒక్క రివ్యూ పిటిషన్‌లోనూ ఎవరూ పేర్కొనలేదని గుర్తు చేసింది. ఆలయాల ప్రవేశం నుంచి మహిళలను మినహాయించడం హిందూ మతంలో తప్పనిసరి కాదని తెలిపింది. కేరళ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ, శబరిమల తప్ప ఇతర అయ్యప్ప ఆలయాలలోకి మహిళలను అనుమతిస్తున్నారని తెలిపారు. ఆలయాలలో పాటించే సంప్రదాయాలు, మతంలోని ముఖ్యమైన సంప్రదాయాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమైన ఆచారాలను ఆలయాల వారీగా అమలు చేసుకుంటూ పోతే వాటి ఉద్దేశం నెరవేరని పరిస్థితి వస్తుందని వివరించారు. అయ్యప్ప ఆలయం ఒక కులం లేదా మత శాఖకు చెందిన వారిది కాదని, అయ్యప్ప భక్తులు హిందూ మతంలోని అన్ని కులాల్లో ఉన్నారని తెలిపారు. మతం, ఆలయానికి చెందిన ముఖ్యమైన సంప్రదాయాలను కలగాపులగం చేసి గందరగోళం సృష్టించే అలవాటు ఉన్నదని అంటూ.. ఆలయంలో పాటించే ముఖ్యమైన సంప్రదాయాలు మతపరంగా ఆచరించే ముఖ్యమైన ఆచారాలు కావని వివరించారు. సదరు ముఖ్యమైన ఆచారం హిందూ మతంలో ఉన్నదా, దానికి ఆర్టికల్ 25 వర్తిస్తున్నదా లేదా అన్నదానిని మాత్రమే రాజ్యాంగపరంగా పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. దేశంలోని అనేక ప్రముఖ ఆలయాలు దేనికవే ప్రత్యేకతను కలిగి ఉన్నాయని తెలిపారు. జగన్నాథ ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయం ఎంతో ప్రత్యేకమైనవని, తిరుపతి ఆలయానికున్న ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయలేమని చెప్పారు. ఈ ఆలయాలలో దేనిని కూడా ఒక కులం లేదా మత శాఖకు సంబంధించిన దానిగా పరిగణించలేమని అన్నారు.

సమీక్షించాల్సిందే: ఎన్‌ఎస్‌ఎస్

మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాల్సిందేనని నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్‌ఎస్‌ఎస్), ఆలయ ప్రధాన తంత్రి, పలువురు పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ తరఫున మాజీ అటార్నీ జనరల్ కే పరాశరణ్ వాదిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 దేశంలోని అన్ని ప్రభుత్వ, లౌకిక సంస్థలకు సంబంధించినదని తెలిపారు. దీనికి మత సంస్థలతో సంబంధం లేదన్నారు. సమాజంలో అంటరానితనం నిరోధానికి సంబంధించిన ఆ ఆర్టికల్‌ను అయ్యప్ప ఆలయం కేసు తీర్పులో కోర్టు ప్రతికూలంగా ఉపయోగించిందన్నారు. ఆలయంలో ఉన్న దేవుడు (అయ్యప్ప) బ్రహ్మచారి అని, ఆ విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. టీడీబీ మాజీ చైర్‌పర్సన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, 'ఆలయంలో ప్రవేశంపై కులాలు, మతాల ఆధారంగా స్త్రీలు, పురుషులపై ఎటువంటి నిషేధం లేదు. కేవలం కొన్ని వయస్సుల మహిళలపై మాత్రమే నిషేధం ఉంది. అందువల్ల ఆర్టికల్ 17 వర్తించదు' అని చెప్పారు. మరో న్యాయవాది శేఖర్ నఫాడే మాట్లాడుతూ, మత విశ్వాసాల విషయంలో కోర్టు జోక్యం చేసుకొని మతాన్ని ఎలా ఆచరించాలో సూచించకూడదన్నారు.

ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ వాటా 85శాతం

- గో రక్షణ కమిషన్ ఏర్పాటు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎన్టీపీసీ ఉత్పత్తి చేయనున్న విద్యుత్‌లో ఆయా రాష్ట్రాలకే 85 శాతం కేటాయిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఎన్టీపీసీ ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85 శాతాన్ని రాష్ట్రానికే కేటాయించాలని నిర్ణయించింది. రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ తొలి యూనిట్ నిర్మాణంలో ఉన్నది. తొలి దశలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు, రెండో దశలో 800 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లు నిర్మించనున్నారు. రూ. 11.8 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం 2020-21 కల్లా పూర్తి చేయాలని కేంద్ర క్యాబినెట్ సూచించింది. తెలంగాణలోని ఎన్టీపీసీలో ఉత్పత్తి చేసే 4000 మెగావాట్లలో రాష్ట్ర వాటా కింద 3,400 మెగావాట్లు అందుబాటులోకి రానుంది.

అక్రమ డిపాజిట్ల సేకరణపై నిషేధానికి చట్టం

అధిక వడ్డీల పేర మోసగించకుండా, కంపెనీల నుంచి మదుపరులను రక్షించేందుకు అక్రమ డిపాజిట్ పథకాల నిషేధ బిల్లు, 2018కు ప్రతిపాదించిన సవరణలను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. డిపాజిటర్లకు నష్ట పరిహారం చెల్లించేందుకు వ్యవస్థను రూపొందించేందుకు ఈ సవరణలను ప్రతిపాదించింది. ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాండింగ్ కమిటీ సిఫారసుల ఆధారంగా బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్.. అక్రమ డిపాజిట్ పథకాల నిషేధ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలను ఆమోదించింది. అక్రమ డిపాజిట్ల సేకరణను అడ్డుకోవడంతోపాటు ఈ పథకాల్లో పేదలు డిపాజిట్లు చేయకుండా నిరోధించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియాకు తెలిపారు. ఇక గ్రామీణ వ్యవసాయ మార్కెట్లను ఉన్నతీకరించేందుకు రూ.2000 కోట్లతో వ్యవసాయ మార్కెట్ మౌలిక వసతుల నిధి (ఏఎంఐఎఫ్)ని ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. సినిమాల పైరసీ, కాపీరైట్ హక్కుల ఉల్లంఘనను అడ్డుకునేందుకు సినిమాటోగ్రఫీ చట్ట సవరణలకు, ఈబీసీలకు రిజర్వేషన్ల అమలుకు సం బంధించి రాజ్యాంగ సవరణపై క్యాబినెట్ నోటు (ఎక్స్ పోస్ట్ ఫాక్టో)కు ఆమోదం తెలిపింది. గో పరిరక్షణ కమిషన్ ఏర్పాటుకు కూడా ఆమోద ముద్ర వేసింది. 2020 వరకు మూడేండ్ల పాటు ప్రసార భారతికి 'బ్రాడ్‌కాస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద రూ.1054 కోట్లను కేటాయించాలని కూడా కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది.

ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.10 కోట్ల బంగారం లూటీ


- బీహార్‌లో ఘటన



ముజఫర్‌పూర్: బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా భగవాన్‌పూర్ ప్రాంతంలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ 'ముత్తూట్ ఫైనాన్స్' కార్యాలయంలో రూ.10 కోట్ల విలువైన బంగారం బుధవారం చోరీకి గురైంది. ఐదు సంచుల నిండా గల పసిడి ఆభరణాలను సాయుధ దొంగల ముఠా ఎత్తుకెళ్లిందని జిల్లా సీనియర్ ఎస్పీ మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పిస్టళ్లతో ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలోకి ప్రవేశించిన ఆరుగురు సాయుధులు మేనేజర్ తలకు తుపాకీ పెట్టి సేఫ్ లాకర్ తాళంచెవులు ఇవ్వాలని బెదిరించారని సిబ్బంది వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. దొంగలు బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకునే కస్టమర్లుగా వచ్చారని గార్డు మనోజ్‌కుమార్ ఝా చెప్పాడు. వారిని లోపలికి తీసుకెళ్లిన తర్వాత ఒక వ్యక్తి తన తలపై కొట్టడంతో పడిపోయానని, స్పృహ కోల్పోతున్నప్పుడు వారు ఐదు సంచులను ఎత్తుకెళ్లడం గమనించానని, దీంతో జరిగిందేమిటో అర్థమైందన్నాడు.

వాదించే హక్కు దేవస్థానం బోర్డుకు లేదు

చిలుకూరు బాలాజీ ఆలయ వంశపారంపర్య అర్చకులు రంగరాజన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శబరిమల అయ్యప్ప స్వామిని అనాథగా వదిలేసి.. తమ సొంత వాదన వినిపిస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించే హక్కులేదని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్ పేర్కొన్నారు. మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన పందళం రాజవంశానికి మద్దతుగా ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమల కేసులో తాము ఇంప్లీడ్ కావడానికి సుప్రీంకోర్టు అంగీకరించలేదని.. దీంతో తాము పందళం రాజవంశానికి మద్దతు పలుకుతున్నట్టు తెలిపారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి దేవస్థానం బోర్డు మద్దతు పలుకడం అసమంజసమని పేర్కొన్నారు.

భయం రాజ్యమేలుతున్నది

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిదంబరం ఆందోళన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశంలో భయం రాజ్యమేలుతున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పీ చిదంబరం ఆందోళన వ్యక్తంచేశారు. 'ప్రస్తుతం దేశాన్ని భయం పరిపాలిస్తున్నదని చెప్పడానికి నేను వెనుకాడను. ప్రభుత్వ నిఘా, పొరుగు వాడి నుంచి ముప్పు, స్వీయ నిర్మిత నైతిక విలువల భయం వంటి అంశాలు పౌరులను వెంటాడుతున్నాయి' అని పేర్కొన్నారు. వివిధ దిన పత్రికల్లో చిదంబరం తాను రాసిన వ్యాసాల సంకలనాన్ని 'అన్‌డాంటెడ్: సేవింగ్ ది ఐడియా ఆఫ్ ఇండియా' అనే పేరుతో ముద్రించారు. దీనికి పీఠిక రాసిన చిదంబరం.. రాజ్యాంగ విలువలు.. స్వేచ్ఛ, సమానత్వం, ఉదారవాదం, లౌకికవాదం, వ్యక్తిగత గోప్యత, శాస్త్రీయత తదితర అంశాలపై దాడి జరుగుతున్నదని అన్నారు. భారత రాజ్యాంగం పెనుముప్పును ఎదుర్కొంటున్నదని, రాజ్యాంగం స్థానంలో హిందూత్వ స్ఫూర్తితో రూపొందించిన విధానం అమలులోకి వచ్చే ప్రమాదం పొంచి ఉన్నదని చిదంబరం ఆందోళన వ్యక్తంచేశారు. జాతి నిర్మాతలు దేశానికి కల్పించిన 'భారత్ అనే భావన'ను అంతం చేసే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. ఆ భావనను పునరుద్ధరించేందుకు మరో స్వరాజ్య పోరు, మరో మహాత్మాగాంధీ అవసరం అని పేర్కొన్నారు. శుక్రవారం విడుదల కానున్న ఈ పుస్తకానికి మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ముందుమాట రాశారు.

పాక్ సైన్యానికి ఆంక్షలు!

- రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఇకపై వీల్లేదు
- ఐఎస్ఐ కూడా చట్టానికి లోబడి పనిచేయాల్సిందే
- ఫత్వాలు చట్టవిరుద్ధం.. పాకిస్థాన్ సుప్రీంకోర్టు సంచలన తీర్పు



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6: పాకిస్థాన్ అత్యున్నత న్యాయస్థానం బుధవారం చారిత్రక తీర్పును వెలువరించింది. దేశంలో ప్రభుత్వాన్ని కూడా తమ అదుపాజ్ఞల్లో ఉంచుకోగల శక్తిమంతమైన ఆర్మీకి తాజాగా రెక్కలు కత్తిరించింది. సైన్యం ఇకపై ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సహా ఇతర సంస్థలు కూడా చట్టానికి లోబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. 2017లో తెహ్రీక్-ఏ-లబ్బాయిక్ పాకిస్థాన్(టీఎల్‌పీ), ఇతర సంస్థలు ఇస్లామాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిని దిగ్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం ఈ తీర్పు వెలువరించింది. ద్వేషం, తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అన్ని ప్రభుత్వ సంస్థలు, విభాగాలు, సైన్యం ఆధీనంలో పనిచేసే ఐఎస్ఐ వంటి సంస్థలు కూడా చట్ట నిబంధనల మేరకు పనిచేయాలని ఆదేశాలు జారీచేసింది. దీన్ని ఉల్లంఘించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధిపతులను, రక్షణ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇమ్రాన్‌ఖాన్‌కు సైన్యం మద్దతు ఇచ్చినట్లు పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. 1947లో పాకిస్థాన్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు సగం కాలం పాటు ఆ దేశంలో సైనిక పాలనే సాగింది. ప్రభుత్వ నిర్ణయాల్లో కూడా సైన్యానిదే కీలక పాత్ర. ఈ నేపథ్యంలో సైన్యాన్ని కట్టడి చేసే విధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడం విశేషం. ఇతరులకు హాని కలిగించే మతపరమైన ఆదేశాలు (ఫత్వాలు) కూడా చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి ఫత్వాలు జారీ చేసేవారి మీద పాకిస్థాన్ శిక్షా స్మృతి, ఉగ్రవాద నిరోధక చట్టం-1997 కింద విచారణ చేపట్టాలని ఆదేశించింది. చట్ట పరిమితులకు లోబడి పౌరులు, రాజకీయ పార్టీలకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని తెలిపింది. అయితే ఇది ఇతరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా ఉండకూడదని స్పష్టం చేసింది. రోడ్లను ఆక్రమించుకుని, ఆస్తులను ధ్వంసం చేసే నిరసనకారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. 2017 నవంబర్ 21న టీఎల్‌పీ, ఇతర సంస్థలకు చెందిన నిరసనకారులు సుమారు 20 రోజుల పాటు ఇస్లామాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిని దిగ్బంధించారు.

ముజఫర్‌నగర్ కేసులో ఏడుగురు దోషులు

- రేపు శిక్షలు ఖరారు

ముజఫర్‌నగర్, ఫిబ్రవరి 6: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో 2013లో అల్లర్లు చెలరేగడానికి ముందు హత్యకు గురైన ఇద్దరు వ్యక్తుల కేసులో ఏడుగురు నిందితులను కోర్టు దోషులుగా తేల్చింది. వీరికి శుక్రవారం శిక్షలను ఖరారు చేయనున్నది. 2013 ఆగస్టు 27న గౌరవ్, సచిన్ అనే ఇద్దరిని కొందరు హత్య చేశారు. దీంతో ముజఫర్‌నగర్‌లో అల్లర్లు చెలరేగి 60 మందికిపైగా మరణించారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు వ్యక్తుల హత్య వల్లనే ముజఫర్‌నగర్‌లో అల్లర్లు జరిగాయని తేల్చారు. ఈ ఇద్దరి హత్యలో ముజామిల్, ముజాసిమ్, ఫర్ఖాన్, నదీమ్, జహంగీర్, అఫ్జల్, ఇక్బాల్ ప్రధాన పాత్రధారులని నిర్ధారించి పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన స్థానిక కోర్టు ఏడుగురిని దోషులుగా తేల్చింది.



2016 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పోటీచేస్తున్నప్పుడు మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం ఎలా పనిచేస్తున్నదో అమెరికా ప్రభుత్వం కూడా అలాగే పనిచేస్తుందని చెప్పారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత మోదీ ప్రభుత్వ పనితీరును ఆయన ప్రశంసించారు.

యోగీ ఆదిత్యనాథ్, యూపీ ముఖ్యమంత్రి

ఆస్తుల కొనుగోలు వ్యవహారంపై రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించడం తీవ్రమైన విషయం కాదు. అందరికీ యథావిధిగా జారీచేసే నోటీసులే ఇవి. ఈ విషయంపై మేమంతా ఒకే తాటిమీద ఉంటాం, ఐకమత్యంగా ఉంటాం. కలిసి ముందుకు సాగుతాం.

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1836

చార్లెస్ డికెన్స్ వ్యాసాల సంకలనం 'స్కెచెస్ బై బోజ్' ప్రచురణ.

1959

క్యూబా నూతన రాజ్యాంగాన్ని ప్రకటించిన ఫిడెల్ కాస్ట్రో.





1969

పాలస్తీనా విముక్తి సంస్థ అధ్యక్షుడిగా ఎన్నికైన యాసర్ అరాఫత్.

అమెరికా అధ్యక్షుడు ఉభయ సభలను ఉద్దేశించి చేసే 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం రాజకీయంగా సాధించిన విజయాలను, ఆంతరంగిక, విదేశాంగ విధానాలను వివరిస్తుంది. కానీ ఇటీవలి ట్రంప్ ప్రసంగం ఆయన అతిశయాన్ని వెల్లడించింది. అమెరికా ప్రపంచంలోనే అగ్రశ్రేణి చమురు సహజవాయువు ఉత్పత్తిదారు అనీ, ఆర్థికంగా ప్రపంచానికి కన్నుకుట్టే విధంగా ఉన్నామని ట్రంప్ గొప్పలు చెప్పుకున్నారు. కానీ అమెరికాలోనే ఆయన ఏకాభిప్రాయం సాధించలేకపోతున్నారు. చరిత్రలోనే సుదీర్ఘకాలం షట్‌డౌన్ సాగింది.

గ్లోబల్ టైమ్స్

ప్రభుత్వ సేవలను మెరుగుపరుచడానికి, దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కేంద్ర రాష్ర్టాల సంబంధాలను పటిష్టపరుచాలని నిర్ణయించారు. అయితే ఇస్లామాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి, అధికార పార్టీ పీటీఐ పాలిస్తున్న పంజాబ్, కేపీ ముఖ్యమంత్రులు మాత్రమే హాజరయ్యారు. పీపీపీ అధికారంలో ఉన్న సింధ్, మిత్రపక్షాలు పాలిస్తున్న బలూచిస్థాన్ నుంచి ముఖ్యమంత్రులు హాజరుకాలేదు. వారికి ఆహ్వానం అందిందో లేదో తెలువదు. దేశాభివృద్ధి కోసం ఉమ్మడి కార్యాచరణ సాధించవలసిన బాధ్యత ప్రధానిపై ఉన్నది.

డాన్

అమెరికా బాధలు

గంపెడు ఆశలతో అమెరికాకు వెళ్ళిన వందలాది మంది మన దేశ విద్యార్థులు చట్టం చిక్కుల్లో చిక్కుకొని విలవిలలాడటం విషాదకరం. చట్టాన్ని అతిక్రమించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల్లో తెలంగాణ వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారు. చదువుకోవడానికి మాత్రమే అనుమతి పొందిన విద్యార్థులు, చదువు ముగిసిన తర్వాత స్వదేశం వెళ్ళకుండా, బోగస్ విద్యాసంస్థల్లో చేరి చట్టవిరుద్ధంగా కొనసాగుతున్నారనేది అమెరికా అధికారుల ఆరోపణ. ఈవిధంగా అక్రమంగా ఉంటున్నవారిని వల పన్ని పట్టుకోవడానికి అక్కడి అధికారులే ఒక బోగస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసి, అందులో చేరినవారిని, చేర్పించినవారిని అరెస్టు చేస్తున్నారు. భారతీయ విద్యార్థుల ఫీజుల రూపంలో అమెరికాకు ఏటా ఆరు వందల కోట్ల డాలర్ల మేర ఆదాయం లభిస్తున్నది. అమెరికాకు భారత దేశంతో సౌహార్ద్ర సంబంధాలున్నాయి. భారతీయులు అమెరికా ఆర్థి క వ్యవస్థ బలోపేతానికి ఎంతో సేవలు అందించారు. ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులు కూడా విద్రోహులో, ఉగ్రవాదులో కారు. పొట్ట పోసుకోవడానికి వచ్చిన విద్యార్థులపై మానవీయంగా వ్యవహరించడం అమెరికా బాధ్యత. అమెరికాలో బోగస్ విశ్వవిద్యాలయాలున్న మాట నిజం. అటువంటివాటిలో కొందరు విదేశీ విద్యార్థులు చేరుతున్నదీ నిజమే. ఈ అక్రమ పోకడల ను మార్గాలను అరికట్టాలంటే, అమెరికా అధికారులు చేయాల్సింది ప్రమాణాలు లేని విశ్వవిద్యాలయాలను అరికట్టడం. నిబంధనలను కఠినంగా అమలుచేయడం. కానీ బోగస్ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి విద్యార్థులను ప్రలోభపెట్టి, శిక్షించడం ఎంతవరకు నైతికమనే ప్రశ్న తలెత్తుతున్నది.

అమెరికాలో చట్టానికి చిక్కిన విద్యార్థులు తప్పు తెలిసి చేసినా ఏ పరిస్థితుల్లో చేశారనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలె. సాధారణంగా అమెరికాకు భారతీయ విద్యార్థులు రుణం తీసుకొని వెళ్తారు. రెండేండ్ల చదువు తర్వాత ఉద్యోగానికి అనుమతి లభిస్తుందో లేదో తెలువదు. తీరా ఉపాధి వీసా లభించకపోతే మరో రెండేండ్ల కోర్సులో చేరి అక్కడే కొనసాగుతారు. ఫీజుల కోసం, బతుకడానికి కష్టాలు మొదలవుతాయి. ఇవన్నీ తమను ప్రేమతో పెంచిన తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేని దయనీయస్థితి వారిది. కళాశాలలో చేరిన మొదటిరోజు నుంచే ఐచ్ఛిక ఆచరణాత్మక శిక్షణ (ఓపీటీ) లభించిందీ అంటే ఆ విశ్వవిద్యాలయంపై అనుమానం రావలిసిందే. కానీ అటువంటి విద్యాసంస్థ దొరుకడమే మహాభాగ్యంగా విద్యార్థులు భావిస్తారు. అక్కడి పరిస్థితిపై అందరికి పూర్తి అవగాహన ఉండదు. పల్లె నుంచి పట్నం పోయినా, అమెరికా తదితర దేశాలకు వెళ్ళినా వలసపోయిన వారి ఆలోచనా ధోరణిపై తమకన్నా ముందువచ్చిన వారి అనుభవాల ప్రభావం ఉంటుంది. అమెరికా పాలకులు తమకు చౌకగా శ్రమజీవులు కావాలనుకున్నప్పుడు, చట్ట విరుద్ధంగా ఉంటున్న వారిపట్ల, చదువుతూ ఉద్యోగాలు చేస్తున్న వారిపట్ల చూసీ చూడనట్టు వ్యవహరించారు. ఈ అనుభవాలె ఇక్కడినుంచి అనేకమంది యువతీ యువకులు అప్పుచేసి అమెరికా వెళ్ళడానికి ప్రేరణగా మారాయి. కానీ అమెరికా పాలకులు తమ అవసరం తీరిన తర్వాత నిబంధనలను కఠినంగా అమలుచేస్తున్నారు. ఈ విధానపరమైన మార్పు విద్యార్థుల నెత్తిపై పిడుగుపాటుగా మారింది.

> **యువతకు ఇతర దేశాలకు వెళ్ళవలసిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? విదేశీ వ్యామోహమే కారణమైతే, పట్టించుకోవలసిన అవసరంలేదు. కానీ ఇక్కడ వారి అభివృద్ధికి మార్గాలు మూతపడి ఉన్నాయా అనేది ఆత్మవిమర్శ చేసుకోవాలె. చెట్టుకు కాయలు బరువా అన్నట్టు, మన పిల్లలను పోషించుకోలేని దౌర్భాగ్య స్థితి ఏ సమాజానికీ ఉండదు. భారతీయ సమాజానికి అంతకన్నా లేదు. మన శక్తియుక్తులు మనకోసం ఉపయోగపడేవిధంగా విధాన రూపకల్పన చేయడం మన పాలకుల బాధ్యత.**

తల్లిదండ్రులు ఎంతో ప్రయాసపడి అమెరికాకు పంపిస్తే, ఉత్త చేతులతో తిరిగిరావడం విద్యార్థులకు బాధగానే ఉంటుంది. కానీ మెడపట్టి గెంటుతున్నప్పుడు, గౌరవంగా తిరిగివచ్చి స్వదేశంలో కానీ మరో దేశంలో కానీ తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడమే ఉత్తమమైన మార్గమని న్యాయనిపుణులు సూచిస్తున్నారు. అమెరికాలో దిక్కుతోచకుండా ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి టీఆర్‌ఎస్ అనుబంధ విభాగం, కొన్ని ప్రవాస సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమైనది. తెలంగాణ సమాజం కూడా వచ్చే విద్యార్థులకు నైతిక మద్దతు ఇవ్వాలె. తప్పయినా ఒప్పయినా అమెరికా ప్రభుత్వం తన అవసరాలకు తగినట్టు తన విధానాలను అమలుచేస్తున్నది. కానీ మనం చేయవలసిందేమిటనేది కూడా ఆలోచించాలె. భారత ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి తన శక్తిమేర కృషిచేయాలె. ఈ సమస్యను ఇక్కడితో వదిలేయకూడదు. కేంద్ర ప్రభుత్వం, భారతీయ సమాజం ఈ పరిస్థితులపై మరింత విస్తృత చర్చ జరుపాలె. ఒకప్పుడు వైద్యులు, ఆ తర్వాత ఇంజినీర్లు – ఇంకా భిన్నరకాల ఉన్నత విద్యావంతులను అమెరికా అవసరాలకు తగినట్టు తయారుచేయడం తప్ప మనకు గత్యంతరం లేదా అనేది విధానకర్తలు, భిన్నరంగాల నిపుణులు ఆలోచించాలె. యువతకు ఇతర దేశాలకు వెళ్ళవలసిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? విదేశీ వ్యామోహమే కారణమైతే, పట్టించుకోవలసిన అవసరంలేదు. కానీ ఇక్కడ వారి అభివృద్ధికి మార్గాలు మూతపడి ఉన్నాయా అనేది ఆత్మవిమర్శ చేసుకోవాలె. చెట్టుకు కాయలు బరువా అన్నట్టు, మన పిల్లలను పోషించుకోలేని దౌర్భాగ్య స్థితి ఏ సమాజానికీ ఉండదు. భారతీయ సమాజానికి అంతకన్నా లేదు. మన శక్తియుక్తులు మన కోసం ఉపయోగపడేవిధంగా విధాన రూపకల్పన చేయడం మన పాలకుల బాధ్యత.

ఆలోకన



టంకశాల అశోక్

సీపీఎం హృదయ పరివర్తనా?

సీపీఎం తెలంగాణ కమిటీకి తెలంగాణ పట్ల హృదయ పరివర్తన కలుగుతున్నదా? కమిటీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం జనవరి 21వ తేదీన విడుదల చేసిన ఒక ప్రకటన గమనించినప్పుడు ఈ సందేహం కలుగుతున్నది. ఆ ప్రకటనలో ఆయన తెలంగాణ సమస్యల గురించి ప్రస్తావించారు. వాటికి పరిష్కారాలను కోరుకున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు రావలసిన నిధులను, ప్రాజెక్టులను ఇప్పటికీ ఇవ్వకుండా కేంద్రం వివక్షను చూపుతున్నదనేది వాటిలో ఒకటి. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేటికీ జాతీయ హోదా ప్రకటించలేదనేది రెండు. రైల్వే పథకాలు, విద్యాసంస్థలు, వైద్య సంస్థలు, ఐటీఐఆర్ కారిడార్ మంజూరు మూడు. వీటిని ఆయన ప్రస్తావించమే కాదు, కేంద్ర వైఖరిని అన్ని పార్టీలు తీవ్రంగా ఖండించాలని, నిధులు రాబట్టేందుకు అఖిలపక్ష బృందం ఢిల్లీకి వెళ్లాలని కూడా అన్నారాయన.

ఈ వార్తను పత్రికల్లో చూసినప్పుడు బహుశా అందరూ వెంటనే నమ్మి ఉండకపోవచ్చు. కానీ మళ్లీ చదివినప్పుడు కూడా అక్షరాలు ఏమీ మారనందువల్ల నమ్మక తప్పలేదు. పైగా, అటువంటి ప్రకటన ఏదీ తాము ఇవ్వలేదని సీపీఎం పార్టీ ఖండించలేదు. కను క, అది నిజమేనని మూడవ రోజుకు ధృవీకరణ అయ్యింది. సీపీఎం గురించి ఇంత అపనమ్మకం ఎందువల్లనో ప్రత్యేకంగా వివరించనక్కరలే దు. 68 సంవత్సరాల కిందటి తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని మినహాయిస్తే, కమ్యూనిస్టులు తాము ఉమ్మడి పార్టీగా ఉన్నప్పుడు గాని, చీలిపోయిన తర్వాత గాని తెలంగాణ బాగును ఎప్పుడూ పట్టించుకోలేదు. తమ కాలం చెల్లిన వాదనలలో తాము మునిగిపోయి అదే సరైనదనుకున్నారు. ప్రజల మనోభావాలు వారికి ఎప్పుడూ పట్టలేదు. లేదా సీమాం ధ్ర ధనిక వర్గాల ప్రయోజనాల కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పనిచేస్తూ, అందులోనే తెలంగాణ ప్రజలకు కూడా మోక్షం ఉందని నమ్మించజూశారు. ఇదంతా అమాయకత్వంగానో, అవగాహన లేకనో జరిగింది కాదని, ఉభయ కమ్యూనిస్టులు ఆ పని బుద్ధి పూర్వకంగానే చేసాయనే నమ్మకం తెలంగాణ ఆలోచనాపరులకు ఏర్పడిపోయింది. అందువల్లనే ఈ పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకాలంలో, ఆ తర్వాత ఇంతగా క్షీణించిపోయాయి. తమ్మినేని ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగించటం ఈ నేపథ్యం వల్లనే.

తెలంగాణ సమస్యల గురించి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్ర హామీలు అమలుకాకపోవటం గురించి కమ్యూనిస్టు పార్టీలు అసలు ఒక్క అక్షరం అయినా మాట్లాడలేదని కాదు. కాని వాటి గురించి ఎవరికీ గుర్తు అయినా లేనంత అరుదుగా, అరకొరగా రెండు ముక్కలు ఎప్పుడైనా అని ఉంటారు. ఇక్కడి పార్టీలుగా, ఈ ప్రాంతం పట్ల, ఇక్కడి ప్రజల పట్ల ఆం దోళన ఉన్న వారి వలె, నిబద్ధత గలవారి వలె మాత్రం ఒక్కసారి అయినా మాట్లాడలేదు. ఈ విషయమై చెప్పగలది చాలా ఉంది. ప్రస్తుతానికి ఒకే ఒక ఉదాహరణను చూద్దాం. తిరిగి వీరభద్రం ప్రకటనకు పోదాము. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయపు కేంద్ర హామీల గురించి ఆయన మాట్లాడారు. అప్పటి హామీలు ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఉండటం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు గల హామీల గురించి అక్కడి సీపీఐ, సీపీఎంలు నిరంతరం మాట్లాడుతూ వస్తున్నాయి. స్వయంగా తాము, అదేవిధంగా ఇతర పార్టీలతో కలిసి అనేక ఆందోళనలు జరిపాయి. తాము ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు పూర్తిగా కట్టుబడినట్లు వ్యవహరించాయి. ఆ వ్యవహరణలో ఒక్కోసారి వాస్తవిక దృష్టి లేని పాప్యులిజం ఉన్నట్లు కూడా తోచింది. ఉదాహరణకు ప్రత్యేక హోదా. అది సాధ్యం కానిదనేది స్వతం త్ర పరిశీలకులు చెప్తున్న విషయం. కేంద్రం అధికారికంగా అదే మాట పలుమార్లు చెప్పింది. అయినప్పటికీ సాధారణ ప్రజల్లో అది ఒక సెంటిమెంట్‌గా మారినందున ఆ పేరిట లాభపడేందుకు ఇతర పార్టీలు ప్రయత్నించిన పద్ధతినే కమ్యూనిస్టులు కూడా నేటికి కూడా అనుసరిస్తున్నారు. దాని ని ఇక్కడ ఖండించటం లేదు. కాని మంచికో, చెడుకో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టులు అందుకు కట్టుబడ్డారన్నది స్పష్టం. అందుకు వారిని అభినందించాలి.

వారితో పోల్చితే తెలంగాణ కమ్యూనిస్టులు ఏమి చేశారన్నది ప్రశ్న. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన హామీలు అమలుకాకపోవటంపై ఈ నాలుగున్నరేండ్లలో వారు ఏమీ మాట్లాడారో, ఏమి చేశారో వారికి తెలుసు, ప్రజలకు తెలుసు. రాష్ట్రం పక్షాన కేంద్రానికి ఈ విషయాలపై 30 లేఖలు రాసినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్తున్నారని, కాని అందువల్ల ఉపయోగం ఉండదని, అన్ని పార్టీలు ముందుకు వచ్చి సాధించాలని తమ్మినేని తమ లేఖలో అన్నారు. సీఎం లేఖల వల్ల ఏమైనా జరుగుతుందా లేదా అన్నది ఇక్కడ చర్చించనక్కరలేదు. కానీ ఆయన తన లేఖల గురించి తర చూ చెప్తూనే ఉన్నారు. తరచూ ఢిల్లీ వెళ్తున్నారు. తరచూ తన మంత్రుల ను, అధికారులను పంపుతున్నారు. ఇదంతా తమ్మినేని సహా అందరికీ తెలిసిందే గానీ రహస్యం కాదు. అటువంటి స్థితిలో, ఈ విషయాల గురిం చి ఉభయ కమ్యూనిస్టులు ఇంతకాలం ఏమి మాట్లాడాయి, ఏమీ చేసాయన్నది ప్రశ్న. ఆంధ్రప్రదేశ్ హామీల విషయమై అక్కడి కమ్యూనిస్టులు మాట్లాడిన దానితో, చేస్తూ వస్తున్న దానితో పోల్చితే వీరిక్కడ చేసిందేమి టో వారు నిజాయితీతో, ధైర్యంగా తెలంగాణ ప్రజలకు వివరించగలరా? పోనీ అక్కడి వారితో పోల్చుకోనక్కరలేదు. సాధారణ రూపంలోనైనా చేసిందేమిటో చెప్పగలరా? రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరంతరం విమర్శిస్తూ పోవటం కాకుండా. విమర్శించటం ప్రతిపక్షాలుగా తమ విధి అయినందున ఆ పనికి అభ్యంతరం ఉండనక్కరలేదు. కానీ ఒకవైపు ఆ పని చేస్తూ నే మరొకవైపు తెలంగాణ ప్రయోజనాల పట్ల తమ బాధ్యతగా చేయవలసింది కూడా చేయాలి కదా. అది జరిగిందా?

వీరిది తెలంగాణ పట్ల మొదటి నుంచి ఇదే వైఖరి అయింది. భాషా రాష్ట్రాల పేరిట తెలంగాణను బలవంతంగా ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి న శక్తులలో భాగం కావటం ద్వారా ఈ క్రమం మొదలైంది. భాషా ప్రాతిపదికగా జాతుల ఏర్పాటు, అభివృద్ధి అనే సూత్రంతో మౌలికంగా తప్పు ఏమీ లేదు. కానీ ఇతర వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా భాషా సూత్రాన్ని గుడ్డిగా అనుకరించటం తగదని స్వయంగా స్టాలిన్ స్పష్టం చేశా డు. అయినప్పటికీ తెలంగాణలోని ఇతర వాస్తవాలను తోసిపుచ్చి, సీమాంధ్ర ధనికుల ప్రయోజనాల కోసమని తెలంగాణ ఉనికిని, ప్రత్యేకతను, ప్రజల కోరికను ధ్వంసం చేయబూనారు. అప్పటి హామీలు అమలు కానందున తెలంగాణ ప్రజలు నిరసనలు తెలిపినా, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు సరికదా, ప్రభుత్వంతో చేతులు కలిపి ప్రజలను అణిచివేసేందుకు పోయారు. హామీలు అమలుకాకపోవటంపై అసెంబ్లీలో గాని, బయట గాని మాట్లాడలేదు, ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదు. ప్రజల నిరసనలకు స్వార్థపర నాయకుల రాజకీయం అంటూ ముద్రలువేసి ఈసడించి ఢిల్లీ వరకు ప్రచారాలు సాగించారు. చివరిలో సీపీఐ తన అభిప్రాయం మార్చుకున్నది గాని, మార్క్సిస్టు నిష్టాగరిష్టతలో తమను మించినవారు లేరని అహంకరించే సీపీఎం, పార్లమెంట్‌లో విభజన బిల్లు వచ్చినప్పుడు సైతం సీమాంధ్ర ధనికులతో కలిసి చాలా విన్యాసాలు చేసింది. అందుకే వీరిపట్ల ప్రజల విశ్వాసాలు అడుగంటాయి.


> తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రెండు పార్టీలు కూడా నిరంతర విమర్శలు ఒక్కటే తమ బాధ్యత అయినట్లు, తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడటం గాని, కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో తమకు నిమిత్తం లేదన్నట్లు వ్యవహరిస్తూ వచ్చాయి. అటువంటి వారిని ప్రజలు ఏ విధంగా విశ్వసించగలరు? అందువల్లనే ఇటీవలి ఎన్నికల్లో వారికి అటువంటి దయనీయ స్థితి ఎదురైంది. దానినుంచి బయటపడటం సీపీఐకి ఎంత ఇష్టమో తెలియదు గాని, తమ్మినేని అందుకు సుముఖులా అనిపిస్తున్నది.

ఆ విధమైన చరిత్రకు ఉభయ కమ్యూనిస్టులు 2014తో స్వస్తి పలుకుతారేమోననుకుంటే అది జరుగకపోవటం మరొక విషాదం. తెలంగాణను అంతకుముందు వరకు వ్యతిరేకించిన సీపీఎం, 2014 తర్వాత కూడా ఈ రోజువరకు ఎండార్స్ చేయకుండా, విభజన తప్పు అనే మాట సంద ర్భం వచ్చినప్పుడల్లా అంటూనే ఉన్నది. ఈ అంశంపై తెలంగాణ ప్రజల తో ఒక డైలాగ్ అనదగ్గది ఉద్యమ కాలమంతా చేయని ఆ పార్టీ, 2014 తర్వాత కూడా అటువంటి డైలాగ్ ఏమీ లేక, తమ వ్యతిరేకతను ప్రజలు 'మరిచిపోతున్నారు' గనుక ఇక ఆవిషయం పట్టించుకోనక్కరలేదు, చింతించనక్కరలేదనే నిజాయితీ లేని, అతిహీనమైన సూత్రీకరణలతో సంతృప్తి చెందుతూ, ప్రజలను వంచించి ఆత్మవంచనకు పాల్పడుతున్నది.

అయినా దీనినంతా విస్మరించవచ్చుననుకుంటే, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రెండు పార్టీలు కూడా నిరంతర విమర్శలు ఒక్కటే తమ బాధ్యత అయినట్లు, తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడటం గాని, కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో తమకు నిమిత్తం లేదన్నట్లు వ్యవహరిస్తూ వచ్చాయి. అటువంటి వారిని ప్రజలు ఏ విధంగా విశ్వసించగలరు? అందువల్లనే ఇటీవలి ఎన్నికల్లో వారికి అటువంటి దయనీయ స్థితి ఎదురైంది. దానినుంచి బయటపడటం సీపీఐకి ఎంత ఇష్టమో తెలియదు గాని, తమ్మినేని అందుకు సుముఖులా అనిపిస్తున్నది. కానీ ఆ మార్పు తెలంగాణ ఏర్పాటును ఎండార్స్ చేయటంతో మొదలుకావాలి.

ముంచుకొస్తున్న నిరుద్యోగ సంక్షోభం

జాతీయం



సంతోష్ మెహ్రోత్ర

గత కొంతకాలంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని అనేక ఆర్థికసంస్థల అధ్యయనాలు, సర్వేలు చెబుతున్నా, ప్రభుత్వం మాత్రం నిరుద్యోగం ఆందోళన కలిగించే స్థాయిలో ఏమీ పెరుగటం లేదని చెప్పుకొస్తున్నది. నిరుద్యోగం పెరుగుతున్నదన్న వాదనలు నిజం కాదని, ఉద్యోగ కల్పన, జీవనోపాధి తదితరాలతో నిరుద్యోగాన్ని అదుపులో ఉంచుతున్నామని ప్రభుత్వ పెద్దలు, సర్కారీ ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రముఖ ఆర్థిక సర్వే సంస్థల ప్రకారం ఉత్పాదక పనుల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్య 2011-12లో 58.9 మిలియన్లు ఉంటే, అది 2015-16 నాటికి అది 48.3 మిలియన్లకు పడిపోయింది. వాస్తవ గణాంకాలు ఈ విధంగా ఉన్నా ప్రభుత్వ పెద్దలు మాత్రం అవన్నీ వాస్తవాలు కాదని నమ్మబలుకటం గమనార్హం.

నిరుద్యోగం విషయంలో ఆర్థికవేత్తలంతా ప్రభుత్వ వాదనలతో విభేదిస్తున్న స్థితి ఉన్నది. దానికి ఆర్థికవేత్తలంతా విస్తారమైన గణాంకాలను ఆధారంగా చూపుతున్నారు. వారి అధ్యయనాల ప్రకారం దేశంలో చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య భారీస్థాయిలో పెరిగింది. చదువుకున్న యువత అంతా వ్యవసాయేతర పనులు, కంపెనీల్లోనే పనిచేయటానికి ఇష్టపడుతున్నారు, కానీ వ్యవసాయంలో ఉండిపోవటానికి సిద్ధపడటం లేదు. దేశంలో నిరుద్యోగాన్ని తెలుసుకోవటానికి చేస్తున్న అధ్యయనాలు ప్రధానంగా.. ఇంటింటి వార్షిక సర్వే, లేదా లేబర్ బ్యూరో (ఎల్‌బీ), లేదా నేషనల్ సాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ)లు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) చేసే సర్వే కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ సంస్థలన్నీ సంఘటిత, అసంఘటిత కార్మికులను అధ్యయనం చేసి ఉద్యోగితను గణిస్తున్నాయి.

ఈ అధ్యయనాలు ఎలా ఉన్నా, ప్రభుత్వం మాత్రం పదేపదే గతంతో పోలిస్తే నిరుద్యోగం అదుపులోనే ఉన్నదని చెప్పుకొస్తున్నది. దేశంలో ఉపాధి కల్పన, ఉద్యోగ కల్పన, నిరుద్యోగం లాంటి విషయంలో విస్తారమైన అధ్యయనాలు, గణాంకాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని అధ్యయనాల ప్రకారం ప్రత్యక్ష నిరుద్యోగం ఎక్కడచూసినా కనిపిస్తున్నది. ఇందులో నామమాత్ర ఉద్యోగాలు, ప్రచ్ఛన్న నిరుద్యోగం కూడా కలుపుకొని చూసే వాస్తవం కండ్లకు కడుతుంది. ఉన్నతస్థాయి చదువులు ఉండి కూడా జీవనోపాధి కోసం ఏదో చిరుద్యోగాల్లో ఉన్నవారి శాతం తక్కువేమీ కాదు. అలాగే అవసరం లేకున్నా ఒకరిద్దరు చేసే పనిలో నలుగురు పనిలో ఉండటం లాంటి ప్రచ్ఛన్న నిరుద్యోగం కూడా ఉంటున్నది. ప్రభుత్వ అధ్యయనాల ప్రకారమే.. 1977-78 నుంచి 2011-12 దాకా నిరుద్యోగ శాతం 2.6 శాతం పెరిగింది. కానీ అది 2017-18 నాటికి అది 6.1 శాతానికి చేరుకున్నదంటే నిరుద్యోగం ఏ రీతిన పెరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇదింకా కిందిస్థాయిలోకి వెళ్లిచూస్తే భీతిగొలిపే వాస్తవాలు తెలుస్తున్నాయి. 18-23 ఏండ్ల మధ్య వయస్సున్న వారిలో 2006లో నిరుద్యోగ శాతం 11 ఉంటే, అది 2016 నాటికి 26 శాతానికి చేరుకున్నది. 9,10 తరగతులు చదివిన నిరుద్యోగ శాతం 15-16 ఏండ్ల వారు 2010లో 58 శాతం నిరుద్యోగం ఉంటే, అది 2016 నాటికి 90 శాతానికి చేరుకున్నది. ఇలాంటి యువత కూడా వ్యవసాయరంగంలో ఉండటానికి ఇష్టపడకుండా ఏదేనీ కంపెనీలోనే పనిచేయటానికి ఇష్టపడుతున్నారు. ఇలాంటి యువత కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగం దొరుకకపోతే ఏ పనిలేకుండా నిరుద్యోగులుగానే ఉంటున్నారు. దీన్ని ఒక ఐచ్ఛిక నిరుద్యోగం అనవచ్చు. అక్షరజ్ఞానం కలిగి, కనీస విద్యార్హతలు ఉన్నవారు కూడా వ్యవసాయేతర ఉద్యోగాన్నే కోరుకోవటం నిరుద్యోగానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ప్రభుత్వ అధ్యయనాల ప్రకారం కూడా పదిహేనేండ్లు అంతకు ఎక్కువ వయస్సున్న యువతలో నిరుద్యోగ శాతం కూడా గతంతో పోలిస్తే తీవ్రంగా పెరుగుతున్నది. 2004-5లో పదిహేనేండ్లకు పైబడిన వారిలో 43 శాతం నిరుద్యోగం ఉంటే, 2011-12నాటికి 39.5 శాతానికి చేరుకున్నది. ఈ విధంగా నిరుద్యోగ శాతం పెరుగుతూ పోతే ఇదో సామాజిక సమస్యగా, వినాశనంగా మారక తప్పదు.

ప్రధాని ముఖ్య ఆర్థిక సలహాదారు సుర్జిత్ భల్లా మాత్రం నిరుద్యోగ పెరుగుదల ప్రమాదకరస్థాయిలో ఏమీ లేదని చెప్పుకొస్తున్నారు. మరోవైపు మొత్తంగా వార్షిక కార్మికశక్తి 12 మిలియన్లకు మించటం లేదు. దేశంలో చూస్తే నూతన ఆర్థిక విధానాల అమలు ఆరంభ రోజులు 1999-2000 నుంచి 2004-05లలో మాత్రమే 12 మిలియన్లకు చేరుకున్నది. 2011-12లో కేవలం 2.4 మిలియన్లు మాత్రమే లేబర్ ఫోర్స్ పెరిగింది. మరోవైపు ఈ సంవత్సరాల్లోనే అక్షరాస్యత గణనీయంగా పెరుగటం గమనించవచ్చు. ప్రత్యక్ష నిరుద్యోగం 2011-12దాకా నిరుద్యోగుల సంఖ్య స్థిరంగా 10 మిలియన్లుగా కొనసాగింది. 2015-16లో నిరుద్యోగం 16.5 మిలియన్లకు చేరుకున్నది. ఇదంతా ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నదే.

ఇంకా భయంకరమైన వాస్తవమేమంటే ప్రభుత్వ అధ్యయనాల ప్రకారం నిరుద్యోగ రేటు గత కొంత కాలంగా తీవ్రంగా పెరుగుతున్నది. 2011-12 నుంచి 2016 మధ్య కాలంలో 12వ తరగతి పాసైనవారిలో నిరుద్యోగ రేటు 2 శాతం నుం చి 4.4 శాతానికి పెరిగింది. అలాగే డిగ్రీ చదివిన వారిలో 4.1 నుంచి 8.4 కు, పీజీ చదివిన వారిలో 5.3 నుంచి 8.5కు పెరిగింది. ఇంజినీరింగ్, టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చదివిన వారిలో 6.9 శాతం నుంచి 11 శాతానికి పెరుగటం గమనార్హం. ఇలాగే మిగితా విద్యార్హత గలవారిలో కూడా నిరుద్యోగ శాతం పెరుగటం ఆందోళనకరం. ఈ గణాంకాలు ఇలా ఉన్నా భల్లా మాత్రం నిరుద్యోగం పెరుగటానికి గత యూపీఏ ప్రభుత్వాలే కారణమంటున్నారు. ఇదిలా ఉంటే ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అధ్యయనం ప్రకారం 2004 నుంచి 2012 మధ్యకాలంలో కేవలం 9 మిలియన్ల ఉద్యోగాలే ఇచ్చారని తెలిపింది.

> ఏ రంగం తీసుకున్నా ఉపాధి కల్పనలో ఏ మాత్రం పురోగతి లేని స్థితి కనిపిస్తున్నది. ఈ విధమైన ఉత్పత్తి, ఆర్థిక విధానాలతో నిరుద్యోగం క్రమంగా పెరుగుతూనే ఉన్నది. నిరుద్యోగం పెరుగుదల అనేది అనేక విధాలుగా సామాజిక అంశాలను ప్రభావితం చేస్తుంది. సామాజిక అశాంతికి, అభద్రతకు దారితీస్తుంది.

ఇదిలా ఉంటే ఉత్పాదకరంగంలో ఉద్యోగాలు పొందినవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉత్పత్తిరంగంలో 2011-12లో 58.9 మిలియన్ల మంది పనిచేస్తే, అది 2015-16 నాటికి 48.3 మిలియన్లకు తగ్గిపోయింది. ఇలా నాలుగైదేండ్లలో 10 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇది అభివృద్ధి సూచికలపై తీవ్ర ప్రభావం చూపింది. వస్తు తయారీ రంగం, గనులు, విద్యుత్‌రంగాల్లో తీవ్ర తిరోగమనం కనిపించింది. ఇలా ఏ రంగం తీసుకున్నా ఉపాధి కల్పనలో ఏ మాత్రం పురోగతి లేని స్థితి కనిపిస్తున్నది. ఈ విధమైన ఉత్పత్తి, ఆర్థిక విధానాలతో నిరుద్యోగం క్రమంగా పెరుగుతూనే ఉన్నది. నిరుద్యోగం పెరుగుదల అనేది అనేక విధాలుగా సామాజిక అంశాలను ప్రభావితం చేస్తుంది. సామాజిక అశాంతికి, అభద్రతకు దారి తీస్తుంది. నిరుద్యోగ సమస్య ఏ సమాజంలోనైనా తక్షణం పరిష్కరించుకోవాల్సింది. నిరుద్యోగ సమస్యను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: జేఎన్‌యూలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్, సెంటర్ ఫర్ లేబర్)

జనగళం

కలప స్మగ్లర్లను అరికట్టాలె

రాష్ట్ర ప్రభుత్వం అడవుల పరిరక్షణ కోసం కొత్త చట్టాలను రూపొందించడం శుభ పరిణామం. చెట్లను నరికే కలప స్మగ్లర్లపై దృష్టి సారించడం అభినందనీయం. ఇష్టానుసారంగా అడవులను నరికివేస్త అడవుల విస్తీర్ణం తగ్గి దుష్పరిణామాలు సంభవించే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే ప్రభుత్వం అడవుల విస్తీర్ణాన్ని పెంచే పనిలోనే ఉన్నది. ఇందులో భాగంగానే 'హరితహారం' పథకాన్ని ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా చెట్లు నాటే కార్యక్రమాన్ని ఏటా చేపడుతున్నది. అడవుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఉద్యమాన్ని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు తమవంతు బాధ్యతగా స్వీకరించి సహకరించాలి. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సహజసిద్ధమైన వానలు కురుస్తాయి. కాబట్టి అడవి దొంగల ఆట కట్టించాలె.

- అయిన రఘురామారావు, ఖమ్మం

నిబంధనలు పాటించాలె

రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే హెల్మెట్ల వినియోగం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం లాంటి నిబంధనలను తప్పనిసరి చేస్తున్నారు. ఇది వాహనదారులు గమనించి అధికారుల నిబంధనలు పాటించాలె. అప్పుడే మరణాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది.

- అవిడి రాఘవ, నందినగర్, హైదరాబాద్

గ్రామాభివృద్ధికి పాల్పడాలె

దేశానికే పల్లెలే పట్టుకొమ్మలు. పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లితేనే దేశాభివృద్ధి సాధ్యమనేది గాంధీజీ సిద్ధాంతం. ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం కావడం శుభపరిణామం. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేస్తూ కేసీఆర్ కలలను సాకారం చేయాలి.

- జీడిపెల్లి లింగారావు, రామకృష్ణా కాలనీ, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



జాతీయ మహిళా ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో తెలంగాణ మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, సినీనటులు మంచు లక్ష్మి, అక్కినేని అమల, మధుమిత తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగు.. మన సంప్రదాయం

- హోంమంత్రి మహమూద్ అలీ
- మహిళా ఆర్గానిక్ మేళా ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సేంద్రియసాగు అనాదిగా వస్తున్న మన సంప్రదాయమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. వ్యవసాయరంగంలో దానిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. రాష్ట్రంలో సేంద్రియ సాగు, ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. తన తండ్రి కూడా సేంద్రియ సాగులో ప్రత్యేకంగా పంటలు పండించే వారని అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పారామంలో కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, తెలంగాణ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలు సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఐదురోజుల 'భారతీయ మహిళా ఆర్గానిక్ మేళా'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. ప్రజలు సేంద్రియ ఆహారం వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల.. పండ్లు, కూరగాయలు రసాయన పూరితమై చిన్నారులు మహిళల్లో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దేశంలో రైతులను అప్పులనుంచి విముక్తి కలిగించిన ఏకైక ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని పేర్కొన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. వ్యవసాయంలో మహిళా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం జగదీశ్ మాట్లాడుతూ.. ఇక్కడికి విచ్చేసిన వివిధ దేశాల సేంద్రియ వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదురోజుల పాటు అవసరమైన ఆతిథ్యం కల్పిస్తామని చెప్పారు. సినీనటులు అక్కినేని అమల, మంచు లక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయసాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ రోజురోజుకు సేంద్రియ ఆహార వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర జాయింట్ సెక్రటరీ నందితామిశ్రా, రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయి, మహిళా సంక్షేమ శాఖ ప్రాంతీయ కోఆర్డినేటర్ ఏ వీరమణి, సినీనటులు జీవితారాజశేఖర్, మధుమిత, శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో
ధరణి పైలట్ ప్రాజెక్టు

- కోర్ బ్యాంకింగ్ తరహాలో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోర్ బ్యాంకింగ్ తరహాలో క్రయవిక్రయాలు జరిగేలా 'ధరణి' వెబ్‌సైట్‌ను అమల్లోకి తీసుకొచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లా పరిగిలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా విస్తరించి అమలుచేయాలని నిర్ణయించారు. ఈనెల 11నుంచి ధరణి వెబ్‌సైట్ ద్వారా కోర్ బ్యాంకింగ్ తరహాలో వికారాబాద్ జిల్లా అంతటా క్రయవిక్రయాలు నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు రికార్డులన్నీ సరిచేసి అప్‌లోడ్ చేస్తున్నారు. ముందుగా కొడంగల్, తాండూరు, వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని మండలాలతో పాటు నవాబ్‌పేట మండలంలో రిజిస్ట్రేషన్లు జరిగేలా పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నట్టు సమాచారం. దీని కింద ధరణి వెబ్‌సైట్‌ను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానం చేస్తారు. రిజిస్ట్రేషన్ కాగానే భూమి విక్రయించిన రైతు పట్టాదార్ పాస్ పుస్తకం నుంచి విక్రయించిన మొత్తాన్ని తహసీల్దార్ తొలిగించి.. కొనుగోలుచేసిన రైతు పాస్ పుస్తకంలో జమ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయిన మరుక్షణమే మ్యుటేషన్ జరుగుతుంది.

న్యాక్‌లో ముగిసిన ఫినిషింగ్ స్కూల్ శిక్షణ

- షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు నిర్మాణ రంగంలో ఉద్యోగాలు



ఫినిషింగ్ స్కూల్ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందిస్తున్న లచ్చిరాం బుక్యా

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో మూడు నెలల ఫినిషింగ్ స్కూల్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. సివిల్ ఇంజినీరింగ్‌లో షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగులకు మూడునెలలపాటు నిర్మాణరంగ మెళకువలపై శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ లచ్చిరాం భూక్యా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చి, శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ధ్రువపత్రాలను అందించారు. లచ్చిరాం మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్పొరేషన్ సహకరిస్తుందని, నిర్మాణరంగంలోని ప్రైవేట్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తుందని తెలిపారు. ఫినిషింగ్ స్కూల్ కోర్సులో శిక్షణ పొందిన 26 మందికి ఉద్యోగావకాశాలను కల్పించడం సంతోషంగా ఉందని న్యాక్ నిర్వాహకులను అభినందించారు.

రేవంత్‌రెడ్డి అరెస్ట్ కేసు విచారణ వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అరెస్ట్ కేసులో గత ఏడాది డిసెంబర్ 1 నుంచి 4 మధ్య పోలీసుల చర్యలకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూ కేసును ఈ నెల 25కు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన నివాసానికి వచ్చిన పోలీసులు, అక్రమంగా అరెస్ట్ చేశారని రేవంత్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.

సినీ నిర్మాతపై జీఎస్టీ కేసు

- సినిమా నిర్మాణంలో సేవలపన్ను ఎగవేతపై దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సినిమా నిర్మాణంలో సేవలపన్ను చెల్లించక భారీ మొత్తంలో ఎగవేస్తున్న సినీనిర్మాతలపై అధికారులు దృష్టి సారించారు. వీరిపై కేంద్ర జీఎస్టీ పన్ను ఎగవేత నిరోధక బృందం నిఘా వేసింది. విదేశాలనుంచి సాంకేతిక నిపుణుల సేవలను వాడుకునే సినీనిర్మాతలు రివర్స్‌చార్జ్ మెకానిజం విధానం కింద 18 శాతం సేవాపన్నును చెల్లించాలి. చాలామంది ఈ విషయాన్ని విస్మరిస్తున్నట్టు అధికారుల దృష్టికివచ్చింది. ఈ క్రమంలో ఒక సినీనిర్మాతపై రంగారెడ్డి జీఎస్టీ కమిషనరేట్ అధికారులు కేసు నమోదుచేశారు. జీఎస్టీతోపాటు రివర్స్‌చార్జ్ మెకానిజం విధానం కింద చెల్లించాల్సిన 7 కోట్ల 40 లక్షల రూపాయలను వెంటనే చెల్లించాలని కమిషనర్ ఏఆరెస్ కుమార్ నోటీసులు జారీ చేశారు. దీనికి స్పందించిన సినీ నిర్మాణ సంస్థ వెంటనే 7 కోట్ల 20 లక్షల రూపాయలను చెల్లించినట్టు అధికారులు వెల్లడించారు. మరికొంతమందికి నోటీసులు జారీచేయనున్నట్టు కేంద్ర జీఎస్టీ అధికారులు తెలిపారు.

13 ఇంజినీరింగ్ కాలేజీలు మూసివేత?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 13 ఇంజినీరింగ్ కాలేజీలు మూసివేతకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నాయని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య తెలిపారు. కాగా, అన్ని ఇంజినీరింగ్ కాలేజీల్లో కలిపి 90 కోర్సుల మూసివేతకు కళాశాలలు దరఖాస్తు చేసినట్లు చెప్పారు. వీటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో త్వరలోనే అనుబంధ గుర్తింపు ప్రక్రియను ప్రారంభించడానికి చర్యలు చేపడుతామని తెలిపారు.

జ్యుడీషియల్ అకాడమీ శిక్షణకు జడ్జీల ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జ్యుడీషియల్ అధికారుల విభజనలో తెలంగాణకు కేటాయించిన, సీనియర్ సివిల్ జడ్జీలుగా ప్రమోషన్ పొందిన 14 మందికి సికింద్రబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జడ్జీలను ఎంపికచేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 11 నుంచి 23 వరకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. శిక్షణ కోసం వారిని విధుల నుంచి రిలీవ్‌చేస్తున్నట్టు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

11, 12 తేదీల్లో జైళ్ల శాఖ ప్రాంతీయ సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రాంతీయ సదస్సు జరుగనుంది. 'జైళ్లలో పాటించాల్సిన ఉత్తమ విధానాలు– పరిమిత వనరులతో ఉత్తమ పద్ధతుల అమలు' అంశంపై సదస్సును నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఏ సంతోష్‌ను ఎంపికచేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీచేశారు.


లోకాయుక్త నియామకంపై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2016 నుంచి ఇప్పటివరకు లోకాయుక్తను నియమించకపోవడంపై వివరణ సమర్పించాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దాదాపు 5 వేలకుపైగా పిటిషన్‌లు లోకాయుక్తలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి పరిష్కారం ఎప్పుడు లభిస్తుందని ప్రశ్నించింది. లోకాయుక్త నియామకం అంశంపై ప్రభుత్వ సూచనలు తీసుకుంటామని తెలిపిన అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, అందుకు తమకు రెండువారాల గడువు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసును వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.

ఫిబ్రవరి 14న యాక్సిడెంట్ ఫ్రీ డే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 14న యాక్సిడెంట్ ఫ్రీ డే నిర్వహించనున్నట్టు డీజీపీ కార్యాలయ, రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్ కార్యాలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ ఫ్రీ డే సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించేలా ప్రోత్సహించాలని కోరారు.



బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

తెలంగాణ ప్రభుత్వము

ఫారము-C

[illegible] [illegible]

(Under Section 11 of the Act where 10A Exemption is given) (see rule 6/12)

ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే.), ఐ.పి.జి మరియు ... ఖమ్మం ఫైల్ నం. C/11/2018 — తేది: 25-01-2019

జిల్లా కలెక్టరు, ఖమ్మం procs No. G1/1101/2011 — తేది: 28-01-2019

జిల్లా గెజిట్ నంబరు AS/4/2019 — తేది: 29-01-2019

[illegible]

షెడ్యూలు

గ్రామము: జగన్నాథపురం — మండలము: సత్తుపల్లి — జిల్లా: ఖమ్మం

క్ర. సం.	సర్వే నం. మార్పు ప్రకారం	సర్వే నం. ఎస్.ఎల్.ఆర్ ప్రకారం	విస్తీర్ణం	Type of Land	భూమి రకం	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	హద్దులు	చెట్లు	నిర్మాణాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	3/1	3/1	0-06	ప్రభుత్వ భూమి	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-
2	3/2	3/2	0-07	ప్రభుత్వ భూమి	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-
	మొత్తం	విస్తీర్ణం	0-13							
3	4	4	0-03	ప్రభుత్వ భూమి	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

పప్పుధాన్యాల సాగు 100%

శనగ పంట సాగు అత్యధికం 113%.. వరిసాగు విస్తీర్ణం 79%..

16 జిల్లాల్లో వర్షాభావం.. వ్యవసాయ శాఖ యాసంగి నివేదికలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పప్పుధాన్యాల సాగు 100శాతం నమోదైంది. యాసంగి సాధారణ సాగువిస్తీర్ణం 13.38 లక్షల హెక్టార్లకు 9.85 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు నమోదైనట్టు వ్యవసాయశాఖ నివేదికలో బుధవారం వెల్లడించింది. ఆహారధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 10.45 లక్షల హెక్టార్లకు ఫిబ్రవరి మొదటివారం నాటికి 8.09 లక్షల హెక్టార్లుగా నమోదైంది. యాసంగి లో పప్పుధాన్యాల సాగు 1.24 లక్షల హెక్టార్లలో 100శాతం నమోదైంది, ఆహార ధాన్యాల సాగు 77శాతం, వరి 79 శాతంగా, పప్పుధాన్యాల సాగులో శనగ అత్యధికంగా 113శాతం, పెసర 64 శాతం, మినుములు 53శాతం సాగు విస్తీర్ణం నమోదైంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్టు వ్యవసాయశాఖ తెలిపింది. వరంగల్ రూరల్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో 120నుంచి 59శాతం లోటు వర్షపాతం నమోదైంది.

పంటల సాగు విస్తీర్ణం

యాసంగిలో వరి సాధారణ సాగువిస్తీర్ణం 7.05లక్షల హెక్టార్లకు ప్రస్తుతం 5.6 లక్షల హెక్టార్లలో 79శాతం సాగైంది. గోధుమల సాధారణ సాగువిస్తీర్ణం 0.07 లక్షల హెక్టార్లకు 0.03 లక్షల హెక్టార్లు, జొన్న 0.33 లక్షల సాధారణ సాగుకు 0.16 లక్షలహెక్టార్లు, మొక్కజొన్న 1.66 లక్షల హెక్టార్లకు 1.06 లక్షల హెక్టార్లలో సాగయింది. చిరు ధాన్యాలు 392 శాతం సాగైంది. పప్పుధాన్యాల విషయంలో పెసర్లు 0.01లక్షల హెక్టార్లు, మినుములు 0.05 లక్షల హెక్టార్లు, కందులు 0.01 లక్షల హెక్టార్లు, శనగ 1.07 లక్షల హెక్టార్లు, ఇతర పప్పుధాన్యాలు 0.04 లక్షల హెక్టార్లుగా నమోదైంది. నూనెగింజల సాగుకు సంబంధించి వేరుశనగ 1.08 లక్షల హెక్టార్లు, నువ్వులు 0.01 లక్షల హెక్టార్లు, పొద్దుతిరుగుడు 0.02, మిర్చి 0.12, ఉల్లిగడ్డ 0.03 లక్షల హెక్టార్లు నమోదైంది.

మూడు జిల్లాల్లో వందశాతం పంటలసాగు

నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో 100శాతం పంటలు సాగయ్యాయి. రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 26నుంచి 50 శాతం, మేడ్చల్ మల్కాజిగిరి, నిజామాబాద్, వనపర్తి, గద్వాల, వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో 76 నుంచి 100 శాతం సాధారణ సాగువిస్తీర్ణం నమోదయింది. మిగతా జిల్లాల్లో 51 నుంచి 75 శాతం సాధారణ సాగు విస్తీర్ణం నమోదైంది. పలుజిల్లాల్లో సాగైన మక్కజొన్న పంటపై కత్తెర పురుగు ప్రభావం చూపినట్టు వ్యవసాయశాఖ వెల్లడించింది.

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]



న్యాక్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ

అద్దాల్లా రోడ్ల నిర్మాణం

- సీఎం కేసీఆర్ కలలను సాకారం చేయాలి
- ఐదేండ్ల రోడ్డు కనెక్టివిటీపై సమగ్ర ప్రణాళిక
- వ్యూహాత్మక ప్రణాళికపై సమీక్షలో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, మాదాపూర్: రహదారులే ప్రగతికి చిహ్నాలని, వాటిని అద్దాల్లా తీర్చిదిద్ది సీఎం చంద్రశేఖర్‌రావు కలలను సాకారం చేయాలని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ అధికారులకు సూచించారు. వచ్చే ఐదేండ్లలో రాష్ట్రంలో రోడ్ల విస్తరణ, మరమ్మతులు, ఆధునీకరణ, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల తీరుతెన్నులపై జిల్లాలవారీగా సమగ్ర రిపోర్టును అందించాలని కోరారు. బుధవారం న్యాక్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులకు ఐదేండ్ల వ్యూహాత్మక ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌శర్మ మాట్లాడుతూ ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకుసాగితే అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించడం, వాటిని బీటీ రోడ్లకు అనుసంధానం, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్‌లేన్ రోడ్లు, అక్కడి నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగులేన్ల రోడ్లు లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ నిర్వహించిన సమీక్షలో సాగునీటి ప్రాజెక్టుల తరువాత.. ఆర్‌అండ్‌బీకి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారని.. ఆయన నమ్మకాన్ని నిలబెట్టాలని అధికారులకు సూచించారు. రహదారుల విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవను అధికారులు అందిపుచ్చుకోవాలని చెప్పారు. రోడ్లు, వంతెనల స్థితిగతులు, వాటి నిర్వహణ, కొత్తగా చేపట్టాల్సినవాటి వివరాలతో ఈ నెల 15 వరకు సమగ్ర నివేదికలను అందించాలని సూచించారు. దీనిపై ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చామని, చివరగా మరో అవకాశం ఇస్తున్నట్టు చెప్పారు. కిందిస్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలోని రోడ్ల స్థితిగతులపై సమగ్ర రిపోర్టును తయారుచేయాలని సూచించారు.

జాతీయ రహదారుల సాధనలో ప్రథమం: ఈఎన్సీ గణపతిరెడ్డి

గతంలో ఎన్నడూలేనివిధంగా రాష్ట్రానికి జాతీయ రహదారులు వచ్చాయని ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి తెలిపారు. నాలుగున్నరేండ్లలో 3,150 కిలోమీటర్ల నేషనల్ హైవేలను సాధించడం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఇందులో 1,800 కిలోమీటర్ల రహదారులపై కేంద్రానికి డీపీఆర్లు అందించామని చెప్పారు. వచ్చే రెండేండ్లలో మరో 2 వేల కిలోమీటర్లు సాధించేందుకు ప్రణాళికతో ముందుకుసాగుతున్నట్టు చెప్పారు. రూ.20 వేల కోట్లతో తెలంగాణలో రహదారుల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలవారీగా అధికారులు సరైన డాటాతో నివేదికలు తయారుచేసి అందించాలని సూచించారు. ఈఎన్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ ఇటీవల 6,431 కిలోమీటర్ల పంచాయతీరోడ్లు ఆర్‌అండ్‌బీకి బదిలీ అయ్యాయని.. వీటన్నింటినీ బీటీ రోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇంచార్జి ఈఎన్సీ లింగయ్య మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సుముఖంగా ఉన్నదచెప్పారు. 135 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నదని తెలిపారు. మూడునెలలకోసారి ఇలాంటి సమావేశాలు నిర్వహించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఈలు సతీశ్, ఆశారాణి, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

DIPR No. 926/LA/PP/2018-19

తెలంగాణ ప్రభుత్వము, రెవిన్యూ (భూసేకరణ) విభాగము
జిల్లా కలెక్టర్, భద్రాద్రి
కొత్తగూడెం జిల్లా

ఫారం -7
(నూతన సవరణ 1రూల్-25, సెక్షన్-19(1) చట్టము-30/2013)
రూఢీ ప్రకటన

ప్రత్యేక ఉప కలెక్టర్, వారి ఆర్.సి.నెం: బి/574/2018	తేది.:: 26-01-2019
జిల్లా కలెక్టర్, గారి ఉత్తర్వులు: బి/14 /2016	తేది.:: 26-01-2019
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం: బి3/07/2019	తేది.:: 30-01-2019

[illegible]

షెడ్యూల్
మండలము:: అశ్వాపురం [illegible] | గ్రామము:: నాయపరం [illegible] | జిల్లా:: భద్రాద్రి కొత్తగూడెం

క్ర. సం	సర్వే నెం	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	[illegible]
1	2	3	4	5	6	7	8	9
1	26/2	29/[illegible]	పట్టా	మెట్ట	0.07	[illegible]	[illegible]	[illegible]
2	26/2	40/[illegible]	పట్టా	మెట్ట	0.01	[illegible]	[illegible]	[illegible]
3	26/2	26	పట్టా	మెట్ట	0.05	[illegible]	[illegible]	[illegible]
4–117	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]

DIPR RO No.936/LA/PP/2018-19

కల్తీవిత్తనాలకు అడ్డుకట్టవేయాలి

- డ్రోన్, జియోట్యాగింగ్, బార్‌కోడ్, జీపీఎస్ టెక్నాలజీతో విత్తనోత్పత్తి
- రైతులు బాగుండాలంటే విత్తనాల ఎంపిక కీలకం
- వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఇండో-జర్మన్ ప్రాజెక్ట్ ప్లానింగ్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: డ్రోన్, జియోట్యాగింగ్, బార్‌కోడెడ్, జీపీఎస్ టెక్నాలజీ ద్వారా విత్తనోత్పత్తి చేసి మార్కెట్లో కల్తీవిత్తనాలకు అడ్డుకట్టవేయాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి అన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారి రైతులు బాగుండాలంటే విత్తనాల ఎంపిక కీలకమని తెలిపారు. విత్తనరంగ అభివృద్ధికి సంస్కరణలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన 'ఇండో-జర్మన్ ప్రాజెక్టు ప్లానింగ్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఇప్పటికే విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణలో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, దేశానికి కావాల్సిన విత్తనాల్లో 60 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయని పేర్కొన్నారు. 400 విత్తన కంపెనీలు రాజధాని హైదరాబాద్ చుట్టుపక్కల ఉండటంతో విత్తన ప్రాసెసింగ్, నిల్వ పెద్దఎత్తున జరుగుతున్నదని తెలిపారు. దేశాల మధ్య విత్తన ఎగుమతి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రమోషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని పార్థసారథి అన్నారు. ఓఈసీడీ అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణతోపాటు, యూరోపియన్ ఈక్వలెన్స్ పరికరాలు మనదేశానికి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. యూరోపియన్ దేశాలకు కూడా విత్తన ఎగుమతులను ప్రోత్సహించవచ్చని అన్నారు. మార్కెట్లో కల్తీవిత్తనాలు సరఫరా చేస్తున్నవారిపై ప్రస్తుత విత్తన చట్టం ప్రకారం తక్కువ జరిమానా, శిక్ష పడుతున్నాయని, విత్తన చట్టంలో కూడా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. రాజేంద్రనగర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇస్టా విత్తనపరీక్ష ల్యాబ్ త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వర్‌రావు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సౌమిని సుంకర, జర్మన్ ప్రతినిధులు సిగ్రిట్ గియాన్సీ, ఎకేహార్డ్ సౌందర్, ప్రొఫెసర్ అర్నిబర్, ఎంవీ నగేష్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబీమా నామినీలకు పదిరోజుల్లో పరిహారం

రైతుబీమా పథకం కింద రైతుల నామినీల బ్యాంకు ఖాతాకు పదిరోజుల్లోపే పరిహారం జమచేస్తున్న ఎల్ఐసీ అధికారులను వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి అభినందించారు. రైతులు దురదృష్టవశాత్తు మృతిచెందితే వారి కుటుంబాలకు వెంటనే ఆర్థికంగా చేయూతనిస్తుండటంతో కొంత ఉపశమనం లభిస్తున్నదని అన్నారు. సచివాలయంలో పార్థసారథి బుధవారం ఎల్ఐసీ అధికారులతో రైతుబీమా పథకంపై సమీక్షించారు. ఇప్పటి వరకు 6,775 మంది రైతులు మృతిచెందగా, వారి నామినీల ఖాతాలకు రూ.338.75 కోట్లు జమచేసినట్లు వెల్లడించారు. అధికమొత్తంలో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. గ్రామాల్లో రైతుబీమా క్లెయిమ్‌లను వ్యవసాయ విస్తరణ అధికారులు రిజిష్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు విజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీలో కాగితరహిత అడ్మిషన్లు

- దోస్త్ ప్రవేశాల ప్రక్రియ మరింత సులభం
- రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజుల చెల్లింపు ఆన్‌లైన్‌లోనే
- ఇంటర్‌బోర్డు, ఏపీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ బోర్డుల అనుసంధానం
- దోస్త్ సహాయకేంద్రాల కోఆర్డినేటర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మూడేండ్లుగా నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం ఆఫ్ తెలంగాణ (దోస్త్) అడ్మిషన్లలో కాగితరహిత విధానం తీసుకురావాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను మరింత సులభతరంచేయడంతోపాటు విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజులు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఈ విధానాన్ని ఇప్పటికే ఎంసెట్, ఐసెట్ కౌన్సెలింగ్‌లో అమలుచేస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన దోస్త్ సహాయ కేంద్రాల కోఆర్డినేటర్ల సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొని దోస్త్-2019 ప్రవేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డిగ్రీలో సీట్లు పొందాలనుకొనే విద్యార్థులెవ్వరూ దోస్త్ కార్యాలయాలకు రాకుండా.. అన్నిరకాల సేవలు సహాయ కేంద్రాల్లోనే అందించేలా కోఆర్డినేటర్లు మసులుకోవాలని ఆదేశించారు.

ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ల పరిశీలన

ఇప్పటివరకు ఇంజినీరింగ్‌తోపాటు ఇతర కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను మాన్యువల్‌గా తనిఖీలుచేస్తూ వచ్చారు. కానీ, ఇకనుంచి అర్హత సర్టిఫికెట్లు అన్ని ఆన్‌లైన్ ద్వారా తనిఖీ చేయనున్నారు. ఈ మేరకు దోస్త్ వెబ్‌సైట్‌లో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు, ఏపీ ఇంటర్ బోర్డు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ బోర్డులను అనుసంధానం చేయనున్నారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన హాల్‌టికెట్ల నంబర్లను ఆన్‌లైన్ దరఖాస్తుల్లో చేర్చాలి. వాటి ఆధారంగా అన్నిబోర్డుల్లో ఉన్న సర్టిఫికెట్ల పరిశీలిస్తామని, ఇది అత్యంత పారదర్శకంగా ఉంటుందని దోస్త్-2019 కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో యాజమాన్య కోటా విధానం అమలుచేయాలనే అంశంపై వీలైనంత త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి సెక్రటరీ ఎన్ శ్రీనివాసరావు, దోస్త్ కన్సల్టెంట్ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలిలోని అయాన్స్‌తో విద్యుత్

ప్రపంచంలోనే మొదటి ఆవిష్కరణ

భవిష్యత్‌లో వైర్‌లెస్ కరంట్ సరఫరా ■ ఘనతచాటిన పెద్దపల్లి యువకులు



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న పెద్దపల్లి యువకులు

ఖైరతాబాద్: ఇద్దరు యువకుల రెండేండ్ల కల సాకారమైంది. గాలిలోని అయాన్స్ నుంచి విద్యుదుత్పత్తి సాధ్యమని నిరూపితమైంది. గాలిలోని అయాన్స్‌ను విద్యుత్తుగా వినియోగించుకొని వైర్‌లెస్ కరంటు ప్రక్రియను ఆవిష్కరించారు పెద్దపల్లికి చెందిన ఈ యజ్ఞ సాయిచరణ్, ఈ దినేశ్‌కుమార్. రామగుండంలోని రావూస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. సాయిచరణ్ ఓయూలో కెమికల్ ఇంజినీరింగ్ అభ్యసించగా, దినేశ్‌కుమార్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివారు. 'అయాన్ ప్రపల్షన్ ఇంజిన్ అండ్ అట్మాస్ఫరిక్ అయాన్ హార్వెస్టింగ్' పేరుతో ఈ బృహత్తర ప్రాజెక్టుపై రెండేండ్లుగా విస్తృత పరిశోధనలు చేసి విజయం సాధించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా వారు ఆ ప్రాజెక్టు డెమోను రావూస్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ పీ ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ శశికళ సమక్షంలో ప్రదర్శించారు.

వైర్‌లెస్ ద్వారా 30 వేల వోల్టులకుపైగా..

భూమికి 300 మీటర్ల ఎత్తులో సహజంగానే అయాన్లు ఉంటాయి. వాటిని సక్రమంగా వినియోగించుకుంటే మనం రోజూ వాడే 220 వోల్ట్‌ల నుంచి 30 వేల వోల్టులకు పైగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు. అల్యూమినియమ్ టవర్స్‌ను 300 మీటర్ల ఎత్తులో ఏర్పాటుచేయడం ద్వారా అయాన్స్‌ను ఆకర్షించే గుణం ఆ ఖనిజానికి ఉంటుంది. దాన్ని పాజిటివ్, నెగటివ్‌లుగా ప్రత్యేకమైన పరికరాలతో 220 వోల్ట్ విద్యుత్‌ను సేకరిస్తారు. డీసీగా ఉన్న కరంట్‌ను ఫ్లైబ్యాక్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా ఏసీగా మార్చి 30 వేల వోల్టుల విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు. ఇలా సేకరించిన విద్యుత్‌ను టెస్లా కాయిల్స్‌కు అనుసంధానం చేయడం ద్వారా నేరుగా గాలినుంచి వైర్‌లెస్ కరంట్ సరఫరా చేయవచ్చని సాయిచరణ్, దినేశ్‌కుమార్ చెప్తున్నారు. విద్యుత్తు అవసరం ఉన్నవారు ప్రత్యేకంగా రూపొందించిన యాంటినా లాంటి పరికరాలను ఇంటిపై పెట్టుకుంటే కావాల్సిన విద్యుత్‌ను టీవీతరంగాల మాదిరిగా సరఫరా అవుతుంది. ప్రత్యేక అమరిక ద్వారా గృహోపకరణాలు, వాహనాలు, ఇతర పరికరాలకు కరంట్ వినియోగించుకోవచ్చు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పదోన్నతి కల్పించడంపై పీఈటీ సంఘం హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా(గ్రేడ్-1) పదోన్నతి కల్పించడంపై రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం(పీఈటీఏ) హర్షం వ్యక్తం చేసింది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రాష్ట్ర పీఈటీఏ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సోమేశ్వర్ రావు, సాట్స్ చైర్మన్ ఏ వెంకటేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పదోన్నతుల కోసం ఏండ్లుగా కొట్లాడినా, ముఖ్యమంత్రి పెద్ద మనసుతో ఇన్నేండ్ల కల నెరవేరిందని సోమేశ్వర్ రావు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పీఈటీలతోపాటు భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ సీఎం కేసీఆర్ మంగళవారం నిర్ణయం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పీఈటీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ రాఘవరెడ్డి, సలహాదారు బాలరాజ్ , అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్ కుదేల్!

తొలి టీ20లో భారీ ఓటమి ■ చెలరేగిన కివీస్ బౌలర్లు ■ సీఫెర్ట్ వీరోచిత బ్యాటింగ్

వెల్లింగ్టన్: వన్డే సిరీస్‌ను ఏకపక్షంగా గెలిచిన భారత్‌కు పొట్టి ఫార్మాట్‌లో మాత్రం కలిసిరాలేదు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఘోరంగా విఫలమైన టీమ్‌ఇండియా బుధవారం జరిగిన తొలి టీ20లో 80 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. టిమ్ సీఫెర్ట్ (43 బంతుల్లో 84; 7 ఫోర్లు, 6 సిక్సర్లు) దంచికొట్టాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ధోనీ (31 బంతుల్లో 39; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. సీఫెర్ట్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో టీ20 శుక్రవారం జరుగుతుంది.

సీఫెర్ట్ అదుర్స్

పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తుందనే ఉద్దేశంతో రోహిత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపించాయి. తొలి ఓవర్ మినహా మిగతా ఓవర్లలో ఎక్కడా 10 పరుగులకు తక్కువగా రాలేదు. కివీస్ ఓపెనర్లు మున్రో (20 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సీఫెర్ట్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో శుభారంభాన్నిచ్చారు. ఖలీల్ (1/48) రెండో ఓవర్‌లో రెండు ఫోర్లతో మొదలైన పరుగుల వరద ఎక్కడా ఆగలేదు. భువీ (1/47) వేసిన మూడో ఓవర్‌లో సీఫెర్ట్ మిడ్ వికెట్ మీదుగా తొలి సిక్సర్ బాదాడు. తర్వాతి ఓవర్‌లోనే మున్రో వరుస సిక్సర్లతో ఇన్నింగ్స్ జోరందుకుంది. వీళ్ల దెబ్బకు ఐదో ఓవర్‌లోనే క్రునాల్ (1/37)ను తీసుకొచ్చినా సీఫెర్ట్ సిక్సర్‌తో స్వాగతం పలికాడు. తొలి నాలుగు ఓవర్లలో 44 పరుగులు కాస్త పవర్‌ప్లే ముగిసేసరికి 66 పరుగులకు చేరాయి. తర్వాతి రెండు ఓవర్లలో మరో 19 పరుగులు సాధించినా.. 9వ ఓవర్‌లో వీళ్ల జోరుకు క్రునాల్ బ్రేక్ వేశాడు. మున్రో ఔట్ చేయడంతో 8.2 ఓవర్లలో తొలి వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 5, 11వ ఓవర్‌లో ధోనీ, దినేశ్ కార్తీక్ క్యాచ్‌లు జారవిడవడంతో గట్టెక్కిన సీఫెర్ట్ క్రునాల్ బంతులను పదేపదే స్టాండ్స్‌లోకి పంపాడు. ఈ క్రమంలో 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. రెండో ఎండ్‌లో విలియమ్సన్ (22 బంతుల్లో 34; 3 సిక్సర్లు) కూడా బ్యాట్ ఝుళిపించినా.. 13వ ఓవర్‌లో ఖలీల్ సూపర్ యార్కర్‌తో సీఫెర్ట్‌ను ఔట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 48 పరుగులు జతయ్యాయి. 14వ ఓవర్‌లో విలియమ్సన్ రెండు సిక్సర్లు సంధించినా.. మిచెల్ (8) వికెట్‌తో క్రునాల్ సంతృప్తిపడ్డాడు. తర్వాతి బంతికే విలియమ్సన్ ఔట్‌కావడంతో కివీస్ 164/4గా మారింది. గ్రాండ్‌హోమ్ (3), టేలర్ (14 బంతుల్లో 23; 2 సిక్సర్లు)ను కట్టడి చేయాలని ప్రయత్నించినా.. క్యాచ్‌లు వదిలేయడం కివీస్‌కు కలిసొచ్చింది. మూడు బంతుల తేడాలో ఈ ఇద్దరు ఔటైనా.. కుగ్గెలిన్ (7 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) 19వ ఓవర్‌లో 4, 4, 6తో 17, తర్వాతి ఓవర్‌లో 4, 4తో 12 పరుగులు రావడంతో కివీస్ భారీ స్కోరు ఖాయమైంది.

ధోనీ మినహా..

భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఏదీ కలిసిరాలేదు. తొలి ఓవర్‌లో ఒక్క పరుగు రాగా రెండో ఓవర్‌లో ధవన్ (29) 6, 6, 4తో 17 పరుగులు రాబట్టాడు. కానీ మూడో ఓవర్ రెండో బంతికే రోహిత్ (1) ఔటయ్యాడు. రెండో ఎండ్‌లో శంకర్ (18 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఐదో ఓవర్‌లో 4, 4, 6తో 18 పరుగులు రాబట్టినా.. ఓ భారీ సిక్సర్‌తో కుదురుకున్నట్లు కనిపించిన ధవన్ ఆరో ఓవర్‌లో వెనుదిరగడంతో పవర్‌ప్లేలో భారత్ స్కోరు 53/2గా మారింది. చేయాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడంతో కుర్రాళ్లపై ఒత్తిడి కూడా పెరిగింది. ఫలితంగా 9వ ఓవర్‌లో మూడు బంతుల తేడాలో పంత్ (4), శంకర్ ఔటయ్యారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ నిలకడగా ఆడినా.. 11వ ఓవర్‌లో ఐదు బంతుల తేడాలో కార్తీక్ (5), హార్దిక్ (4) వెనుదిరిగారు. ఈ ఓవర్ ముగిసేసరికి టీమ్‌ఇండియా 83/6 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇక 54 బంతుల్లో 143 పరుగులు చేయాల్సిన దశలోనూ కివీస్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. క్రునాల్ (20) ఓ సిక్సర్, ఫోర్‌తో జోరు చూపెట్టడంతో 15 ఓవర్లలో స్కోరు 113/6కు చేరింది. చివరి 5 ఓవర్లలో 137 పరుగులు చేయాల్సి ఉండగా, 17వ ఓవర్‌లో క్రునాల్, 18వ ఓవర్‌లో భువనేశ్వర్ (1), 19వ ఓవర్‌లో ధోనీ, ఆఖరి ఓవర్ రెండో బంతికి చాహల్ (1) వికెట్లను సమర్పించుకోవడంతో మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే భారత్ ఓటమి ఖాయమైంది.



మిథాలీరాజ్

అర్హత మ్యాచ్‌లాడే పరిస్థితి వద్దు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ వేదికగా 2021లో జరిగే వన్డే ప్రపంచకప్ కోసం అర్హత మ్యాచ్‌లాడే పరిస్థితి తెచ్చుకోవద్దని భారత కెప్టెన్ మిథాలీరాజ్ అంది. న్యూజిలాండ్‌తో తాజాగా ముగిసిన మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో దక్కించుకున్న టీమ్‌ఇండియా ప్రస్తుతం ప్రపం చ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతున్నది. తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తాయి. టాప్-4లో చోటు దక్కించుకోకపోతే...అర్హత టోర్నీ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో మిథాలీ మీడియాతో మాట్లాడింది. 'క్రితం సారి ప్రపంచకప్ కోసం అర్హత మ్యాచ్‌లు ఆడాం. కానీ ఈసారి 2021 వరల్డ్‌కప్‌లో నేరుగా క్వాలిఫై కావాలనుకుంటున్నాం. ఇంగ్లండ్, వెస్టిండీస్‌తో త్వర లో సిరీస్‌లు ఆడబోతున్నాం. వీటి ద్వా రా మరిన్ని పాయింట్లు ఖాతాలో వేసుకోవాలనుకుంటున్నాం. న్యూజిలాండ్‌లో గతంలో ఆడిన అనుభవం నాతో పాటు జులన్ మాత్రమే ఉంది. అయినా యువ క్రికెటర్ల మేళవింపుతో కూడిన జట్టు 2-1తో సిరీస్ గెలువడం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది' అని మిథాలీ తెలిపింది.



సీఫెర్ట్ (84)

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: సీఫెర్ట్ (బి) అహ్మద్ 84, మున్రో (సి) శంకర్ (బి) క్రునాల్ 34, విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 34, మిచెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 8, టేలర్ (సి) అహ్మద్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండ్ హోమ్ (సి) (సబ్) సిరాజ్ (బి) హార్దిక్ 3, సాంట్నర్ నాటౌట్ 7, కుగ్గెలిన్ నాటౌట్ 20, **ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం:** 20 ఓవర్లలో 219/6.**వికెట్లపతనం:** 1-86, 2-134, 3-164, 4-164, 5-189, 6-191. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-47-1, ఖలీల్ అహ్మద్ 4-0-48-1, క్రునాల్ 4-0-37-1, హార్దిక్ 4-0-51-2, చాహల్ 4-0-35-1.

భారత్: రోహిత్ (సి) ఫెర్గుసన్ (బి) సౌతీ 1, ధవన్ (బి) ఫెర్గుసన్ 29, శంకర్ (సి) గ్రాండ్ హోమ్ (బి) సాంట్నర్ 27, రిషబ్ (బి) సాంట్నర్ 4, ధోనీ (సి) ఫెర్గుసన్ (బి) సౌతీ 39, కార్తీక్ (సి) సౌతీ (బి) సోధీ 5, హార్దిక్ (సి) మిచెల్ (బి) సోధీ 4, క్రునాల్ (సి) సీఫెర్ట్ (బి) సౌతీ 20, భువనేశ్వర్ (సి) సీఫెర్ట్ (బి) ఫెర్గుసన్ 1, చాహల్ (బి) మిచెల్ 1, అహ్మద్ నాటౌట్ 1, **ఎక్స్‌ట్రాలు:** 7, **మొత్తం:** 19.2 ఓవర్లలో 139 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-18, 2-51, 3-64, 4-65, 5-72, 6-77, 7-129, 8-132, 9-136, 10-139. **బౌలింగ్:** సౌతీ 4-0-17-3, కుగ్గెలిన్ 2-0-34-0, ఫెర్గుసన్ 4-0-22-2, సాంట్నర్ 4-0-24-2, మిచెల్ 2.2-0-13-1, సోధీ 3-0-26-2.



మందన (58)

మందన మెరిసినా..

కివీస్ చేతిలో ఓడిన భారత్

వెల్లింగ్టన్: పొట్టి ఫార్మాట్‌లో భారత్‌కు చుక్కెదురైంది. వన్డే సిరీస్ గెలుపు జోరును టీ20ల్లోనూ కొనసాగిద్దామనుకున్న టీమ్‌ఇండియాకు న్యూజిలాండ్ ఝలక్ ఇచ్చింది. బుధవారం కివీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్‌కౌర్ సేన 23 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కివీస్ నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యఛేదనలో భారత్..19.1 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. తహుహు(3/20), కాస్పెరెక్(2/25), కెర్(2/28) ధాటికి టీమ్‌ఇండియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. స్మృతి మందన(34 బంతుల్లో 58, 7ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు జెమీమా రోడ్రిగ్స్(39) రాణించినా మిగతా వారి వైఫల్యంతో ఓటమి కొనితెచ్చుకోవాల్సి వచ్చింది. సాథర్‌వైట్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే అరంగ్రేటం క్రికెటర్ ప్రియా పూనియా(4) వికెట్ కోల్పోయిన భారత్‌ను మందన, రోడ్రిగ్స్ ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జోడించారు. ఇక గాడిలో పడిందనుకున్న తరుణంలో కెర్ బౌలింగ్‌లో మందన ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. ఆ మరుసటి ఓవర్లోనే రోడ్రిగ్స్ నిష్క్రమించడంతో టీమ్‌ఇండియా కోలుకోలేకపోయింది. 101/1 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించిన భారత్.. తహుహు బౌలింగ్ విజృంభణతో ఆరు పరుగుల తేడాతో ఐదు వికెట్లు చేజార్చుకుని మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(17) ఫర్వాలేదనిపించినా..మిగతావారు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. తొలుత డివైన్ అర్ధసెంచరీతో కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసింది. 11 పరుగులకే సుజీ బేట్స్(7) వికెట్ కోల్పోయినా..డివైన్, కెప్టెన్ సాథర్‌వైట్..కివీస్‌కు గౌరవప్రదమైన స్కోరు కట్టబెట్టారు. ఆఖర్లో మార్టిన్(14 బంతుల్లో 27 నాటౌట్, ఫోర్, 2సిక్స్‌లు) సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగింది. హైదరాబాదీ అరుంధతి రెడ్డి(1/38), రాధా యాదవ్(1/38), దీప్తిశర్మ(1/19), పూనమ్ యాదవ్(1/30) ఒక్కో వికెట్ తీశారు. మూడు వికెట్లు తీసిన తహుహుకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది. ఇదిలా ఉంటే..ఈ మ్యాచ్‌లో సీనియర్ క్రికెటర్ మిథాలీరాజ్‌ను తుది జట్టులోకి తీసుకోలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కెప్టెన్ కౌర్ మాట్లాడుతూ యువ క్రికెటర్లకు అవకాశమివ్వాలనే ఉద్దేశంతోనే మిథాలీని తీసుకోలేదని పేర్కొంది.

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
36,975	11,062
↗358	↗128

ముడి చమురు (బ్రెంట్) ↗ 62.68 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	34,450
22 క్యారెట్లు	34,300
వెండి (కిలో)	41,380

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.70	75.20
యూరో	78.20	86.20
బహ్రెయిన్ దినార్	182.60	194.60
కువైట్ దినార్	226.60	239.60
సౌదీ రియాల్	18.10	19.90
యూఏఈ దిర్హామ్	18.50	20.10

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	70.00
రిటైల్ లైవ్	92.00
డ్రెస్డ్	133.00
స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	406-00
రంగారెడ్డి	406-00
మెదక్	406-00
కరీంనగర్	408-00
వరంగల్	408-00
రిటైల్ ప్రైస్	4-65

11 వేల పాయింట్ల పైకి నిఫ్టీ

- 358 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- 5 నెలల గరిష్ఠ స్థాయికి సూచీలు



ముంబై, ఫిబ్రవరి 6: స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజు భారీ లాభాలను నమోదు చేసుకున్నాయి. రిజర్వు బ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నట్లు అంచనాలు వెలువడంతో సూచీలు ప్రారంభం నుంచే భారీ లాభాల దిశగా పయనించాయి. ఆర్థిక సేవలు, ఐటీ, మెటల్ విభాగాలకు చెందిన స్టాక్‌లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటంతో ప్రధాన సూచీలు ఐదు నెలల గరిష్ఠ స్థాయిని తాకాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 358.52 పాయింట్లు(0.98 శాతం) లాభపడి 36,975.23 పాయింట్లకు చేరుకోగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 128.10 పాయిం ట్లు(1.17 శాతం ఎగిసి) 11,062.45 పాయింట్లకు చేరుకున్నది. నాలుగు నెలల తర్వాత నిఫ్టీ మళ్లీ 11 వేల మార్క్‌ను దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ తన చివరి పరపతి సమీక్షను గురువారం ప్రకటించనున్నది. దీంతో ఈక్విటీ మార్కెట్లలో సెంటిమెంట్ మెరుగుపడిందని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటంతో వడ్డీరేట్లను యథాతథంగా కానీ లేదా తగ్గించే అవకాశాలు మెండుగా ఉండటం సూచీలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. 30 స్టాకుల్లో కేవలం రెండు మాత్రమే నష్టపోయాయి. వీటిలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకులు ఉన్నాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లు నాలుగు శాతానికి పైగా లాభపడ్డాయి. బీఎస్‌ఈ లార్జ్‌క్యాప్ ఇండెక్స్ 1.13 శాతం లాభపడగా, మిడ్ క్యాప్ స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే మెటల్, ఐటీ, ఇంధనం, ఆటో రంగాలకు చెందిన షేర్లకు అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో ఈ రంగాల షేర్లు 2.44 శాతం వరకు లాభపడ్డాయి. అన్ని రంగాల నుంచి వచ్చిన మద్దతుతో దేశీయ మార్కెట్లు ఒక శాతం వరకు లాభపడ్డాయని, నిఫ్టీ 10,650-10,950 పాయింట్ల మధ్యలో ట్రేడింగ్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్లోకి మళ్లించడం కూడా సూచీలు ఎగువముఖం పట్టడానికి దోహదం చేశాయి.

కోలుకున్న ఆర్‌కామ్ షేరు

గడిచిన మూడు రోజులుగా పాతాళంలోకి పడిపోయిన అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. బుధవారం ఒక దశలో 11 శాతం వరకు పడిపోయి రికార్డు స్థాయికి పతనమైన షేరు చివరకు 0.74 శాతం లాభంతో రూ.5.48 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు 1.80 శాతం ఎగబాకి రూ.5.65 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 2.25 కోట్ల షేర్లు, ఎన్‌ఎస్‌ఈలో 27 కోట్ల షేర్లు చేతులు మారాయి.

రూపాయికి చిల్లులు తప్పవు!

ప్రస్తుత సంవత్సరంలో రూపాయికి మరిన్ని చిల్లులు తప్పవని ఇండస్ట్రీ వర్గాలు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాదిలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 78 స్థాయికి పడిపోనున్నదని కార్వీ వార్షిక కమోడిటీ అండ్ కరెన్సీ రిపోర్ట్ 2019లో పేర్కొంది. ద్రవ్య, కరెంట్ ఖాతా లోటు ఆందోళనకర స్థాయిలో కొనసాగుతుండటంతో దేశీయ కరెన్సీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని నివేదికలో హెచ్చరించింది. డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు కనీసంగా 68-69.50 మధ్యలోను, గరిష్ఠంగా 73.70-74.50 మధ్య స్థాయిలో కదలాడవచ్చునని కార్వీ కమోడిటీ అండ్ కరెన్సీ సీఈవో రమేష్ వరఖేద్కర్ తెలిపారు. ఒక దశలో 74.50కి పడిపోయిన మారకం విలువ ఈ ఏడాదిలో 78 స్థాయికి తగ్గవచ్చునని ఆయన అంచనావేస్తున్నారు.

అయోమయంలో వెయ్యి కోట్లు

కెనడా క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ సీఈవో ఆకస్మిక మరణం • వేలాది ఖాతాలకు తెలియని పాస్‌వర్డులు • ఎవరికీ అందని 145 మిలియన్ డాలర్ల ఆస్తులు

టోరంటో/న్యూయార్క్, ఫిబ్రవరి 6:

ఓ మరణం.. ఓ అగ్రస్థాయి క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ మూతబడ్డానికి కారణమవుతున్నది. వేలాది మంది కస్టమర్ల ఆశల్ని ఆవిరి చేస్తున్నది. వందల కోట్ల రూపాయలను అయోమయంలో పడేస్తున్నది. అవును.. కెనడాకు చెందిన క్వాడ్రిగాసీఎక్స్ సంస్థ ఇప్పుడు దివాలా అంచున నిలబడింది. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరు, దాని సీఈవో కూడా అయిన గెరాల్డ్ కాటెన్ గతేడాది డిసెంబర్ 9న మృతి చెందాడు. 30 ఏండ్ల గెరాల్డ్.. భారత్ పర్యటనలో ఉన్నప్పుడు జైపూర్‌లో చనిపోయాడు. ఓ బాలల అనాథాశ్రమం ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వాడ్రిగా, గెరాల్డ్ భార్య జెన్నిఫర్ రాబర్ట్‌సన్ తెలిపిన వివరాల ప్రకారం క్రోన్ వ్యాధితో గెరాల్డ్ బాధపడుతున్నాడు. కాగా, గెరాల్డ్ ఆకస్మిక మరణంతో క్రిప్టోకరెన్సీ లావాదేవీలను నిర్వర్తిస్తున్న క్వాడ్రిగా పరిస్థితి అంధకారమైందిప్పుడు. కెనడాలోని అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్‌ల్లో క్వాడ్రిగా ఒకటి. ఇందులో 145 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.1,050 కోట్లు) బిట్ కాయిన్, ఇతర డిజిటల్ ఆస్తులున్నాయి. 'కోల్డ్ వాలెట్లు' అనే ఆఫ్‌లైన్ అకౌంట్లలో ఈ క్రిప్టోకరెన్సీని క్వాడ్రిగా భద్రపరిచింది. ఈ ఖాతాలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లు గెరాల్డ్‌కు మాత్రమే తెలుసు. గెరాల్డ్ చనిపోవడంతో ఇప్పుడు ఆ కరెన్సీ ఎవరికీ అందకుండా పోతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం కనిపించడం లేదు.





నిపుణుల నిస్సహాయత

హ్యాకర్ల నుంచి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా కోల్డ్ వాలెట్లలో క్రిప్టోకరెన్సీని క్వాడ్రిగా భద్రపరుచగా, గెరాల్డ్ మరణంతో పాస్‌వర్డులున్న ఈ వాలెట్లు తెరుచుకోవడం అసాధ్యంగా మారింది. నిపుణులు సైతం ఈ పాస్‌వర్డ్‌లను కనిపెట్టలేకపోతున్నారు. సంస్థ నియమించిన టెక్నాలజీ నిపుణులు.. కంప్యూటర్లు, ముఖ్యంగా గెరాల్డ్ వినియోగించే వ్యక్తిగత ల్యాప్‌టాప్‌ను తెరిపించడానికి తీవ్రంగానే శ్రమించారు. అయినప్పటికీ ఫలితం శూన్యం. దీంతో క్లయింట్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. లక్షకుపైగా ఖాతాదారులకు వెయ్యి కోట్ల రూపాయల మేర క్వాడ్రిగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఎలా చెల్లించాలో తెలియని సందిగ్ధంలో ఉందని సీఎన్‌ఎన్ వెల్లడించింది. అయితే గెరాల్డ్ మొబైల్‌ఫోన్ నుంచి కొంత సమాచారం రాబట్టినట్లు తెలుస్తున్నది.

దివాలా రక్షణ

వేలాది మందికి వందల కోట్లను ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో చేసేదేమీలేక క్వాడ్రిగా.. బ్రిటిష్ కొలంబియాలోని నోవా స్కాటియా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీంతో దివాలా రక్షణ లభించింది. క్రెడిటార్ ప్రొటెక్షన్‌ను మంజూరు చేసినట్లు మంగళవారం క్వాడ్రిగా తెలిపింది. కోల్డ్ వాలెట్లలోకి వెళ్లేందుకు కావాల్సిన పాస్‌వర్డులు గెరాల్డ్‌కు మాత్రమే తెలిసినందున, తాము చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమైనందున బ్యాంక్‌రప్సీ ప్రొటెక్షన్‌ను తీసుకున్నట్లు సంస్థ చెప్పింది.

ఎంత వెతికినా దొరకట్లేదు

మరోవైపు సోషల్ మీడియాలో తన భర్త మృతిపై అనేకానేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, గెరాల్డ్ నిజంగానే చనిపోయాడా ? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని జెన్నిఫర్ రాబర్ట్‌సన్ తెలిపినట్లు ఓ ప్రకటనలో క్వాడ్రిగా వెల్లడించింది. తనకు బెదిరింపులు కూడా వస్తున్నట్లు ఆమె చెప్పారని క్వాడ్రిగా ఈ సందర్భంగా సదరు ప్రకటనలో పేర్కొన్నది. గతకొద్ది వారాలుగా గెరాల్డ్ మరణంతో ఏర్పడిన తమ ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని, అయినప్పటికీ దురదృష్టవశాత్తు ఏవీ సఫలం కావడం లేదన్నది. రాబర్ట్‌సన్ సైతం ఎంత వెతికినా చిన్న క్లూ కూడా దొరకడం లేదంటున్నది. ఎక్కడైనా ఈ పాస్‌వర్డ్‌ల సమాచారం రాసి ఉంటారా? అన్న కోణంలోనూ అన్నిచోట్లా వెతికామని ఆమె చెబుతున్నది.

ఐటీ రిటర్నులకు పాన్‌తో ఆధార్ లింక్ తప్పనిసరి

- స్పష్టంచేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆదాయ పన్ను రిటర్నుల దాఖలకు ఆధార్, పాన్ అనుసంధానం తప్పనిసరేనని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టంచేసింది. ఈ విషయంలో ఇప్పటికే తాము నిర్ణయం తీసుకున్నామని, ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోదని, ఆదాయ పన్ను చట్టం 139 ఏఏ ప్రకారం దీనిని అమలు చేయాల్సి ఉంటదని జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టంచేసింది. ఆధార్-పాన్ అనుసంధానం లేకుండా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసుకునేందుకు శ్రేయా సేన్, జయశ్రీ అనే మహిళలకు ఢిల్లీ హైకోర్టు గతంలో అనుమతినిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ కేంద్రం పిటిషన్ దాఖలు చేసింది. ఆధార్-పాన్ అనుసంధానంపై సుప్రీంలో విచారణ పెండింగ్‌లో ఉండగా, ఢిల్లీ హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో ఆ ఇద్దరు మహిళలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను అసెస్‌మెంట్‌ను ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేశారు కూడా. సెప్టెంబర్ 26న రిటర్నులకు ఆధార్-పాన్‌ను లింక్ చేయాలని కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

ఆకట్టుకున్న పెబ్స్ పెన్నార్

హైదరాబాద్, ఫిబ్రవరి 6: హైదరాబాద్ కేంద్రస్థానంగా విధులు నిర్వహిస్తున్న పెన్నార్ ఇండస్ట్రీ అనుబంధ సంస్థయైన పెబ్స్ పెన్నార్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.180.47 కోట్ల ఆదాయం రూ.2.72 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వీటిలో ఆదాయంలో 33 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, నికర లాభంలో 29.44 శాతం పెరుగుదల కనిపించింది.

వొడాఫోన్-ఐడియా నష్టం రూ.5 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం రంగంలో అతిపెద్ద సంస్థగా అవతరించిన వొడాఫోన్-ఐడియా భారీ నష్టాలను నమోదు చేసుకున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.5,005.7 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో రూ.1,284.5 కోట్లుగా ఉన్నది. వొడాఫోన్-ఐడియాల విలీనం ఆగస్టు 31, 2018 నుంచి అమలులోకి రావడంతో గతేడాది నమోదైన ఆర్థిక ఫలితాలతో పోల్చుకోవాల్సిన అవసరం లేదని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. మొదటి రెండు త్రైమాసికాల్లో నమోదైన నష్టలతో పోలిస్తే మరింత పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ రూ.11,982 .80 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంత క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.7,878.6 కోట్లదాంతో పోలిస్తే 52 శాతం పెరుగడం విశేషం. గత ఫలితాలు చూస్తే ప్రోత్సహకరంగా ఉన్నాయని, ఇంటిగ్రేషన్, నెట్‌వర్క్ విస్తరణ పనులను వేగవంతం చేసినట్లు సీఈవో బాలేష్ శర్మ తెలిపారు. 4జీ వినియోగదారులను మరింత మందిని ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో 4జీ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు.

కిక్కిరిసిన నాగోబా ఆలయం

దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు


నాగోబాను దర్శించుకుంటున్న ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య తదితరులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ప్రారంభమైన నాగోబా జాతర భక్తులతో కిక్కిరిసిపోయింది. బుధవారం నాగోబా దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. నాగోబా ఆలయం వెనుక భాగంలో ఉన్న పెర్సపెన్‌దేవతకు మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో సంప్రదాయపూజలు నిర్వహించారు. ఆదివాసీల సంప్రదాయ వాయిద్యాలైన డోల్, సన్నాయిలు, కాలికోమ్ వాయిస్తూ మెస్రం వంశ పటేళ్ల వెంకట్‌రావు పటేల్, చిన్నుపటేల్, బాదిరావు పటేల్, కటోడ హనుమంతురావు ఆధ్వర్యంలో పెర్సపెన్‌కు (పెద్దదేవుడు) పూజలు నిర్వహించి గంగాజలంతో అభిషేకం చేశారు. కొత్తకోడళ్లు మర్రిచెట్టువద్దకు చేరుకొని పురాతన బావికి ప్రత్యేక పూజలు చేశారు. అల్లుళ్లు నీటిని తోడగా.. కుండలు, బిందెలు మహిళలు తలపై ఎత్తుకొని బాన్‌దేవతల వద్దకు చేరుకున్నారు. బేటింగ్ నిర్వహించిన కొత్తకోడళ్లకు నాగోబా చరిత్రతోపాటు మెస్రం వంశీయుల చరిత్ర, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు.

జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


జోగుళాంబ క్షేత్రంలో మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న అర్చకులు

■ ధ్వజారోహణంతో శ్రీకారం

అలంపూర్, నమస్తే తెలంగాణ: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూరు జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాకలశ స్థాపన, ఆవాహిత దేవతా హోమం, బలిహరణ, నీరాజ మంత్ర పుష్పములు మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో [illegible]తోపాటు అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ విజన్‌తో విప్లవాత్మక మార్పులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభం


సిద్దిపేటలో సమీకృతమార్కెట్ ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి తదితరులు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ విజన్‌కు అనుగుణంగా మార్కెటింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సమీకృత మోడల్ మార్కెట్‌ను సిద్దిపేటలో ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. సిద్దిపేటలోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను బుధవారం హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. నిజాం కాలంలో నిర్మించిన మోండా మార్కెట్ తరహాలో సమీకృత మార్కెట్లను నిర్మించాలని, మోండా మార్కెట్‌ను చూసిరావాలని సీఎం కేసీఆర్ తనకు చెప్పేవారన్నారు. ఆయన విజన్ మేరకు గజ్వేల్, సూర్యాపేట, మహబూబ్‌నగర్‌తోపాటు పలుచోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను నిర్మిస్తున్నామన్నారు. సమీకృత మార్కెట్‌లో మొత్తం నాలుగు విభాగాలు ఉన్నాయి. రెండు విభాగాలు కూరగాయలకు, రెండు విభాగాలు నాన్‌వెజ్‌కు కేటాయించారు. ఈ భవనంలో 17 వాణిజ్య, 21 కూరగాయల హోల్‌సేల్ దుకాణాలు, చేపల విక్రయానికి 17 స్టాళ్లు, నాన్‌వెజ్ 92 స్టాళ్లు, 108 రిటైల్ కూరగాయల స్టాళ్లు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, గృహనిర్మాణ సంస్థ చైర్మన్ మడుపు భూంరెడ్డి, కలెక్టర్ కృష్ణభాస్కర్, జేసీ పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌కు మళ్లీ కాగితపు కళ

- నేటినుంచి ఎస్పీఎంలో పేపర్ ఉత్పత్తి ప్రారంభం
- సిద్ధమైన ఏడో నంబర్ మెషీన్


ఉత్పత్తికి సిద్ధమైన ఏడో నంబర్ మెషీన్

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సిర్పూర్ పేపర్ మిల్లు పూర్వ వైభవాన్ని సంతరించుకోబోతున్నది. కార్మికుల నిరీక్షణకు తెరదించుతూ.. గురువారం సాయంత్రం 7 గంటలకు మిల్లులోని ఏడో నంబర్ మెషీన్ నుంచి పేపర్ ఉత్పత్తి చేసేందుకు రంగం సిద్ధమైంది. సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారం, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషితో మిల్లు పునర్వైభవం దిశగా సాగుతున్నది. దేశంలోనే పురాతన పేపర్‌మిల్లుగా ప్రసిద్ధి గాంచిన ఈ పేపర్ మిల్లును 1938లో నిజాంలు స్థాపించారు. 1943లో ఉత్పత్తి ప్రారంభమైంది. 1950లో బిర్లా గ్రూప్ ఆధీనంలోనికి వెళ్లగా.. 2014 వరకు నిరాటంకంగా ఉత్పత్తి సాగింది. రోజుకు 300 టన్నుల పేపర్ ఉత్పత్తయ్యేది. యాజమాన్యం 2007-08లో కొత్త యంత్రాలు కొనేందుకు మిల్లును ఐడీబీఐలో తాకట్టుపెట్టి రూ.350 కోట్లు రుణంగా తీసుకుంది. ఆ నిధులను అభివృద్ధికి వినియోగించకపోవడంతో నష్టాల బాటపట్టింది. 2014 సెప్టెంబర్ 27న కంపెనీని మూసేసింది. దీంతో 3,200 మంది కార్మికులు, పరోక్షంగా ఆధారపడిన వందలాది మంది రోడ్డునపడ్డారు. వడ్డీతో కలిపి అప్పు రూ.422 కోట్లకు చేరడంతో 2016 అక్టోబర్ 22న మిల్లును ఐడీబీఐ స్వాధీనం చేసుకున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేకదృష్టిసారించి రాయితీలు కల్పించడంతో ఒడిషాకు చెందిన జేకే మిల్లు యాజమాన్యం ముందుకొచ్చింది. గత ఏడాది ఆగస్టు 2న మాజీమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పునరుద్ధరించారు. ప్రస్తుతం మిల్లులోని ఏడో నంబర్ మెషీన్‌ను కాగితం ఉత్పత్తికి సిద్ధం చేశారు.

సీఎం కేసీఆర్ నిర్ణయాలతో.. గ్రామాలకు మహర్దశ

తెలంగాణను అగ్రగామిగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
గ్రామాలకు కేంద్ర నిధులతో సమానంగా రాష్ట్ర నిధులు మంజూరు
సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్
పలు జిల్లాల్లో నూతన సర్పంచ్‌ల ప్రజా కృతజ్ఞతాసభలు



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో ప్రసంగిస్తున్న సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్


వనపర్తి జిల్లా పానగల్‌లో సర్పంచ్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి జూపల్లి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం, ఎమ్మెల్సీ కసిరెడ్డి

మోటకొండూర్/భూపాలపల్లి రూరల్/పానగల్ : సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలతో గ్రామాల్లో గొప్ప మార్పులు రానున్నాయని సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూర్ మండలకేంద్రంలో సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజా కృతజ్ఞతసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో హరితహారం, పారిశుద్ధ్యం, వైకుంఠధామాల నిర్మాణం వంటి బృహత్తర కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో కేసీఆర్ నేతృత్వంలో 14 ఏండ్లపాటు పోరాడి తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసుకున్నామని గుర్తుచేశారు. సాధించిన తెలంగాణను ఆయన అనతికాలంలోనే దేశంలోనే అగ్రగామిగా మార్చారని కొనియాడారు. 24 గంటల నాణ్యమైన కరంటు, రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా, తక్కువకాలంలో భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారన్నారు. మోటకొండూర్ గ్రామాభివృద్ధికి సర్పంచ్ శ్రీలత కృషిచేయాలని సూచించారు. స్థానికుడు, టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య, ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లపై గురుతర బాధ్యత

ప్రభుత్వం అమలుచేసే పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసే గురుతర బాధ్యత సర్పంచ్‌లపై ఉన్నదని ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన పంచాయతీల నూతన పాలక సభ్యుల సన్మానానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బోడకుంటి మాట్లాడుతూ.. నాలుగున్నరేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధినిచూసి ప్రజలు అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో పట్టం కట్టారన్నారు. మధుసూదనాచారి సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహిడని, ఆయన ఎప్పటిలాగానే నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తారన్నారు. మధుసూదనాచారి నాలుగున్నరేండ్లు నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ దాదాపు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు లింగంపల్లి కిషన్‌రావు, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం ప్రతిఫలించాలి

పంచాయతీ పాలకవర్గ సభ్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి అవసరాలకు అనుగుణంగా పని చేసినప్పుడే గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సఫలీకృతం అవుతుందని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల అభినందన కార్యక్రమానికి జూపల్లితోపాటు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. సర్పంచులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని, నీతి, నిజాయతీతో పనిచేసి ప్రజల మన్నలు పొందాలని సూచించారు. నూతన పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రైతు సమన్వయ కమిటీ సభ్యుడు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ బుధవారం మహబూబ్‌నగర్‌లో 84 మంది బాధితులకు రూ. 35 లక్షలు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. హైదరాబాద్‌లో శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్ రెడ్డి రూ.2.24 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.
-హైదరాబాద్/ మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి


భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఎంఈవో పీ కృష్ణయ్య, భాషాపండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఉండాడి నాగేశ్వరావు తదితరులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు నాయకులు ఎంబీ అబ్దుల్లా, విశ్వరూపం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.
- హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ అశ్వారావుపేట టౌన్

గొప్ప క్షేత్రాలుగా వేములవాడ, యాదాద్రి

మాజీ మంత్రి నాయిని ■ వేములవాడలో ఉచితబస్ ప్రారంభించిన నాయిని, ఎమ్మెల్యే చెన్నమనేని

వేములవాడ, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ నేతృత్వంలో వేములవాడ, యాదాద్రి గొప్ప క్షేత్రాలుగా అభివృద్ధి చెందుతాయని మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో భక్తుల కోసం ఉచితబస్, ఈ-టికెట్ నిత్యకల్యాణ భక్తులకు నూతన భోజనవసతి సముదాయాన్ని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ బస్సు వేములవాడ, తిప్పాపూర్ బస్టాండ్లు, రాజన్న ఆలయం మధ్య తిరుగుతుందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు అఖిలభారత రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న రాజరాజేశ్వరి రెడ్డి సంఘం భవనానికి నాయిని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేములవాడ పుణ్యక్షేత్రంలో రెడ్డి సంఘం మరో అడుగు ముందుకేసి భక్తులకు వసతి సముదాయంతోపాటు విద్యార్థులకు హాస్టల్ నిర్మించాలని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఏ కులసంఘమైనా సమాజసేవలో ముందుండాలని సూచించారు. ఎమ్మెల్యే చెన్నమనేని మాట్లాడుతూ వేములవాడ క్షేత్రాన్ని సీఎం కేసీఆర్ గొప్పగా తీర్చిదిద్దబోతున్నారని చెప్పారు.



బుధవారం వేములవాడలో రాజన్న భక్తుల కోసం ఉచిత బస్‌సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు

తీరని శోకం మిగిల్చిన రోడ్డుప్రమాదం

ఖమ్మంలో బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



కోదండరాం, ప్రణయ్ (ఫైల్)

నేలకొండపల్లి: రోడ్డుప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బుధవారం జరిగిన ఈ ఘటన ఓ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. నేలకొండపల్లికి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు తన తల్లి పిచ్చమ్మ (65), కుమారులు కొదండరాం(10), ప్రణయ్(6) ను తీసుకొని బైక్‌పై ముదిగొండ మండలం వెంకటాపురం వెళ్లాడు. బంధువుల పెండ్లికి హాజరై రాత్రి 11.30 గంటలకు నెలకొండపల్లికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిం ది. దీంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. అదే వివాహానికి హాజరైన మరికొం దరు స్థానికులు రోడ్డు పక్కన వెంకటేశ్వర్లు బైక్, సమీపంలోని పొలాల్లో నలుగురి మృతదేహాలను గుర్తించారు. సమా చారం అందు కున్న ఖమ్మం ఏసీపీ వెంకట్రావ్, కూసుమంచి సీఐ మురళీ, ఎస్సై గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఢీకొట్టిన వాహనాన్ని పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణిలో డిపెండెట్ ఉద్యోగాల దందా

- దళారి సంపత్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు

హైదరాబాద్ /భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సింగరేణిలో సంస్థలో డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షల రూపాయల దందాకు పాల్పడ్డ సంపత్‌కుమార్ అనే దళారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని సింగరేణి యాజమాన్యం ధ్రువీకరించింది. ప్రభుత్వం కల్పించిన మెడికల్ అన్‌ఫిట్ ద్వారా వారసులకు ఉద్యోగాలు ఇచ్చే సౌకర్యాన్ని అవకాశంగా తీసుకొని అనేకమంది అనర్హులకు ఉన్నతాధికారుల అండదండలతో ఉద్యోగాలు ఇప్పిస్తానని సంపత్‌కుమార్ రూ. లక్షలు వసూలు చేశాడు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానకార్యాలయం ఎదురుగా ఉన్న ఛమన్ బస్తీలోని సంపత్‌కుమార్ నివాసముండే సింగరేణి క్వార్టర్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పలు ఆధారాలు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సంపత్‌కుమార్‌పై 2014లో తీవ్రమైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఒక ఏరియా నుంచి మరో ఏరియాలకు బదిలీలు చేయిస్తామని ప్రలోభాలకు గురి చేసి లక్షల రూపాయాల అవినీతి దందాకు పాల్పడ్డాడు. దీనిపై గతంలోనే సింగరేణి విజిలెన్స్‌శాఖ విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకున్నది. శ్రీరాంపూర్ ఏరియాలో జరిగిన సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో అమాయకులైన కార్మికులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించిన నేపథ్యంలో చర్యలకు దారితీసింది. ఇటీవల కూడా ఇలాంటి ఆరోపణలు తిరిగి వెలుగు చూడటంతో ఏసీబీ రంగంలోకి దిగింది. అవినీతి మూలాలపై విచారించి వీటికి సూత్రధారి, ప్రధాన పాత్రధారిగా ఆరోపణలు ఉన్న సంపత్‌కుమార్‌ను అరెస్టు చేసింది.

తగ్గిన చలి.. ముదురుతున్న ఎండలు

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గి, ఎండల ప్రభావం పెరుగుతున్నది. పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు దాటాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకటిరెండు చోట్ల మినహా రాత్రి ఉష్ణోగ్రతలు 15-20 డిగ్రీల వరకు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గాలిలో తేమశాతం అధికంగా ఉండటంతో రాత్రి,తెల్లవారుజాములో కొంత చలి, పొగమంచు ఉంటుందన్నారు.గ్రేటర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 30.9 డిగ్రీలుగా నమోదైంది. ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14డిగ్రీలుగా నమోదుకాగా, మరో మూడు రోజులు కొనసాగుతుందన్నారు. యాంటీ సైక్లోన్ వేవ్‌ల వల్ల 9,10 తేదీల్లో చిరుజల్లులు కురిసే అవకాశముందని తెలిపారు.

మక్కలు @ రూ.2111

కాశీబుగ్గ(వరంగల్ అర్బన్): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మక్కలకు రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ.2111 ధర పలికింది. కొత్త మక్కలు మార్కెట్‌కు రాగానే వ్యాపారులు పోటీపడి అత్యధిక ధరకు కొనుగోలుచేశారు. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర అని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.1,472 పలుకగా, జనవరిలో రూ.1,909 వరకుచేరింది. బుధవారం మార్కెట్‌కు 123 బస్తాల మక్కలు రాగా మధ్యరకం రూ.2089, అత్యల్పంగా రూ.1911 ధరలు పలికాయి.

సకల సౌకర్యాలు కల్పించాలి

చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ సూచించారు. ఈ నెల 24నుంచి 28 వరకు నిర్వహించే లింగమంతులస్వామి జాతర ఏర్పాట్లపై బుధవారం ఆయన ఆలయ సమీపంలో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నీటివసతి కల్పించాలని ఆదేశించారు. కేసారంలో దేవరపెట్టె ఉన్న ఇంటికి రంగులువేయాలని సూచించారు. ఫంక్షన్‌హాల్ ప్రహరీ నిర్మాణానికి మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి రూ.10 లక్షలు అదనంగా నిధులు అందించారని తెలిపారు.


పెద్దగట్టు ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

ఖమ్మం జిల్లాలో టీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడులో టీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఎన్డీ (న్యూడెమోక్రసీ) కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఇటీవలి పంచాయతీ ఎన్నికల్లో తెట్టెలపాడులో ఎన్డీ అభ్యర్థి టీఆర్‌ఎస్ అభ్యర్థిపై స్వల్ప మెజార్టీతో గెలుపొందాడు. బుధవారం ఎన్డీ నాయకుడు నరేందర్ నాయకత్వంలో అతడి అనుచరులు అనుమతి లేకుండా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఎస్సీ కాలనీకి రాగానే పథకం ప్రకారం టీఆర్‌ఎస్ కార్యకర్తలపై కర్రలతో దాడులకు పాల్పడ్డారు. దాడిలో టీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉప్పలయ్య, రాజ్‌కుమార్, అయోధ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఖమ్మం దవాఖానకు తరలించారు. కూసుమంచి సీఐ మురళి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని పికెట్ ఏర్పాటు చేశారు.

టీఆర్‌ఎస్‌లోకి చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు భారీగా టీఆర్‌ఎస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండ లం గోన్‌గొప్పుల పంచాయతీ పాలకవర్గం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో పలుగ్రామాల సర్పంచ్‌లు చెన్నమనేని రమేశ్‌బాబు సమక్షంలో, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వీఆర్ బంజర సర్పంచ్ మాలోతు విజయ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలకేంద్రంతో పాటు మండలంలోని పుప్పాలపల్లికి చెందిన పలువురు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్ సమక్షంలో, జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్‌తోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 100 వందమంది జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కొత్తపేట సర్పంచ్ పారుపల్లి చెన్నమ్మతోపాటు 200 మంది ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.


హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే మగంటి గోపీనాథ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న రహ్మత్‌నగర్ డివిజన్ వాసులు


టీఆర్‌ఎస్‌లో చేరిన ఖమ్మం జిల్లా వీఆర్ బంజర గ్రామ సర్పంచ్, పాలకవర్గంతో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్


జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరినవారితో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కలప అక్రమనిల్వలపై కొనసాగుతున్న దాడులు

గుండాల/టేకులపల్లి: కలప అక్రమనిల్వలపై భద్రాద్రి కొత్తగూడెంలో అటవీశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తదాడులు కొనసాగుతున్నాయి. బుధవారం గుండాలలో సోదాలు నిర్వహించి రూ.75 వేల విలువైన కలప స్వాధీనం చేసుకున్నారు. టేకులపల్లి మండలంలోని రామచంద్రునిపేట, బోడు గ్రామాల్లో పలువురి ఇండ్లల్లో దాడులు నిర్వహించి టేకు, నారవేప, ఏగిస దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందు మండలం పోలారంలో తనిఖీలు చేపట్టి రూ.30 వేల విలువైన కలప, దమ్మపేట రేంజ్ పరిధిలోని మొద్దులమడ, దమ్మపేట మండలం చెన్నువారిగూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించి రూ.75 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న కలపతో పోలీస్, అటవీశాఖ అధికారులు


ఇంగ్లాండ్‌కు చెందిన శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ శిష్యుడు డాక్టర్ మైకెల్ యార్క్ తన సతీమణి వల్లరితో కలిసి బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో పర్యటించారు. 41 ఏండ్ల కిందటికి, ఇప్పటికి ఎంతో మార్పు వచ్చిందన్నారు. నిరంతర విద్యుత్, ఆదివాసీ మ్యూజియం ఏర్పాటుపై ప్రభుత్వాన్ని ప్రశంసించారు. కుమ్రం భీం మనమడు, మనమరాలితో మాట్లాడారు. - కెరమెరి/జైనూర్

5.26 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో బుధవారం 5.26 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు కొత్తగూడెం ఓఎస్డీ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు భారీగా గంజాయిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో అటవీ, పోలీస్‌శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో తరలిస్తున్న రూ.63.16 లక్షలు విలువైన రూ.5.26 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన డ్రైవర్ మహానంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మల్కన్‌గిరిలోని గంజాయి స్మగ్లర్ రాజ్‌రాజ్, వాహన యజమాని మహిర్ మందల్ ఈ దందా చేస్తున్నట్టు డ్రైవర్ చెప్పాడన్నారు.

గంజాయి సాగు చేస్తున్న యువకుల అరెస్ట్

రఘునాథపాలెం: ఖమ్మం శివారు బల్లేపల్లిలోని మక్కజొన్న చేనులో రైతుకు తెలియకుండా రహస్యంగా గంజాయి సాగుచేస్తున్న యువకులను ఖమ్మం అర్బన్ పోలీసులు పట్టుకున్నారు. యూపీహెచ్ కాలనీకి చెందిన మామిడి హరికృష్ణ, ధరావత్ పవన్‌కల్యాణ్, జయనగర్ కాలనీకి చెందిన బబ్లూ 50 మొక్కలు పెంచుతున్నట్టు గుర్తించారు.



పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో భేటీ అయిన జపాన్ బృందం

వరంగల్‌లో వ్యర్థాల భస్మీకరణ కేంద్రం!

పురపాలక కార్యదర్శితో జపాన్ బృందం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యర్థాల భస్మీకరణ కేంద్రం ఏర్పాటుచేయాలని, దీనిద్వారా వ్యర్థాల నుంచి దుర్వాసన కూడా ఉండదని జపాన్ ఉన్నతస్థాయి బృందం పేర్కొన్నది. బుధవారం జపాన్ ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో భేటీ అయింది. బృందానికి జపాన్ క్లీన్ అథారిటీ వ్యర్థాల నిర్వహణ అంతర్జాతీయ డైరెక్టర్ హిడెనోరి యోకోయమా నేతృత్వం వహించారు. వరంగల్ కార్పొరేషన్‌లో వ్యర్థాల భస్మీకరణ కేంద్రం ఏర్పాటుపై, వ్యర్థాల శుద్ధీకరణలో ఆధునిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించారు. గతంలోనే గ్రేటర్ వరంగల్‌లో అధ్యయనం చేసిన ఈ బృందం సభ్యులు.. వ్యర్థాలను నియంత్రించాల్సిన విధానం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిపై వెచ్చించే సొమ్మును త్వరగా వెనుకకువచ్చేలా 'రెవెన్యూ మోడల్'ను సిద్ధం చేయాలని అరవింద్‌కుమార్ సూచించారు. చెప్పారు.

ఎఫ్ఎస్‌టీపీపై జాతీయ మీడియా అధ్యయనం

గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో దేశంలోని తొలి మానవ మలమూత్ర వ్యర్థాల శుద్ధి కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ:ఫ్యాకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)పై అధ్యయనం చేయడానికి జాతీయ మీడియా ప్రతినిధులు బుధవారం క్షేత్రస్థాయిలో ఆస్కీ ఆధ్వర్యంలో పర్యటించారు. అమ్మవారిపేటలో మానవ మలమూత్ర వ్యర్థాల శుద్ధికేంద్రాన్ని సందర్శించారు. శుద్ధిచేసే విధానాన్ని పరిశీలించారు. ఆస్కీ ప్రతినిధి శ్రీనివాసాచారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2017లో దేశంలోనే మొదటిప్లాంట్‌గా గ్రేటర్ వరంగల్‌లోని అమ్మవారిపేటలో బిల్ గేట్స్ మిలిందా ఫౌండేషన్, కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ ఏర్పాటుచేశారని, అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించామని తెలిపారు. శుద్ధి తర్వాత ఉత్పత్తి అయ్యే ఎరువును విక్రయిస్తున్నామని, నీటిని గార్డెనింగ్‌కు వినియోగిస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం మీడియా బృందం కార్పొరేషన్ కమిషనర్‌తో సమావేశమైంది.



సదర్‌మాట్ బరాజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే

సెప్టెంబర్‌లో సదర్‌మాట్

18వేల ఎకరాలకు నికరంగా సాగునీరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరునాటికి సదర్‌మాట్ బరాజ్ నిర్మాణ పనుల్ని పూర్తిచేసి.. 18వేల ఎకరాలకు నికరంగా సాగునీరందించేందుకు నీటిపారుదలశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే రెండురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు బుధవారం సంబంధిత పనులను పరిశీలించారు. 50శాతం పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. సెప్టెంబరు నెలాఖరునాటికి పనులను పూర్తిచేసేందుకు వర్క్ ఏజెన్సీ అంగీకరించింది. అనంతరం దేశ్‌పాండే.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ-27 పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎస్సారెస్పీలోకి రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు చేరితే... ప్యాకేజీ-27 కాల్వ ద్వారా 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అదేవిధంగా 20 చెరువులను నింపేందుకు కూడా వీలవుతుందని చెప్పారు. ఈ ప్యాకేజీ కింద నిర్మల్ నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఆ తర్వాత 28వ ప్యాకేజీని పరిశీలించిన దేశ్‌పాండే భూసేకరణ జరుగని కారణంగా కాలువల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతుండటాన్ని గుర్తించారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ ప్యాకేజీ కింద ముథోల్ నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఆదిలాబాద్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు దేశ్‌పాండే వెంట ఉన్నారు.

అడవుల్లో మెటల్ డిటెక్టర్లు

- వేటగాళ్ల ఉచ్చుల నివారణకు ఆధునిక పరికరాలు
- అడవుల మార్గాల్లో, చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు
- స్మగ్లర్ల కదలికలపై నిఘాకు రెండు డాగ్‌స్క్వాడ్లు



ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: అటవీ నేరాల నియంత్రణకు, వన్యప్రాణుల సంరక్షణకు రాష్ట్ర అటవీశాఖ ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించబోతున్నది. అభయారణ్యాలు, అరణ్యాల్లో వేటగాళ్లు రకరకాల ఉచ్చులు, ఉరులు బిగించి వన్యప్రాణులను హతమారుస్తుండటం, పెద్దపులుల చర్మాలను ఒలుస్తున్న క్రమంలో సాంకేతికతో వారి ఆటకట్టించాలని నిర్ణయించింది.అడవుల లోపల ఉన్న దాదాపు వేయి కెమెరాట్రాప్‌లను రెట్టింపుచేయడంతో పాటు అటవీ ప్రాంతాలకు వెళ్లే ప్రధానమార్గాల్లో, అన్ని చెక్‌పోస్టుల్లో క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలను అమర్చాలని అధికారులు నిర్ణయించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అభయారణ్యం పరిధిలో వరుసగా పెద్దపులులు, చిరుత పులులు వేటగాళ్ల ఉచ్చులకు బలైన నేపథ్యంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు వాడుతున్న హ్యాండ్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను కొనుగోలు చేసి మొదట కవ్వాల్, అచ్చంపేట-అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యాల్లో వాడాలని అధికారులు నిర్ణయించారు. వేటగాళ్లు పొదలమాటున, చెట్ల గుబురుచాటున అమర్చే ఉచ్చులు భూమిపై తేలి ఉన్నప్పటికీ వాటిని గుర్తించడం అటవీ సిబ్బందికి కష్టంగా ఉంటుంది. మెటల్ డిటెక్టర్లను ఉపయోగించడం ద్వారా ఉచ్చులను రెండుమీటర్ల దూరంనుంచే బీప్‌సౌండ్ ద్వారా గుర్తించవచ్చని అధికారులు చెప్తున్నారు. యానిమల్ ట్రాకర్లు, బేస్‌క్యాంప్ వాకర్లకు వీటిని ఇచ్చి సున్నిత ప్రాంతాల్లో వినియోగిస్తారు.

మరోరెండు డాగ్‌స్క్వాడ్లకు ప్రతిపాదనలు

మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో శిక్షణ పొందిన రెండు జర్మన్ షెపర్డ్ డాగ్‌స్క్వాడ్లు నెలరోజుల క్రితం రాష్ట్రానికి వచ్చాయి. వాటిని కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాల్లో స్మగ్లర్ల కదలికలను పసిగట్టడానికి, నేరాల నియంత్రణకు ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే డాగ్‌స్క్వాడ్లు కొందరు నేరస్తులను పట్టించాయి. మరోరెండు డాగ్‌స్క్వాడ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (ఐటీ, విజిలెన్స్) రఘువీర్ తెలిపారు. త్వరలో అవి కూడా రంగంలోకి దిగనున్నాయన్నారు.

ఇన్సులేటెడ్ వైరింగ్ కోసం విద్యుత్‌శాఖకు..

అడవుల్లో వన్యప్రాణులను బలిగొనడానికి వేటగాళ్లు ఎక్కువగా కరంట్ వైర్లను అమరుస్తున్నారు. కరంట్‌వైర్లు వేటగాళ్లు వాడకుండా ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులు దృష్టిసారించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు విద్యుత్‌శాఖ అధికారులతో చర్చలు జరిపారు. అటవీ ప్రాంతాల్లో ఇన్సులేటెడ్ వైరింగ్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. విద్యుత్, అటవీశాఖ సమన్వయం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మోతెలో గ్రావిటీ కెనాల్

- రిజర్వాయర్‌కు బదులుగా కాల్వ
- రూ.266 కోట్లతో టెండర్లు
- ఈ వర్షాకాలానికి ఎంఎంఆర్ కింద 80వేల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రతిపాదిత మోతె రిజర్వాయర్ స్థానంలో గ్రావిటీ కాల్వ ద్వారానే నిర్దేశిత ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం జలసౌధలో ఎస్సారెస్పీ, సంబంధిత ప్రాజెక్టు పనుల పురోగతిపై జరిగిన సమీక్షలో ఈ అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 2.90 టీఎంసీల సామర్థ్యంతో మోతె వద్ద రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టేందుకు తొలుత డిజైన్ రూపొందించారు. దీని కింద 26వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం చేయకుండానే.. ఎస్సారెస్పీ వరద కాల్వ నుంచి గ్రావిటీ కెనాల్ నిర్మాణం చేపడితే నేరుగా ఆయకట్టుకు సాగునీరందించే అవకాశముంటుందని గుర్తించారు. ఈ నేపథ్యంలో రూ.266 కోట్లతో గ్రావిటీ కాల్వ నిర్మాణానికిగాను అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. త్వరలో ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవనున్నట్టు ఈఎన్సీ అనిల్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా మిడ్ మానేరు రిజర్వాయర్(ఎంఎంఆర్) కింద గౌరవెల్లి వరకు 80వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన పనులపైనా అధికారులు దృష్టిసారించారు. జూన్ నెలాఖరులోగా ఈ పనులను పూర్తి చేసి, 80వేల ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయించారు.



ఎస్సారెస్పీ సంబంధిత ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్న మాజీమంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు.

ఎల్‌ఎండీ దిగువన కీలకం..

ఎస్సారెస్పీ కింద 14.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే.. అందులో కాకతీయ కాలువ ఆయకట్టే ప్రధానమైనది. ఇందులో భాగంగా ఎస్సారెస్పీ స్టేజ్-1 కింద 9,62,640 ఎకరాలు ఉండగా.. ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద 3,97,000 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతోపాటు ఎస్సారెస్పీ ఫోర్‌షోర్‌లో లిఫ్టులున్నాయి. కాకతీయ కాల్వ గరిష్ఠ ప్రవాహ సామర్థ్యం దాదాపు 8 వేల క్యూసెక్కుల పైచిలుకు ఉన్నప్పటికీ.. సరైన నిర్వహణ, పర్యవేక్షణలేక మొన్నటిదాకా 3 వేల నుంచి 4 వేల క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆధునీకరణ పనుల్లో వేగం పెరుగడంతోపాటు గరిష్ఠ ప్రవాహ సామర్థ్యం మేరకు నీటిని తరలించేందుకు అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హన్మకొండ సమీపంలో ఉన్న ప్రధాన అడ్డంకిని కూడా అధునాతన సాంకేతిక విధానంతో అధిగమించారు. కాకతీయ కాలువ ఆధునీకరణ పనుల్లోనూ అధికారులు వేగం పెంచారు. ఎల్‌ఎండీ ఎగువన 0-68 కిలోమీటర్ల వరకు కాల్వలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఆతర్వాత 68-145 కిలోమీటర్ వరకు ఆధునీకరణ పనులు చేపట్టగా... ఇప్పటివరకు 40 శాతానికి పైగా పూర్తయినట్టు ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ తెలిపారు. ఎల్‌ఎండీ దిగువన 146-284 కిలోమీటర్ వరకు రూ.400 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనుల్లో ఇప్పటివరకు 65 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం నీటి విడుదల కొనసాగుతున్నందున ఏప్రిల్ నుంచి యుద్ధప్రాతిపదికన పనులను కొనసాగించి జూన్ నెలాఖరుకు పూర్తిచేస్తామన్నారు. వీటితో పాటు డిస్ట్రిబ్యూటరీల ఆధునీకరణ కూడా నిర్ణీత గడువులోగా పూర్తిచేస్తామని తెలిపారు.

ఐటీ ఉద్యోగాలకు టాస్క్‌నుంచి 165 మంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టాస్క్, సర్వీస్‌నౌ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తిచేసుకున్న 165 మంది విద్యార్థులు వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శిక్షణ బుధవారం పూర్తయిన సందర్భంగా హైటెక్ సిటీలోని నాలెడ్జ్ సెంటర్‌లో జయేశ్‌రంజన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఐటీ రంగానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకే ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులు

ఓట్ల కోసం దరఖాస్తులు 24 లక్షలు

మొదటిపేజీ తరువాయి...

దరఖాస్తులను ఆమోదించగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 61,047 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. మరో 8.03 లక్షల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.

5వ తేదీ సాయంత్రం వరకు అప్‌డేట్‌చేసిన దరఖాస్తుల వివరాలు

దరఖాస్తులు	వచ్చినవి	ఆమోదించినవి	తిరస్కరించినవి	పెండింగ్
ఫామ్-6	1797628	932756	61047	803825
ఫామ్-6ఏ	2091	94	72	1925
ఫామ్-7	197818	138836	5986	52996
ఫామ్-8	222914	97126	20761	105027
ఫామ్-8ఏ	150685	76634	3467	70584
మొత్తం	**23,71,136**	**12,45,446**	**91,333**	**10,34,357**

10 నుంచి మానేరు నీళ్లు

మొదటిపేజీ తరువాయి...

పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూముల వరకు ప్రతి ఎకరాకూ నీళ్లందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించామన్నారు. ఇందు కోసం డిస్ట్రిబ్యూటరీలనూ బలోపేతం చేసుకుంటున్నట్టు చెప్పారు. అధికారికంగా చెరువులు, కుంటలు నింపాలని సీఎం కేసీఆర్ సూచించారని తెలిపారు. దీంతో భూగర్భజలాలు, మత్స్య సంపద పెరుగుతుందని ఈటల చెప్పారు. జూన్ 30 వరకు కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయడంతో పాటు అవసరమైతే అదనపు నిధులు కూడా తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. ఎండాకాలంలో రైతాంగానికి నీళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల భూసేకరణలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశం అనంతరం మాజీ మంత్రి ఈటల రాజేందర్ సమావేశపు సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు సమర్పించారు. సమావేశంలో ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వొడితెల సతీశ్ కుమార్, రామలింగారెడ్డి, రసమయి బాలకిషన్, ఆరూరి రమేశ్, సీతక్క, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేంద్రరావు, అనిల్‌కుమార్, ఎస్ఈలు శంకర్, హరిరాం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 7 ఫిబ్రవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



మారిన జీవన విధానంతో రోగం లేని మనిషి లేడు..
అందుకే ఆరోగ్యకరమైన ఆహారానికి వాగ్దానం..
రైతుబడిలో..



72 యేండ్ల వయసులో పతకాలు
కొల్లగొడుతున్నాడు
ఈ వెటరన్ చాంపియన్..
విశేషలో..



చల్లగాలి కాస్త నెమ్మదించింది..
వేడి గాలులు తగులుతున్నాయి..
వాతావరణానికి తగ్గట్టుగా.. ఆహారాన్ని కూడా మార్చేయాలండోయ్..
మరి రుచి మాటేంటనే కదా మీ సందేహం..
చిరుధాన్యాలతో సూపర్‌గా వంటలు చేసేయొచ్చు..
అటు ఆరోగ్యం.. ఇటు ఆనందం రెండింటినీ సొంతం చేసుకోవచ్చు..
లడ్డు.. పలావు.. ఉప్మా.. పాయసంతో పసందైన ఈ విందు మీకోసం..

చిరుధాన్యాలతో.. చల్లగుండా!

రాగిలడ్డు



కావాల్సినవి :

రాగులు : 250 గ్రా.
నెయ్యి : 100 గ్రా.
యాలకులపొడి : 2 టీస్పూన్స్
బెల్లం : 250 గ్రా.
డ్రైఫ్రూట్స్ : తగినన్ని

తయారీ : రాగులు తీసుకొని శుభ్రం చేసుకోవాలి. కడాయిలో నూనె వెయ్యకుండా దోరగా వేయించుకోవాలి. తర్వాత బెల్లం సన్నగా తురిమి పెట్టుకోవాలి. అంతలోపు వేయించిన రాగుల్ని పిండి పట్టించాలి. పిండిలో వేడి చేసిన నెయ్యి, యాలకుల పొడి, తురిమిన బెల్లం వేసి బాగా కలుపాలి. చేతికి కొంచెం నెయ్యి రాసుకొని చిన్న చిన్న ఉండలు లేదా కావాల్సిన సైజులో లడ్డూల్లా చుట్టుకోవాలి. ఇష్టమున్నవాళ్లు డ్రైఫ్రూట్స్‌ని సన్నగా తరిగి పిండిలో కలుపుకోవచ్చు. తయారయిన లడ్డూలను గాలి చొరబడని డబ్బాలో భద్రపరుచుకుంటే పదిరోజుల పాటు పదిలంగా ఉంటాయి.

ఊదల ఉప్మా



కావాల్సినవి :

ఊదలు : 2 కప్పులు, **నూనె/నెయ్యి :** 2 టేబుల్ స్పూన్స్, **ఆవాలు:** అర టీ స్పూన్, **జీలకర్ర :** అర టీ స్పూన్, **శనగపప్పు :** ఒక టీస్పూన్, **పచ్చిమిర్చి :** 3, **కరివేపాకు :** 2 రెమ్మలు, **పల్లీలు :** 2 టీ స్పూన్స్, **అల్లం :** 1 చిన్నముక్క, **ఉల్లిగడ్డ :** 1, **పసుపు :** చిటికెడు, **ఉప్పు :** తగినంత

తయారీ :

ఊదలు శుభ్రం చేసుకొని గంటపాటు నీటిలో నానబెట్టాలి. కడాయిలో నూనె లేదా నెయ్యి వేసి వేడి చెయ్యాలి. అందులో కొంచెం ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి, కరివేపాకు, శనగపప్పు, అల్లం ముక్కలు, పల్లీలు, పసుపు, ఉల్లిపాయలతో తాళింపు వేసుకోవాలి. ఇప్పుడు మూడు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. ఇందులో ముందుగా నానబెట్టిన ఊదలు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపాలి. నీరు ఇగిరే వరకూ కలుపుతూ ఉడుకనివ్వాలి. ఉప్పు, కారం సరిచూసుకొని నీరు ఇంకిపోయే వరకూ ఉడికించాలి. అంతే వేడి వేడి ఊదల ఉప్మాని ఊరగాయతో పాటు వడ్డిస్తే రుచిగా ఉంటుంది.


సజ్జల చక్కెర పొంగలి



కావాల్సినవి :

సజ్జలు : 2 కప్పులు, **పెసరపప్పు :** 1 కప్పు
కిస్మిస్ : అర కప్పు,
యాలకుల పొడి : పావు టీస్పూన్,
బెల్లం : తగినంత, **జీడిపప్పు :** అర కప్పు
కొబ్బరి : అర చెక్క
నెయ్యి : 3 టీస్పూన్స్

తయారీ : సజ్జలు శుభ్రం చేసుకొని గంటపాటు నీటిలో నానబెట్టాలి. అదే విధంగా పెసరపప్పు కూడా నానబెట్టుకోవాలి. కొబ్బరిని చిన్న ముక్కలుగా కోసి నెయ్యిలో దోరగా వేయించి పెట్టుకోవాలి. అలాగే జీడిపప్పు, కిస్మిస్‌ని కూడా దోరగా వేయించాలి. బెల్లం తురుముకొని చిక్కగా పాకం పట్టుకోవాలి. అందులో యాలకుల పొడి కూడా వెయ్యాలి. కడాయిలో నెయ్యి వేడి చేసి పెసరపప్పు, సజ్జలు దోరగా వేయించుకొని సరిపడా నీళ్లు పోసి ఉడికించాలి (1 కప్పు సజ్జలు+పెసరపప్పు = 3 కప్పుల నీళ్లు). ఇందులో కొబ్బరిముక్కలు, జీడిపప్పు, కిస్మిస్‌తో పాటు బెల్లం పాకం కూడా వేసి బాగా దగ్గరగా అయ్యేవరకు ఉడికించాలి. తగినంత ఉప్పు వేసి దింపేయాలి. తియ్యని పొంగలి మీ ముందుంటుంది.



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

సామల వెజిటేబుల్ పులావ్



కావాల్సినవి :

సామలు : 100 గ్రా., **నూనె, నెయ్యి :** 3 టీస్పూన్స్, **పచ్చిమిర్చి :** 6, **ఉల్లిగడ్డ :** 1, **కొత్తిమీర :** 1 కట్ట, **పుదీనా :** 1 కట్ట, **ఆలుగడ్డ :** 1, **కాప్సికమ్ :** 1, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్, **యాలకులు :** 8, **లవంగాలు :** 8, **దాల్చిన చెక్క:** 4 ముక్కలు, **పలావు ఆకులు :** 4, **జీడిపప్పు :** అర కప్పు, **బీన్స్ :** 6, **గ్రీన్‌పీస్ :** అర కప్పు, **ఉప్పు :** తగినంత

తయారీ :

సామలను శుభ్రం చేసి గంటపాటు నీటిలో నానబెట్టాలి. కూరగాయలు, కొత్తిమీర, పుదీనాని కట్‌చేసి పెట్టుకోవాలి. మందపాటి గిన్నెలో నూనె లేదా నెయ్యి వేసి దానిలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, పలావు ఆకులు వేసి దోరగా వేయించాలి. తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకూ వేగనివ్వాలి. ముందుగా కట్‌చేసి పెట్టుకున్న కూరగాయ ముక్కలు వేయాలి. కొంచెం మగ్గిన తర్వాత సరిపడా నీరు పోసి కలుపుతూ మరగనివ్వాలి. నానబెట్టుకున్న సామలు వేసి కలిపి ఉడికించాలి. అందులో సగం కొత్తిమీర, పుదీనా వేసుకోవాలి. 15 నిమిషాల పాటు సన్నని సెగపై ఉంచి స్టౌ మీది నుంచి దింపేయాలి. మిగిలిన కొత్తిమీర, పుదీనా చల్లుకొని రైతాతో సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

శాఖాహారులకు ఉచిత టికెట్



అమెరికన్ సింగర్ బియాన్సే ఇచ్చే ప్రదర్శనలను.. జీవితాంతం ఉచితంగా చూసేందుకు టికెట్లు గెలుచుకునే అవకాశాన్ని ప్రకటించారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నది. ఎందుకో తెలుసా?

అమెరికాకి చెందిన బియాన్సే, తన భాగస్వామి జే-జీ ఇచ్చే ప్రదర్శనలను జీవితాంతం ఉచితంగా చూసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే ఈ టికెట్లు ఊరికే రావు. ఇందుకు ఒక షరతు కూడా పెట్టింది. దీని కోసం శాఖాహారం మాత్రమే తినాలి. అందులోనూ గుడ్లు, డెయిరీ ఉత్పత్తులు, ఇతర జంతు సంబంధం లేని వీగన్ పదార్థాలు మాత్రమే తింటానని హామీ ఇచ్చి దానికి కట్టుబడాలన్నది షరతు. పర్యావరణంపై వీగనిజమ్ చూపే సానుకూల ప్రభావాలను ప్రచారం చేసే గ్రీన్ ప్రింట్ ప్రాజెక్ట్ ద్వారా బియాన్సే ఈ పోటీ నిర్వహిస్తున్నది. తాము తినేది మొక్కల నుంచి ఉత్పత్తి అయిన ఆహారం ఎంత ఉందో అభిమానులు తెలుపాల్సి ఉంటుంది. ఆ విధంగా ఆహార అలవాట్లను పాటించే వారిలో ఒకరికి జీవితకాలం ఉచితంగా తమ ప్రదర్శనలు చూసేందుకు టికెట్లు లభిస్తాయి. గెలుపొందిన వారు మరొకరిని వెంటబెట్టుకొని హాజరు కావొచ్చని బియాన్సే ప్రకటించింది. ఈ పోటీలో కేవలం ఒక్కరికి మాత్రమే అవకాశం లభిస్తుంది. జీవితకాలం అంటే 30 యేండ్లు అని కూడా నిబంధన విధించింది. బియాన్సే చాలాకాలం నుంచి వీగన్ ఆహార శైలిని ప్రచారం చేస్తున్నది. మొక్కల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినండంటూ పూర్తి సహకారం అందిస్తున్నదని 'ది వీగన్' సొసైటీ తెలిపింది. 'మొక్కల నుంచి వచ్చిన ఆహార పదార్థాలతో కూడిన భోజనాన్ని తొమ్మిది సార్లు తింటే, ఒక నెలలో గాలిలోని విషవాయువులను 14 చెట్లు పీల్చుకోవడానికి సరిపడినంత పర్యావరణ ప్రభావం చూపినట్లే' అని గ్రీన్‌ప్రింట్ ప్రాజెక్ట్ చెబుతున్నది. 30 యేండ్లు ఉచిత టికెట్ అంటే 8.57 లక్షలకు సమానమని వెబ్‌సైట్ చెబుతున్నది.

పంటి నొప్పికి ఉపశమనం ఇలా!

పంటి నొప్పితో బాధపడే వారికి ఒక్కచోట ఉండాలనిపించదు. ఏమీ తినాలనిపించదు. చల్లని నీరు తాగాలన్నా ఇబ్బందే.. చివరకు మాట్లాడాలన్నా చిరాకు వస్తుంది. మరికొందరికి మొహం వాచిపోతుంది. ఇంట్లోనే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నొప్పి నుంచి బయట పడొచ్చు.



- ఉల్లిగడ్డను ముక్కలుగా చేయాలి. ముక్కలను నొప్పిగా ఉన్న చిగుళ్ల వద్ద ఉంచితే పంటి నొప్పి నుంచి తక్షణం ఉపశమనం పొందవచ్చు.
- లవంగాలు, కొబ్బరినూనె, మిరియాల పొడి, ఉప్పు అన్నింటినీ బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని నొప్పిగా ఉన్న పంటిపై రాస్తే చిటికెలో నొప్పి మాయమవుతుంది.
- జామ ఆకులో యాంటీ ఇన్ఫ్లమెంట్రీ, యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ ఉంటాయి. పంటి నొప్పితో బాధపడేవారు 2, 3 జామ ఆకుల్ని శుభ్రంగా కడిగి తింటే ఉపశమనం లభిస్తుంది.
- తాజా పండ్లు ఎక్కువగా తినాలి. క్యాల్షియం ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి. పిల్లలకు చెరుకు లాంటి నమిలే పదార్థాలు పెట్టడం వల్ల దంతాలు దృఢంగా తయారవుతాయి.
- ప్రతిరోజూ టిఫిన్‌కి ముందు, రాత్రి ఆహారం తీసుకున్నాక బ్రష్ చేయాలి. అంటే రోజుకి రెండుసార్లన్నమాట. ఇలా చేస్తే పంటిలో ఇరుక్కుపోయిన ఆహార కణాల ద్వారా పళ్లు పాడవ్వకుండా ఉంటాయి.
- బ్రష్ చేసి నోటిని శుభ్రపరిచేటప్పుడు చల్లని నీటికి బదులుగా గోరువెచ్చని నీటిని వాడాలి. ఇలా చేస్తే నోటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

పాదాలపై పగుళ్లా?



చలికాలంలో తరచూ ఆడవారికి కాళ్లు పగులుతూ ఉంటాయి. ఆ నొప్పితోనే వారు ఇంటి పని, వంట పని చేస్తుంటారు. కొన్ని చిట్కాలు పాటిస్తే సుతిమెత్తని పాదాలు మీకు సొంతం.

- మర్రి ఆకులను తుంచగా వచ్చే పాలను పాదాల పగుళ్లపై రాయాలి. ప్రతిరోజూ ఈ పద్ధతి పాటించాలి. ఇలా చేస్తే పగుళ్లు మాయం.
- ప్రతి రోజూ పాదాలను గోరు వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. వేళ్ల సందుల్లో తడి పూర్తిగా ఆరేలా పొడి బట్టతో తుడువాలి.
- గ్లిజరిన్ లోషన్‌ను రాత్రి పడుకునే ముందు కాళ్లకు తప్పకుండా రాసుకోవాలి. లేదంటే కొబ్బరి నూనెని కూడా వేళ్లకు పూసుకోవచ్చు. క్రమం తప్పకుండా ఇలా చేస్తే పగుళ్ల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- పాదరక్షలు వాడకుండా తిరగడం వల్ల కూడా ఒక రకమైన ఫంగస్ కాళ్లకు అంటుకుంటుంది. ఈ ఫంగస్ పెరిగి పగుళ్లకు దారి తీస్తుంది. చెప్పులు లేకుండా బయట తిరగొద్దు.
- ఆవనూనె గానీ, నువ్వుల నూనె గానీ వేడిచేసి అందులో కొంచెం పసుపు, కరిగిన కొవ్వొత్తిని పొడి చేసి మెత్తగా తయారు చేసుకోవాలి. పడుకునే ముందు కాళ్లు శుభ్రంగా కడుక్కుని తడిలేకుండా తుడుచుకొని తయారు చేసిన మిశ్రమాన్ని పాదాలకు రాయాలి. ఇలా15 రోజులపాటు పాదాలకు పట్టిస్తే మంచి ఫలితం ఉంటుంది.

వంట చిట్కాలు



- ముదిరిపోయిన అనపగింజల్ని బియ్యంతో కలిపి నానేసి, రుబ్బి, దోసెల్లా పోసుకుంటే చాలా రుచిగా ఉంటాయి.
- గోధుమ పిండిలో మగ్గిన అరటిపళ్ళు, పెరుగు కలిపితే చపాతీలు మెత్తగా ఉంటాయి.
- పప్పులు గాని బియ్యంగాని తొందరగా నానాలంటే వేడినీళ్లలో వేస్తే మంచిది.


లింఫోమా అంటే..?

అడుగండి చెబుతా



నా వయస్సు 48 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా నేను ప్లీహం పెరుగడం, పొట్టలో నొప్పి, గజ్జల్లో వాపు, జ్వరం, చలి, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం లక్షణాలతో బాధ పడుతున్నాను. ఈ లక్షణాలతో డాక్టర్‌ని కలిస్తే ఆయన కొన్ని పరీక్షలు చేసి మీరు లింఫోమాతో బాధపడుతున్నారని నిర్ధారించారు. దయచేసి లింఫోమా అంటే ఏమిటీ? దానికి చికిత్సా మార్గాలు తెలుపగలరు? - కె. శేఖర్, బాచుపల్లి

లింఫోమా అనేది లింఫోసైట్‌లను (తెల్లరక్తకణాలు) ఉత్పత్తి చేసే, నిల్వచేసే, తీసుకెళ్లి కణజాతులైన సిస్టమ్‌లో కలిగే క్యాన్సర్‌లు. లింఫోమా ప్రాథమికంగా రెండు రకాలుగా ఉంటుంది. హెడ్జ్‌కిన్స్ లింఫోమా, నాన్ హెడ్జ్‌కిన్స్ లింఫోమా. నొప్పి లేకుండా మెడలో, చంకలో లేద గజ్జల్లో వాపు, ప్లీహం పెరుగడం, పొట్టనొప్పి, జ్వరం, చలి, శక్తి లేకపోవడం, బరువు తగ్గడం, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటివి మీకు ఉన్నాయని చెబుతున్నారు. కాబట్టి బాగా తినండి. ఒకేసారి ఎక్కువ భోజనం చేసే బదులుగా కొద్ది కొద్ది భోజనం ఎక్కువ సార్లు చేయండి. మీకు నోట్లో పుండ్లు ఉంటే మెత్తని ఆహారం తినండి. మసాలా ఆహారాలు తినకండి. బత్తాయి రసం తాగండి. ద్రవపదార్థాలు పుష్కలంగా తీసుకోండి. వ్యాయమాన్ని మీ డాక్టర్ ఓకే అంటే చేయండి. తగినంత విశ్రాంతి తీసుకోండి, నిద్రపోండి. మళ్లీ కలుగుతుందేమోననే భయం ప్రధాన ఆందోళన. ఒకవేళ కుంగుబాటు లేదా ఆత్రుత ఎక్కువ కాలం ఉంటే మీ డాక్టర్‌ను సంప్రదించండి. లింఫోమా చికిత్స తర్వాత.. మీ లిపిడ్‌లను, థైరాయిడ్‌ని, కాలేయం, మూత్రపిండాలను క్రమ పద్ధతిలో చెక్ చేయించుకోవడం ముఖ్యం. క్లినికల్ రొమ్ము పరీక్ష, ఎముకల సాంద్రత స్కాన్, పాప్ పరీక్షలు, కోలొరెక్టల్ స్క్రీనింగ్‌లు, ప్రోస్టేట్ పరీక్షలు కూడా చేయించాలి. రక్త పరీక్ష, బయాప్సీ, ఎముక మూలగ పరీక్ష, సెరెబ్రో స్పైనల్ ఫ్లూయిడ్, ఎక్స్‌రే, టొమోగ్రఫీ, ఎంఆర్ఐ, పాజిట్రాన్ ఎమిషన్ అనే పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. క్షుణ్ణంగా వైద్య పరిశీలన తర్వాత మీ శరీరంలో లింఫోమా వ్యాప్తి ఏ మేరకు ఉందో మీ ఫిజిషియన్‌కి తెలుస్తుంది. మీకు ఏదోరకమైన లింఫోమా ఉంది, లింఫోమా దశ అంటే ఏ ప్రాంతాలు దెబ్బతిన్నాయి. మీ సాధారణ ఆరోగ్యం, అంటే మీరు ఇప్పుడు క్రియాశీల చికిత్స చేయించుకోవాల్సిన పని లేదని అర్థం. అయితే మీ క్యాన్సర్ పెరుగుతుందని పరీక్షల్లో నిర్ధారణ అయితే చికిత్సలు పొందాల్సి ఉంటుంది.



డాక్టర్ అనిల్ అరబండి
హెమటో ఆంకాలజిస్ట్,
కేర్ హాస్పిటల్, హైటెక్ సిటీ, హైదరాబాద్

సరికొత్తగా యోగా

రోజువారీ పనులను మామూలుగా చేసుకుంటూపోతే వింత ఏముంది. అవే పనులను కాస్త భిన్నంగా చేస్తే మాత్రం వింత అనిపిస్తుంది. వింతేకాదు ఆసక్తి కూడా కలుగుతుంది. అందుకోసమే అక్కడ సరికొత్త పద్ధతిలో విద్యార్థులకు యోగా నేర్పిస్తున్నారు.



ఏదైనా రొటీన్‌కి భిన్నంగా ఉంటేనే అందరూ ఆసక్తి కనబరుస్తుంటారు. ఇక తప్పనిసరిగా అదే పని చేయించాల్సి వస్తే మరోవిధంగా ప్రయత్నించాలి. చైనాలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు యోగా నేర్పించేందుకు వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు శిక్షకులు. ఒక్క యోగానే కాదండోయ్ బాస్కెట్ బాల్‌ను కూడా మేళవించి ఒకేసారి ప్రయత్నిస్తూ.. అటు ఆరోగ్యాన్ని, ఇటు ఆహ్లాదాన్ని అందిస్తున్నారు. బాల, బాలికలకూ యోగా-బాస్కెట్ బాల్‌పై తర్ఫీదు ఇస్తూ అందరినీ ఆకట్టుకునేలా చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆడపిల్లలు కొద్దిసేపు యోగా చేస్తారు. అదే సమయంలో మగపిల్లలు బాస్కెట్ బాల్ ఆడుతుంటారు. అలా కొద్దిసేపు వీళ్లు, కొద్దిసేపు వాళ్లు మార్చుకుంటూ యోగా-బాస్కెట్ బాల్‌ను ప్రయత్నిస్తుంటారు. మామూలుగా యోగా నేర్చుకోమంటే పిల్లలు ఆసక్తి చూపకపోవడంతో ఇలా చేస్తున్నారు. రెండింటినీ ఒకేసారి నేర్పిస్తూ వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు శిక్షకులు. ఇలా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి పిల్లలు మరింత చలాకీగా ఉంటారని అంటున్నారు. అందుకే అంటారు కొత్త ఒక వింత పాత ఒక రోత అని.

ట్వీట్

సుస్మితా సేన్
@thesushmitasen





సుస్మితా సేన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
57,05,360

ఇతరులు మిమ్మల్ని అర్థం చేసుకోవడానికే కమ్యునికేషన్ అనేది లేదు. ఎల్లప్పుడూ మిమ్మల్ని మీరు కూడా అర్థం చేసుకోవడమన్నది చాలా అవసరం. కొన్నిసార్లు నిశ్శబ్దం అనేది మనలోని కమ్యూనికేషన్‌ని పెంచుతుందని నమ్ముతాను. దాన్ని మీరు కూడా ఎంచుకోండి. మీ ఆలోచనలను ఎప్పటికప్పుడు మీ మనసుతో కూడా పంచుకుంటేనే సంతోషంగా ఉంటారు.

జుట్టుతో గిన్నిస్ రికార్డ్

జుట్టు సరిగా పెరుగక నేటి యువతులు అనేక మార్గాలు, సంరక్షణ చర్యలు చేపట్టాల్సి వస్తున్నది. జుట్టు రాలే సమస్యతో చాలామంది పలు రకాల చికిత్సలు సైతం తీసుకుంటున్నారు. కానీ ఎటువంటి మందులు వాడకుండానే చిన్న వయసులో అత్యంత పొడవైన జుట్టుతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సృష్టించింది ఓ యువతి.



గుజరాత్‌కు చెందిన నిలాన్షి పటేల్ 16 యేండ్లకే పొడవైన జుట్టుతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. 6 ఏండ్ల వయసులో మాత్రమే ఓసారి తన జుట్టును కత్తిరించుకున్నది. ఆ తర్వాత వరుసగా పదేండ్లు పాటు జుట్టు పెంచి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నది. ప్రస్తుతం 16వ యేట అడుగుపెట్టిన నిలాన్షి 170.5 సె.మి (5అడుగుల 7అంగుళాల) పొడవైన జుట్టు కలిగిన టీనేజర్‌గా గుర్తింపు పొందింది. పొడవుగా జుట్టును పెంచడం వల్ల చాలా సమస్యలు వస్తాయని తమ చుట్టు పక్కల వాళ్లు నిలాన్షికి సలహా ఇచ్చేవారు. కానీ తన హెయిర్ వల్ల స్కూల్లో ఆటలు ఆడే సమయంలోగానీ ఇతర సందర్భంల్లో గానీ ఎటువంటి సమస్య తలెత్తలేదని చెబుతున్నది. నిలాన్షి తల్లి తన జుట్టు సంరక్షణలో ప్రధాన పాత్ర పోషించిందని, రికార్డు సృష్టించడం వెనుక తల్లి సహకారం చాలా ఉందని అంటున్నది. ఏదైనా శుభకార్యానికి వెళ్లేటప్పుడు తనకు నచ్చిన మాదిరిగా జడ వేసుకుంటుందట. వారానికి ఓ సారి తలస్నానం చేయడంతోపాటు జుట్టును ఆరబెట్టుకోవడానికి అరగంట, దువ్వుకోవడానికి గంట సమయాన్ని వెచ్చిస్తానని నిలాన్షి చెబుతున్నది.

అవివాహితులకు సెలవులు!

కొన్ని సంస్థలు తమ ఉద్యోగులను మరింత సమయం పనిచేయించుకోవాలని చూస్తుంటాయి. కానీ చైనాలో మాత్రం అందుకు భిన్నం. ఎందుకంటే పెండ్లి కాకుండా ఉన్న మహిళలకు ప్రత్యేకంగా సెలవులు ఇస్తున్నాయి. అంతేకాదు త్వరగా పెండ్లి చేసుకొని.. పిల్లలను కనమంటూ ప్రోత్సహిస్తున్నాయి కూడా.



పలు సంస్థలు తమ సంస్థలో పనిచేస్తున మహిళా ఉద్యోగినులకు పెండ్లి, ప్రసూతి సెలవులు ఇవ్వడమే గగనం. ఇక పెండ్లి కాకపోతే వారితో ఎక్కువ పని కూడా చేయించుకుంటాయి. కానీ చైనాలోని కొన్ని కంపెనీలు తమ తీరు మార్చుకున్నాయి. పెండ్లి కాని యువతులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నాయి. పెండ్లి కాని యువతులు తన జోడీని వెతుక్కునేందుకు వేతనంతో కూడిన ప్రత్యేక సెలవులు మంజూరు చేస్తున్నాయి. వీటినే అక్కడ 'డేటింగ్ లీవ్స్' అంటున్నారు. ఎందుకంటే చైనాలో 2013 నుంచి పెండ్లిళ్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. 30 యేండ్లు దాటిన యువతులకు వివాహం కావడం చాలా కష్టంగా మారింది. వివాహం ఆలస్యం అవ్వడం వల్ల చైనాలో సంతానోత్పత్తి రేటు మరింతగా పడిపోయింది. 2013 నుంచి ఇప్పటి వరకు రెండువందల మిలియన్ల మంది చైనాలో పెండ్లి కాకుండా ఒంటరిగా మిగిలిపోయారు. అందుకే ఈ డేటింగ్ లీవ్స్. పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు కూడా తమ భాగస్వామితో గడిపేందుకు నెలకు అదనంగా రెండు రోజులు సెలవులు ఇస్తున్నాయి.

72 యేండ్ల చాంపియన్!

అద్భుతాలు ఎవరు చేసినా విశేషమే. అయితే యువకులు చేస్తే కాస్త గొప్ప అనిపించవచ్చు. అదే వృద్ధులు చేస్తే గొప్పే కాదు మరింత విశేషం కూడా. ఏడుపదుల వయసులో హరే రామహరేకృష్ణ అనుకుంటూ కూర్చోలేదు ఆయన. వయసు మళ్లినా ఏదైనా సాధించి నిరూపించాలనే తపనే ఆయన్ను గెలిపిస్తున్నది. ఏమాత్రం అలుపు, సొలుపు లేకుండా పలు క్రీడల్లో రాణిస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నాడు 72యేండ్ల అభిమన్య. లేటు వయసులోనూ తన సత్తా చూపిస్తూ 'వాట్ ఏ వండర్' అనిపిస్తున్నాడు. ఈత, బాస్కెట్‌బాల్ క్రీడల్లో చాంపియన్‌గా రాణిస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాడు.



సాధించాలనే పట్టుదల, తపన ఉంటే ఎంతటి విజయాన్నైనా అవలీలగా సాధించవచ్చు. అందుకు లింగ భేదం, వయోభేదం కూడా అడ్డు రాదు. ఏదైనా సాధించాలంటే యువకునిగా ఉన్నప్పుడే అనుకుంటారు కొంతమంది. వయసు మళ్లిన తర్వాత ఏం చేయాలన్నా కష్టం అంటుంటారు మరికొందరు. ఇలా నిరాశ, నిస్పృహలతో డీలా పడిపోతుంటారు. అలాంటి వారికి, నేటితరం యువతకు సైతం చాలెంజ్ విసురుతున్నాడు 72యేండ్ల అభిమన్య. ఏడు పదుల వయసులో ఘన విజయాలు సాధిస్తున్నాడు.

ఉద్యోగం చేస్తూనే..

హైదరాబాద్ నగరంలోని ముషీరాబాద్‌కు చెందిన అభిమన్య దక్షిణమధ్య రైల్వేలో ఉద్యోగం చేశాడు. లాలాగూడలోని రైల్వే వర్క్‌షాప్ మెకానికల్ విభాగంలో 1964నుంచి విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యాడు. అభిమన్యకు చిన్నప్పటి నుంచీ ఆటలంటే చాలా ఇష్టం. ఎప్పుడు వీలు దొరికినా ఏదో ఒక ఆట ఆడుతూనే ఉంటాడు. శరీరానికి ఏ మాత్రం విశ్రాంతి ఇచ్చేవాడు కాదు. ఇదే పద్ధతిని నేటి వరకూ కొనసాగిస్తున్నాడు అభిమన్య. ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు బాస్కెట్ బాల్, ఈత పోటీల్లో పాల్గొనేవాడు. ఇలా జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించాడు కూడా.

ప్రతి ఈవెంట్‌లోనూ పతకమే..

ఓ వైపు వృత్తిలో రాణిస్తూనే.....తాను చేరాలనుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తూ తానేంటో ప్రపంచానికి తెలిసేలా చేశాడు. తన పట్టుదలకు కుటుంబసభ్యుల ప్రోత్సాహం లభించడంతో వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా ఏడు పదుల వయసులోనూ వెనుకాడడం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈత పోటీల్లో విశేష ప్రతిభ చూపుతూ వందల పతకాలను సాధించాడు. రెండేళ్ల క్రితం కర్ణాటకలో జరిగిన స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 14వ నేషనల్ మాస్టర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో 70-74 ఏళ్ల వయస్సు విభాగంలో పాల్గొని బ్రీస్ట్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచి రెండు రజత పతకాల్ని సాధించాడు. కర్ణాటక పోలీసు కమిషనర్ చేతుల మీదుగా రజత పతకాలు అందుకొన్నాడు. 2017లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో నాలుగు విభాగాల్లో పాల్గొని మూడు బంగారు, ఒక రజత పతకాన్ని సాధించాడు. రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూనే సిమ్మింగ్, బాస్కెట్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించాడు.



కొత్తవారిని ప్రోత్సహించాలి..

కొత్త వారికి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహిస్తే మరిన్ని అవార్డులు తెచ్చేందుకు అవకాశం ఉంటుంది. అందుకు నేను కూడా నా వంతు పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్నా. బాస్కెట్ బాల్, స్విమ్మింగ్ పోటీల్లో యువ చాంపియన్లను తయారు చేస్తున్నా. అన్ని క్రీడల్లోనూ యువత చురుగ్గా పాల్గొనాలి. దేశానికి పతకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇందుకు ఆయా క్రీడల సంఘాలు కొత్త వారిని ప్రోత్సహించాలి.

- అభిమన్య, వెటరన్ క్రీడాకారుడు

ఇవీ అభిమన్య విజయాలు..

- 2014 నుంచి 2017 వరకు సికింద్రాబాద్‌లో జరిగిన తెలంగాణ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వరుసగా మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాడు.
- 2017లో సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఫ్రీస్టైల్, బ్రీస్ట్ స్ట్రోక్ పోటీల్లో మూడు బంగారు, రెండు రజత పతకాలు సొంతం చేసుకున్నాడు.
- స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 14వ నేషనల్ మాస్టర్స్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 70-74 విభాగంలో 100 మీటర్లు, 50 మీటర్ల దూరం పోటీలలో రెండవ స్థానంలో నిలిచాడు.
- ఇటీవల అమెరికాలో జరిగిన సౌత్ కరోలినా స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచాడు.
- తెలంగాణ రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గత 30 సంవత్సరాలుగా రాణిస్తున్నాడు.

కోచ్‌గా కొత్త అవతారం..

అభిమన్య ఉద్యోగ విరమణ అనంతరం తనలా మరి కొంతమందిని తయారు చేయాలనుకున్నాడు. ఇందుకు ఓ ప్రైవేటు పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోచ్‌గా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. అభిమన్య దగ్గర శిక్షణ పొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో విజయ దుందుభి మోగిస్తున్నాడు. బాస్కెట్ బాల్ కోచ్‌గానే కాకుండా స్విమ్మింగ్‌లో అవసరమైన మెళకువలు నేర్పిస్తున్నాడు. తెలంగాణ వెటరన్ స్విమ్మింగ్ అసోసియేషన్ తరఫున పలు పోటీల్లో పాల్గొని అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నాడు.

... **కె.శ్రీనివాస్**
ముషీరాబాద్

కామన్‌మ్యాన్ వాయిస్

నచ్చని నలభైలో నలుగడం కన్నా.. ఇష్టపడే ఇరవైలో ఇమడడం మిన్న!
– Ram Kishanji

పొలిటికల్ క్రైం స్టోరీ..
శిఖా చౌదరి.. రాకేష్ రెడ్డి.. మహాకూటమి!
– Murali Buddha

రా బడికి అన్న చిన్నప్పటి మాస్టారు వాక్యాలు.. 'రాబడికి' అని వినిపించాయి కాబోలు లంచగొండి ఉద్యోగికి..
– Juned Ahamad

సంపద కన్నా పేదరికమే ఎక్కువ నేర్పుతుంది.. ప్రశంసల కన్నా ఎదురుదెబ్బలే ఎక్కువ పాఠాలు నేర్పుతాయి.. నీ ప్రస్తుత స్థితి ముఖ్యం కాదు.. నీవు చేరబోయే లక్ష్యమే ముఖ్యం..
– Nandu Goud Gurram

వైరల్ వీడియో



ఒకే ఒక్కడు కాన్సెప్ట్‌లో ఒక్కరోజు సీఎమ్ అయితే ఎన్ని మార్పులు చేయొచ్చో చూపించారు. అదే కాన్సెప్ట్‌ని కాస్త ఫన్నీగా తీసుకొని వైవాహర్ష, షణ్ముఖ్ వన్ డే సీఈవో పేరుతో ఒక వీడియో చేశారు. దానికి సంబంధించిన ట్రైలర్ ఇప్పుడు యూట్యూబ్ ట్రెండింగ్‌లో సందడి చేస్తున్నది.

One Day CEO Trailer | Shanmukh Jaswanth | Viva Harsha
Total views : 1,41,612+
Published on 5 Feb 2019

సుడోకు

డైలీ సుడోకు 58 సమాధానం

6	7	2	4	1	5	9	8	3
8	9	3	6	7	2	5	1	4
4	1	5	3	8	9	2	6	7
9	2	8	1	3	4	6	7	5
1	3	6	5	9	7	4	2	8
5	4	7	8	2	6	3	9	1
2	6	4	7	5	8	1	3	9
3	8	9	2	4	1	7	5	6
7	5	1	9	6	3	8	4	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -59

	8						9	7
			3			1		
3		9		1			6	5
				9			1	
	4	5	2			8		9
6					5		3	4
			4					
7								
	2	3			1			

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

సీటెట్ జూలై 2019

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) కెవీఎస్, ఎన్‌వీఎస్, సెంట్రల్ టిబెటన్ పాఠశాలల్లో టీజీటీ, పీఆర్‌టీ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (జూలై,2019)కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

CTET/TET
CENTRAL TEACHER ELIBILIGITY TEST

- ఈ పరీక్షలో అర్హత సాధిస్తే కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఏనిమిదో తరగతి పాఠ్యాంశాలను బోధించడానికి టీజీటీ, పీఆర్‌టీ ఉద్యోగాల్లో చేరవచ్చు.
- **పరీక్ష పేరు:** సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (జూలై, 2019)
- పేపర్ 1-ప్రైమరీ స్టేజ్ (1 నుంచి 5 తరగతులకు బోధించడానికి)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో డిగ్రీతో పాటు బీఈడీ లేదా ఇంటర్‌తోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/ డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్) లో డిప్లొమా లేదా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ లేదా డిగ్రీతోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా ఉత్తీర్ణత.
- పేపర్ 2-ఎలిమెంటరీ స్టేజ్ (6 నుంచి 8 తరగతులకు బోధించడానికి).
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో డిగ్రీతో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా/బీఈడీ లేదా 50 శాతం మార్కులతో ఇంటర్‌తోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ లేదా నాలుగేండ్ల బీఏ/బీఎస్సీ ఎడ్యుకేషన్, బీఏఈడీ, బీఎస్‌ఈడీ, డిగ్రీతో పాటు బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- పేపర్-I-ప్రైమరీ స్టేజ్ (పీఆర్‌టీ): 6-11 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు (బోధించడానికి)
- **రాతపరీక్ష సిలబస్:** చైల్డ్ డెవలప్‌మెంట్& పెడగాగీ, లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2, మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ప్రతి విభాగంలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 30 ప్రశ్నలు ఇస్తారు.
- **పేపర్-II:** ఎలిమెంటరీ స్టేజ్ (టీజీటీ): 11-14 ఏండ్ల పిల్లలకు బోధించడానికి.
- **రాతపరీక్ష సిలబస్:** చైల్డ్ డెవలప్‌మెంట్ &పెడగాగీ, లాంగ్వేజ్-1 , లాంగ్వేజ్-2 అంశాల నుంచి ప్రతి విభాగంలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 30 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ లేదా సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్‌లో 60 ప్రశ్నలు ఇస్తారు.
- **గమనిక:** పేపర్-I-150 మార్కులు, పేపర్-II-150 మార్కులు. రాతపరీక్షకు కేటాయించిన సమయం: 180 నిమిషాలు.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులు-పేపర్-I లేదా పేపర్-II రూ.700/- (రెండు పేపర్లు-రూ.1200/-).
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు-పేపర్-I లేదా పేపర్-II రూ.350/- (రెండు పేపర్లు-రూ.600/-)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** మార్చి 5
- **అప్లికేషన్ ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 8 (మధ్యాహ్నం 3.30 గం|| వరకు)
- **పరీక్షతేదీ:** జూలై 7 (పేపర్-I -ఉదయం 9.30 నుంచి 12 వరకు,
- పేపర్-II -మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు)
- **వెబ్‌సైట్:** www.ctet.nic.in

పీజీ డిప్లొమా కోర్సులు

ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఎన్ఐటీఐఈ)లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- **కోర్సులు:** పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, పీజీడీ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ మేనేజ్‌మెంట్, పీజీడీ ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- ఈ ప్రవేశాలు 2019-21 విద్యాసంవత్సరానికి.
- అర్హతలు, వయస్సు, ఫీజు, ఎంపిక తదితర వివరాల కోసం కింది వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** https://www.nitie.edu

ఎస్ఆర్ఎఫ్

హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్ ఎస్ఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు:** ఎస్ఆర్ఎఫ్ (అగ్రి ఎకనామిక్స్/ఏబీఎం)
- **అర్హతలు:** డాక్టోరల్ డిగ్రీతో పాటు పీజీలో అగ్రి ఎకనామిక్స్/ఎంబీఏలో ఫుడ్ ప్రాసెసింగ్/అగ్రికల్చరల్ లేదా పీజీ డిప్లొమా ఇన్ ఏబీఎంలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **జీతభత్యాలు:** నెలకు రూ. 25,000+30శాతం హెచ్ఆర్ఏ
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 13
- **వెబ్‌సైట్:** http://millets.res.in

యంగ్ ప్రొఫెషనల్స్

హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రిసెర్చ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్స్-II
- **జీతం:** నెలకు రూ.25,000+ హెచ్ఆర్ఏ
- **వయస్సు:** పురుషులకు 30 ఏండ్లు, మహిళలకు 35 ఏండ్లు మించరాదు.
- **అర్హత:** వెటర్నరీ సైన్స్‌లో పీజీ లేదా డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** www.pdonpoultry.org

ఫ్యాకల్టీలు

కాంచీపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టులు:** ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్-I,II)
- **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్,మెకానికల్ ఇంజినీరింగ్, డిజైన్.
- **అర్హతలు:** అన్ని పోస్టులకు సంబంధిత అంశంలో పీహెచ్‌డీ తప్పనిసరి. వీటితోపాటు ఆయా పోస్టులను బట్టి అనుభవం, సంబంధిత అంశంలో స్పెషలైజేషన్ ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** http://www.iiitdm.ac.in

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 7 ఫిబ్రవరి 2019

raithubadi@ntnews.com

రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం 20-40 రోజుల వయసున్న కలిగినవి ఎక్కువగా ఉన్నాయి. రైతులు ప్రధానంగా దొడ్డు గింజ రకాలైన బతుకమ్మ, కూనారం సన్నాలు, యం.టీయు 1010 అలాగే సన్న గింజ రకం అయిన తెలంగాణ సోనా యాసంగి కాలంలో సాగు చేస్తున్నారు.

వరిలో పురుగులు, తెగుళ్ల నివారణ

ప్రస్తుతం రైతులు, వ్యవసాయ అధికారుల నుంచి అందుతున్న సమాచారం మేరకు వరిలో కాండంతొలిచే పురుగు, ఆకుముడత పురుగు, అగ్గితెగులు, కొన్ని ప్రాంతాల్లో సల్ఫైడ్ ధాతు విష ప్రభావం వంటి సమస్యలను గుర్తించాం. కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలి. వరి పంటను ఎప్పటికప్పుడు గమనిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపడితే నష్టాలు తగ్గించుకోవచ్చు.

కాండం తొలిచే పురుగు, ఆకుముడత

- యాసంగిలో పొట్ట దశలో ఆశించి అధిక నష్టాన్ని కలిగించే ప్రధానమైన పురుగు.
- రెక్కల పురుగులు ఆకుల కొనలపై కనబడుతాయి. దీని గుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు ఆశించడం వల్ల ఈనిన తర్వాత వెన్నంతా తాలుపోయి తెల్లకంకులు ఏర్పడటం వల్ల 3–4 బస్తాల దిగుబడి నష్టపోయే అవకాశం ఉన్నది.
- పిలకల నుంచి దబ్బు చేసే దశలో ఉన వరి పైర్లలో తప్పనిసరిగా నాటిన 30 రోజుల లోపు ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ మైక్రోక్లోరైడ్ 4జి 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు నీరు పలుచగా ఉంచి పొలం అంతటా సమానంగా చల్లాలి.



- అంకురం నుంచి చిరుపొట్ట దశలో కాండం తొలిచే పురుగు ఆశించి తెల్ల కంకులు ఏర్పడటం వల్ల ఎక్కువ నష్టం కలుగుతుంది. ప్రతి 40 మొక్కలకు ఒక రెక్కల పురుగు లేదా గుడ్ల సముదాయం గమనిస్తే, క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి 0.3మి.లీ. ఒక లీటరు నీటికి (ఎకరాకు 60 మి.లీ) లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2 గ్రా. ఒక లీటరు నీటికి (ఎకరాకు 400 గ్రా.) పిచికారీ చేయాలి.
- ముఖ్యంగా నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఆకుముడత ఉధృతి గమనించాం. కాబట్టి రైతులు కాండం తొలిచే పురుగుకు సూచించిన మందులతో ఆకుముడత పురుగును కూడా అదుపు చేయవచ్చు.

అగ్గితెగులు

- ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇంకా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవటం, మంచుతో కూడిన వాతావరణం ఉండటం వల్ల అగ్గితెగులు గమనించడమైనది.
- ముఖ్యంగా యాసంగి వరిని ఆశించే ప్రధానమైన తెగులు. ఈ తెగులు ఉధృతి ఆకు మచ్చ దశలోనే నివారించకపోతే, ఆ తర్వాత దశలలో మెడవిరుపు ఆశించి అధిక నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ తెగులు నివారణకు ఐసోప్రోథమోలిన్ 1.5మి.లీ ఒక లీటరు నీటికి (300 మి.లీ ఎకరాకు)లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ (500 మి.లీ/ఎకరాకు)ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కొన్ని ప్రాంతాల్లో జింకు లోపం వల్ల ఆకుల మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడటం వల్ల మొక్క ఎదుగుదల లోపిస్తుంది. జింక్ లోప నివారణ జింక్ సల్ఫేట్ 2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి 7–10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- సల్ఫేట్ ధాతు విష ప్రభావం వల్ల మొక్కల వేర్లు నల్లబడుతాయి. అలాంటి లక్షణాలను గమనిస్తే పొలంలో మురుగు నీరు తీసి ఆరబెట్టాలి.

–డాక్టర్ టి. ప్రదీప్,8008333783
ప్రధాన శాస్త్రవేత్త, (వరి) వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్

ఇంటి పంట

ఆహారానికి, ఆరోగ్యానికి వాగ్దానం

ఇప్పుడు అసలే రోగంలేని మనిషి మన చుట్టూ ఉన్నాడం టే అది చాలా ఆశ్చర్యకరమైన విషయం. కారణం మనం తినే ఆహారం,అనుసరిస్తున్న జీవనశైలి. అసలు మనమేం తింటున్నాం,ఏం కొంటున్నాం అనేది ఆలోచించే తీరిక కూడా ఎవరికి లేదు. ప్రతిఒక్కరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యతో సతమతమవుతున్నా, పూటకు గుప్పెడు మందులు వేసుకుంటున్నా,ప్రత్యామ్నాయాల వైపు అంత తొందరగా ఆలోచించడం లేదు.

మనం తినే క్యాబేజి మన ప్లేట్లోకి వచ్చేసరికి 20 సార్లు రసాయన పురుగుమందులు చల్లుతారు. వంకాయపై 20 నుంచి 30 సార్లు, టమాటా, బెండపై 8నుంచి 20 సార్లు, క్యారెట్‌పై 2 నుంచి 4సార్లు, బీన్స్, బీరలపై 4నుంచి 8సార్లు, దోస, ఆకుకూరల్లో 2నుంచి 6సార్లు,మిరపపై 15నుంచి 20సార్లు విషపూరితమైన పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇంతటి ప్రమాదకరమైన ఆహారాన్ని, మనం తీసుకోవడంతో పాటు మన పిల్లలకూ తినిపిస్తున్నాం. ఈ రసాయన ఎరువులు, పురుగు మందులతో పండించిన కూరగాయలు,పండ్లు, ఆహారధాన్యాలు తీసుకోవడం వల్ల కాన్సర్, బి.పి, డయాబెటిస్, కీళ్లనొప్పులు, స్థూలకాయం, గుండె జబ్బులు, ముఖ్యంగా చిన్నపిల్లలు ఆడవాళ్లలో రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీని ప్రభావంతో చిన్నాపెద్దా తేడా లేకుండా పల్లె పట్టణం అంతరంలేకుండా అంతులేని రోగాలు మానవ జాతిని కబలిస్తున్నాయి. పల్లెల్లో ఇంకా పెరటి తోటలు కనిపిస్తున్నాయి. కానీ పట్టణాల్లో మాత్రం రసాయన ఎరువుల, పురుగు మందుల కూరగాయలు, పండ్లే ప్రజలకు దిక్కయ్యాయి. ఈ విష రసాయన అవశేషాలు జీన్స్‌లో నిక్షిప్తమై, భావితరాల జీవితం ప్రమాదంలో పడిపోతున్నదన్న విషయం మనం పరిగణనలోకి తీసుకోవడం లేదు.

మరోవైపు పరిశ్రమలు,నివాసిత ప్రాంతాల నుంచి వెలువడే వ్యర్థ,కలుషిత జలాలతో పంటలను సాగుచేయడం కూడా పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. మనం కొనే కూరగాయలను ఎంత ఉడికించి తిన్నా, వాటిలో ప్రమాదకరమైన బెంజీన్, సీసం, పాదరసం వంటి విష పదార్థాలు అలాగే ఉంటున్నాయి. ఈ ప్రమాదం కేవలం కూరగాయలకే పరిమితం కాలేదు. మనం పండించే పండ్లు పండించే ప్రతి ధాన్యం కూడా ఈ విష రసాయన ఎరువులు, పురుగు మందుల బారిన పడుతున్నాయి.

రసాయనిక పురుగు మందుల అవశేషాలతో ఆహారం కలుషితమై ఆరోగ్యాన్ని హరిస్తున్న నేపథ్యంలో ఈ విషయాలపై అవగాహన కలిగినవాళ్లు పురుగు మందులు, ఎరువుల అవసరంలేని సహజ ఆహారోత్పత్తులవైపు నెమ్మదిగా మళ్లుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సహజ ఆహార ఉత్పత్తుల వినియోగంపై క్రమక్రమంగా చైతన్యం పెరుగుతున్నది. తమకున్న కొద్దిస్థలంలో తామే స్వయంగా పండించుకోవాలన్న భావన అంకురిస్తున్నది.

నిజానికి ఇంటిపంట అనేది రాకెట్‌సైన్స్ కాదు. ఇంటి వెనుక, పక్కన లేదా పైభాగంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ నాలుగు కుండీలో,చిన్న చిన్న మడులో ఏర్పాటు చేసుకుని చాలా సులువుగా ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చు. ముఖ్యంగా పట్టణాల్లో ఉన్న వాళ్లకు డాబాల మీద పండించుకునే అవకాశం ఎక్కువగా ఉన్నది. పల్లె మూలాలు ఉన్నవాళ్లకు పట్టణంలో కూరగాయలు పండించుకోవడంలో పెద్ద ఇబ్బందేమీ ఉండదు. తమ చేతి వంట తమ ఇంటి మీద పండించుకోవాలన్న ఆలోచనే ఇక్కడ ప్రధానం.

ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే సుమారు 22 లక్షల ఇళ్లు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి పైకప్పులు, బాల్కనీలు, పెరట్లో సుమారు 15వేల ఎకరాల సాగు స్థలం ఉన్నట్లు ఒక అంచనా. ఇపుడు సాగవుతున్న స్థలాన్ని లెక్కిస్తే అది కనీసం 100 ఎకరాలు లేకపోవడం గమనార్హం. చిన్న చిన్న పట్టణాల్లో కూడా దీనిపై ఇప్పుడిపుడే అవగాహన పెరుగుతున్నది. నిజంగా,రూఫ్‌గార్డెన్స్ విషయంలో మన కంటే పాశ్చాత్య దేశాలు ముందున్నాయి. జర్మనీ దేశంలో దాదాపు పద్నాలుగు శాతం మిద్దెలు గ్రీన్ టాప్ చేయబడినాయి. అక్కడ ఏటా ఈ రంగంలో పది శాతం పైగా అభివృద్ధి సాధిస్తున్నది. కెనడా,ఫ్రాన్స్,స్విట్జర్లాండ్ దేశాలు రూఫ్ గార్డెన్స్‌పై చట్టాలు కూడా చేశాయి. మన దగ్గర ఒక ఉద్యమస్థాయిలో రూఫ్‌గార్డెన్స్ పెంచాల్సిన అవసరం ఉన్నది. కేవలం ఒక చిన్న తోటను పెంచుకోగలిగితే మనం అనేకరకాల సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

- మనకున్న కొద్ది స్థలంలోనే మనకు కావలసిన కూరగాయలు,పండ్లు పండించుకోవడం.
- పిల్లలకు ఆర్యోకరమైన, రుచికరమైన పోషక విలువలు కలిగిన మంచి ఆహారం అందించడం.
- శారీరక వ్యాయామం, మానసిక ఆనందం.
- పిల్లలకు ప్రకృతితో అనుబంధం.
- కూరగాయలు, పండ్లు కొనాల్సిన అవసరం లేకపోవ డం.
- రూఫ్ మీద చిన్న గార్డెన్ ఉంటే,ఎండాకాలంలో కావలసినంత చల్లదనాన్ని అందిస్తుంది.

మనకు ప్రకృతి సహజంగా అందిన జీవితం ప్రకృతిగా దగ్గరగా, పూర్తి ప్రకృతి సహజంగా ఉండాలే తప్ప, కృత్రిమ జీవన విధానం వల్ల అది తన సహజత్వాన్ని కోల్పోకూడదు. యాంత్రిక జీవితంలో మనం కూడా ఇంట్లో ఉన్న ఒక వస్తువులా మిగిలిపోకూడదు. మన చేత్తో విత్తిన విత్తనం మన కళ్లముందే ఒక్క మొక్కగా ఎదిగి,పండ్లు ఫలాలతో కళకళలాడుతున్నపుడు మనలోపలి పత్రహరితం తిరిగి మనల్ని ప్రాకృతిక మానవుడిగా నిలుపుతుంది.



ఇందుకు మనం చేయాల్సింది, మట్టిలో ఒక్క విత్తనం వేసి ప్రకృతితో తిరిగి మన అనుబంధాన్ని పునరుద్ధరించుకోవడం. మట్టితో తెగిన పేగుబంధాన్ని ఒకసారి ఆత్మీయంగా తడుముకోవడం. ముఖ్యంగా ఇంట్లో ఉన్న మహిళలు, చిన్నపిల్లలు, ఖాళీగా ఉన్నవారు ఈ మంచి ప్రయత్నాన్ని ఆరంభించలిగితే, ఆహారపరంగా, ఆరోగ్యపరంగా ఒక మంచి సంస్కృతిని మన కుటుంబంలో పాదుకొల్పినవారవుతారు. ఇంటిపై నిర్మించుకునే ఈ అనుబంధాల ఆకుపచ్చని పొదరిల్లు కేవలం ఆరోగ్యాన్ని మెరుగుపరుచడమే కాకుండా, నెమ్మదిగా ఒక కుటుంబాన్ని రోజూ కాసేపైనా కలుపలిగే ఒక అందమైన ప్రయత్నం అవుతుంది.

–కె.క్రాంతికుమార్‌రెడ్డి
నేచర్స్ వాయిస్

ప్రస్తుత పంటల్లో

సమయానుకూలంగా ఎరువులు

యాసంగి పంటగా రైతులు తమకు ఉన్న వసతులను బట్టి వివిధ రకాల పంటలను సాగు చేసుకున్నారు. ఏ పంటను సాగు చేసుకున్నప్పటికీ సమయానుకూలంగా సరైన యాజమాన్య పద్ధతులను ఆచరించాలి. అప్పడే మంచి దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. అయితే వివిధ పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన పద్ధతులను గురించి గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త టి.యాదగిరిరెడ్డి తెలిపారు. పంటల సాగుకు సంబంధించి అదనపు సమాచారం కోసం 9440481279 నెంబర్‌ను సంప్రదించవచ్చు. వివిధ పంటలలో చేపట్టాల్సిన చర్యల గురించి ఆయన తెలిపిన వివరాలు..





టి.యాదగిరి రెడ్డి

మక్కజొన్న

ఆరుతడి పంటగా యాసంగిలో సాగు చేసిన మక్కజొన్న పైరు పంటకోత దశలో ఉన్నది. ఈ దశలో గింజల్లో తేమ శాతం 25–30 వరకు ఉంటుంది, కండెలను మొక్కల నుంచి వేరుచేసి గింజల్లో తేమ శాతం 15 వచ్చే వరకు 3–4 రోజులు ఎండలో బాగా ఆరబెట్టాలి.

- కరెంట్‌తో నడిచే నూర్పిడి యంత్రాన్ని ఉపయోగించి కండెల నుంచి గింజలను వేరుచేసి 12 శాతం తేమ వచ్చే వరకు ఎండలో ఆరబెట్టి శుద్ధి చేసి గోనె సంచుల్లోగానీ, పాలిథీన్ సంచుల్లో గానీ భద్రపరుచుకోవాలి.

వరి మాగాణుల్లో విత్తిన మక్కజొన్న:

- 25–30 రోజుల వయసు ఉంటుంది. ఈ తరుణంలో ఎకరాకు 50 కిలోల యూరియా వేయాలి. ఈ సమయంలో కాండం తొలిచేపురుగు ఆశిస్తే దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున మొక్క సుడుల్లో (మొవ్వలో) వేసుకోవాలి.
- మక్కజొన్నలో ఆశించే కత్తెర పురుగు నివారణకు మొక్క మొలిచిన 7–28 రోజుల వరకు తొలిదశలో ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటర్ నీటికి లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీలు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ఆశిస్తే పురుగు నివారణకు విషపు ఎరలు 10 కిలలో తవుడు + రెండు కిలోల బెల్లం + 10 గ్రాముల థయోడికార్బ్‌ను తయారీ చేసి ఒక ఎకరా పంటలో మొక్కల సుడుల్లో వేయాలి.



వేరుశనగ: చాలా ప్రాంతాల్లో నవంబర్ నెలలో విత్తారు. ప్రస్తుతం పైరు 60–70 రోజుల వయసులో ఉన్నది. ఈ దశలో టిక్కా ఆకుమచ్చ తెగులు తట్టుకోలేని రకాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. తుప్పు ఆశించి పంటను నష్టపరుస్తాయి. వీటి నివారణకు క్లోరోథలోనిల్ రెండు గ్రాములు లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పంటపై పిచికారీ చేయాలి.



పొద్దు తిరుగుడు: నీటి పారుదల కింద నవంబర్, డిసెంబర్ మాసంలో విత్తిన పొద్దు తిరుగుడు పంట 30–40 రోజుల వయసులో ఉన్నది. ఈదశలో పంటల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. రెండోదఫాగా సిఫారసు చేసిన యూరియా మోతాదు ఎకరాకు 13 కిలోలు (మొగ్గ తొడిగేదశ) వేసుకోవాలి.

మొదటి దశలో ఆశించే రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా డైమిథేయేట్ 2.0 మి.లీలు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



అపరాలు: వరి మాగాణుల్లో సాగు చేసిన మినుము, పెసర పంటల్లో తొలిదశలో తామర పురుగులు ఆశించడం వల్ల ఆకుముడుత, వైరస్ తెగులు వ్యాపిస్తుంది. దీని నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లీటర్ నీటికి లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. గాలిలో తేమ ఎక్కువగా ఉంటే బూడిద తెగులు ఆశించే ప్రమాదం ఉన్నది. ఈ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 200 మి.లీల హెక్సాకోనజోల్ లేదా 1 మి.లీ కెరాథేన్ లీటర్ నీటికి కలిపి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

-నట్టె కోటేశ్వర్‌రావు
9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

పత్తి సాగుచేసే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో చాలావరకు పత్తి తీత పూర్తైంది. మొదటి రెండుసార్లు ఏరిన పత్తిలో గులాబీరంగు పురుగు నష్టం పెద్దగా లేనప్పటికీ, రైతులు చివరిసారి ఏరిన పత్తిలో అంటే డిసెంబరు–జనవరి నెలలో తీసిన ప్రత్తిలో చాలాచోట్ల గులాబీరంగు పురుగు నష్టం కనిపించింది. పురుగు సోకిన పత్తి రంగు, నాణ్యతను కోల్పోవడమే కాకుండా, దూదిలోని గింజలను తినటం వల్ల పత్తి బరువు కూడా బాగా తగ్గుతుంది. ఆ విధంగా నష్టం ఎక్కువగా ఉంటుంది. ఈ గులాబీ రంగు పురుగు ఉధృతి లేదా నష్టం ప్రస్తుతం మిగిలివున్న పంట అవశేషాలు (పంట మోళ్లు, జిన్నింగు మిల్లులో పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చే పత్తి గింజలు, వ్యర్థాలు మొదలగునవి) నిల్వచేసిన పత్తి ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందకుండా కొన్ని ముఖ్యమైన నివారణ చర్యలు ప్రస్తుత దశలో తప్పనిసరిగా చేపట్టాలి. తద్వారా గులాబీ పురుగు ఉనికి బాగా తగ్గి, వచ్చే పంట ఆరోగ్యంగా వుండే అవకాశం ఎక్కువగా వుంటుంది. కాబట్టి ప్రస్తుతం పత్తి పంటలో కింది చర్యలు పత్తి సాగు చేసే అన్ని ప్రాంతాల్లో, పత్తిని జిన్నింగ్ చేసే అన్ని మిల్లులలో తప్పనిసరిగా చేపట్టాలి.

1. పత్తి పంట కాలాన్ని ఎట్టి పరిస్థితుల్లో 200 రోజులకు మించి పొడిగించరాదు. నీటి వసతి ఉన్న చోట కూడా జనవరి మొదటి పక్షం కల్లా పత్తి తీత పూర్తి చేసి అనుకూలతను బట్టి స్వల్పకాలిక ఆరుతడి పంటలకు వెళ్ళాలి. ముఖ్యంగా పెసర, బొబ్బెర, తెల్ల నువ్వులు మొదలగునవి అనుకూల పంటలు.
2. పత్తి తీత పూర్తయిన వెంటనే పత్తి మోళ్లను పశువులతో, గొర్రెలతో మేపి, మోళ్లు ఎండగానే త్వరగా ట్రాక్టర్ షెడ్డర్ లేదా రోటావేటర్ సహాయంతో భూమిలో కలియదున్నాలి. తద్వారా పత్తి మోళ్లలో మిగిలివున్న పురుగు కోశస్థ దశలు నిర్మూలించబడటమే కాకుండా, పత్తి కట్టె భూమిలో మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
3. పత్తి మోళ్లను ఏరూపంలోనైనా ఎక్కువ కాలం నిల్వ వుంచకుండా నిర్మూలించడం గులాబీరంగు పురుగు నివారణకు చాలా ముఖ్యం. పురుగు సోకిన పత్తిని ఎక్కువ కాలం నిల్వ చేయకుండా త్వరగా అమ్మివేయాలి. తద్వారా నష్టం తగ్గుతుంది.
4. పత్తి మోళ్లను భూమిలో కలియదున్నిన తర్వాత ఎండకాలంలో (ఏప్రిల్/మే) లోతుదుక్కులు చేసినట్లయితే ఇంకా మిగిలిన పురుగు అవశేషాలు కూడా నశిస్తాయి.



5. నీటి వసతి వున్నచోట నీరు నిండుగా పెట్టి ఎండాకాలం దుక్కులు చేసినట్లయితే భూమిలోపల వున్న పురుగు కోశస్థ దశలు సమగ్రంగా నిర్మూలించబడతాయి.
6. పత్తి పంటకు–పంటకు మధ్య 4 నుంచి 6 నెలల వరకు భూమిపై ఏ మాత్రం ప్రత్తి పంట అవశేషాలు లేకుండా చేయాలి. తద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతి వచ్చే పంటపై బాగా తగ్గుతుంది.
7. మరీ ముఖ్యంగా జిన్నింగు మిల్లులో పురుగు ఆశించిన పత్తిని జిన్నింగు చేయగా వచ్చిన గింజలను, ఇతర వ్యర్థాలను త్వరగా తొలిగించాలి.
8. జిన్నింగు మిల్లుల లోపల, బయట చుట్టుపక్కల పత్తి గింజలను, ఇతర వ్యర్థాలను కుప్పలుగా పోసి నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచాలి.
9. పత్తి జిన్నింగ్ సమయంలో జిన్నింగ్ తర్వాత, దూది, గింజలు మిల్లులో వున్నంత కాలం,గులాబీ రంగు పురుగు లింగాకర్షక బుట్టలను మిల్లు లోపల, బయట ఎకరా ఆవరణకు 20 చొప్పున పెట్టి, బుట్టలలో పడిన తల్లి పురుగులను ఎప్పటికప్పుడు వేరు చేసి ఒక గుంతలో వేసి కాల్చివేయాలి.
10. పంట పూర్తయిన వెంటనే పత్తి మోళ్ళను భూమిలో కలియదున్నటం, ఎండా కాలం లోతు దుక్కులు, పంటకు పంటకు మధ్య ఎడం ఎక్కువగా వుండటం, శుభ్రమైన జిన్నింగు మిల్లు ప్రాంతాలు పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతిని గణనీయంగా తగ్గించడానికి బాగా ఉపకరిస్తాయి.

–డాక్టర్ బి. రాంప్రసాద్, కీటక శాస్త్రవేత్త
–ఎ. సుదర్శనం, పత్తి ప్రధాన శాస్త్రవేత్త
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్

రైతుబడికి ఆహ్వానం

రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంట విధానాలకు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతు సోదరులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.



రచనలు పంపవలసిన చిరునామా
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
raithubadi@ntdaily.news, Fax-040-23291118

జై ప్రేమలో లేను!



తమిళ హీరో జైతో తాను డేటింగ్‌లో ఉన్నట్లు ఎవరితో చెప్పలేదని తెలిపింది అంజలి. జై, అంజలి ప్రేమాయణంపై తమిళ చిత్రసీమలో చాలా కాలంగా పుకార్లు షికారు చేస్తున్నాయి.'ఎంగయుమ్ ఎప్పోదుమ్'(తెలుగులో 'జర్నీ') సినిమాలో నటిస్తున్న సమయంలో వీరిమధ్య మొదలైన పరిచయం ప్రణయంగా మారినట్లు వార్తలు వినిపించాయి. ఒకరి పుట్టినరోజున మరొకరు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుకోవడమే కాకుండా తామిద్దరు సన్నిహితంగా కలిసి దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకోవడంతో జై, అంజలి డేటింగ్‌లో ఉన్నది నిజమేనని అంతా అనుకున్నారు. 'దోశ ఛాలెంజ్'లో జంటగా పాల్గొనడంతో వీరు పెళ్లిచేసుకోబోతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రేమ వార్తలపై జైతో పాటు అంజలి ఇన్నాళ్లు పెదవి విప్పలేదు. ఇటీవల ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాల్ని వెల్లడించింది అంజలి. జైతో తాను ప్రేమలో లేనని చెప్పింది. 'జైని నేను ప్రేమిస్తున్నట్లుగా అనేక వార్తలు వచ్చాయి. ఓ దశకు వచ్చాకా అవే ఆగిపోయాయి. జైతో నేను ప్రేమలో ఉన్నట్లు ఎవరితో చెప్పలేదు. తొలినాళ్లలో ఇలాంటి గాసిప్స్ నాపై వచ్చినప్పుడు ఏడ్చేదాన్ని. ఇప్పుడవన్నీ అలవాటైపోయాయి' అని తెలిపింది.

అంజలి



మహి.వి.రాఘవ్, దిల్ రాజు, విజయ్ చిల్లా

'యాత్ర' అందరికి నచ్చుతుంది!

'దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర ఎంత సెన్సేషన్ అయిందో తెలుగు ప్రజలకు బాగా తెలుసు. ఆయన చేసిన పాదయాత్రలోని ఎమోషన్స్‌ని తీసుకుని 'యాత్ర' చిత్రాన్ని తెరకెక్కించారు. వైఎస్ పాత్రలో మమ్ముట్టి లాంటి లెజెండరీ నటుడు నటించడంతో ట్రైలర్, టీజర్ ఎక్సైట్ చేశాయి. అందుకే ఈ చిత్రాన్ని నైజామ్, వైజాగ్‌లలో విడుదల చేస్తున్నాం. ఈ సినిమాతో విజయ్ చిల్లాకు మరో హిట్ లభించాలి' అన్నారు దిల్‌రాజు. దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో రూపొందిన చిత్రం 'యాత్ర'. మమ్ముట్టి కీలక పాత్రలో నటించారు. మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ చిత్రానికి ఆన్‌లైన్ బుకింగ్స్ బాగున్నాయి. బుకింగ్స్ బాగుంటేనే భారీ ఓపెనింగ్స్ వస్తాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి భారీ ఓపెనింగ్స్ లభించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఓపెనింగ్స్ బాగున్న సినిమాలే ఆడుతున్నాయి. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర గురించి పేపర్లలో చదివాం. టీవీల్లో చూశాం. పాదయాత్రతో ఆయన రాజకీయ జీవితమే మారిపోయింది. తెలుగు ప్రజల్లో ఎన్టీఆర్ తరువాత అంతటి ఇమేజ్‌ను తెచ్చుకున్నారాయన. అలాంటి వ్యక్తి జీవితంపై వస్తున్న 'యాత్ర' భారీ విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ చిల్లా మాట్లాడుతూ 'యాత్ర రాజకీయ చిత్రం కాదు. కానీ రాజకీయ నేపథ్యంలో సాగుతుంది. రాజశేఖర్‌రెడ్డి అభిమానులకే కాదు అన్ని వర్గాలకు నచ్చే సినిమా ఇది' అన్నారు. దర్శకుడు మహి వి. రాఘవ్ మాట్లాడుతూ 'మనకు ఒకరు ఇష్టం వుండొచ్చు ఉండకపోవచ్చు అలా అని వారిని కించపరచడం మంచి పద్ధతి కాదు. మనకు స్ఫూర్తి నిచ్చిన వారి సినిమాను సెలబ్రేట్ చేసుకుందాం. ఇదే వారికి మనమిచ్చే గొప్ప నివాళి' అన్నారు.

అల్లు అర్జున్ సరసన?



ఛలో, గీత గోవిందం చిత్రాలతో వరుస విజయాల్ని సొంతం చేసుకుంది కన్నడ సోయగం రష్మిక మందన్న. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. కాగా ఈ చిత్రం తరువాత రష్మిక అల్లు అర్జున్ సరసన నటించనున్నట్లు తెలిసింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరపైకి రాబోతున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతాఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా బాలీవుడ్ సోయగం కియారా అద్వానీ నటించనుందని ప్రచారం జరిగింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో అల్లు అర్జున్ సరసన రష్మికను చిత్ర బృందం ఎంపిక చేసే అవకాశం వుందని తెలిసింది. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ మార్చి మొదటి వారం నుంచి ప్రారంభం కానుందని సమాచారం. ఈ సినిమాతో పాటు నితిన్ హీరోగా నటించనున్న 'భీష్మ'లోనూ నాయికగా రష్మిక ఎంపికైనట్లు టాలీవుడ్ న్యూస్.

శిక్షణ మొదలైంది!



వరుణ్‌తేజ్

ఇటీవలే విడుదలైన 'ఎఫ్-2'తో వంద కోట్ల క్లబ్‌లో చేరిపోయారు వరుణ్‌తేజ్. ఈ విజయోత్సాహంతో తన తదుపరి సినిమా కోసం సన్నాహాలు మొదలుపెట్టారు. కిరణ్ కొర్రపాటి అనే నూతన దర్శకుడితో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వరుణ్‌తేజ్ ఓ సినిమా చేయనున్నారు. గీతా ఆర్ట్స్ సంస్థ చిత్రాన్ని నిర్మించనున్నది. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ బాక్సర్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ప్రస్తుతం అమెరికాలోని లాస్ ఏంజిలిస్‌లో బాక్సింగ్‌లో పత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు వరుణ్‌తేజ్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. చేతులకు బాక్సింగ్ గ్లోవ్స్ ధరించి పంచ్ విసురుతున్న ఓ ఫొటోను అభిమానులతో పంచుకున్న ఆయన 'బాక్సింగ్‌లో శిక్షణ మొదలైంది' అని పేర్కొన్నారు. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ కోచ్‌గా సీనియర్ నటుడు అర్జున్ ముఖ్య పాత్రను పోషిస్తున్నట్లు తెలిసింది.

తెలుగు దర్శకులు నచ్చలేదు!



అమృతారావు

తెలుగు సినిమాల్లో నటించడం తనకు ఇష్టం లేదని తెలిపింది అమృతారావు. మహేష్‌బాబు హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'అతిథి'. 2007లో విడుదలైన ఈ సినిమా తరువాత అమృతారావు మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. దీనికి కారణం తెలుగు దర్శకులే అంటూ ఇటీవల ఓ బాలీవుడ్ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఆమె మాట్లాడుతూ 'నేను 'అతిథి' చిత్రంలో నటిస్తున్న సమయంలో వరుసగా మూడు చిత్రాల్లో నటించే అవకాశం వచ్చింది. కానీ నేను అంగీకరించలేదు. కారణం టాలీవుడ్ దర్శకులు హీరోయిన్ పాత్రలను చూపించే విధానం నాకు నచ్చకపోడమే. వారిని కేవలం వస్తువులుగానే చూపిస్తారు. ఎలాంటి ప్రాధాన్యతనివ్వరు. అలాంటి పాత్రలు నాకు కరెక్ట్ కాదనిపించింది. 'అతిథి'లో నా పాత్ర, మహేష్ పాత్రతో సమానంగా సాగుతుంది. అందుకే ఆ చిత్రాన్ని చేశాను. చిత్రీకరణ సమయంలో మహేష్ కుటుంబంతో బాగా కలిసిపోయాను. చిత్రీకరణ జరుగుతున్న రోజుల్లో మహేష్ ఇంటి నుంచే భోజనం వచ్చేది. ఓ సారి నమ్రత మా కోసం బ్రౌన్ రైస్ వండి పంపించిన సంఘటన నాకు ఇంకా గుర్తే' అని తెలిపింది. అమృతకు బాలీవుడ్‌లో అవకాశాలు పెద్దగా రాలేదు. నవాజుద్దీన్ సిద్ధిఖీ నటించిన 'ఠాక్రే' చిత్రంలో ఆమె ఠాక్రే సతీమణి మీనా తాయి పాత్రలో నటించారు. ఆమె పాత్రకు విమర్శకుల ప్రశంసలు లభించాయి.

సువర్ణసుందరి చరిత్ర



పూర్ణ, సాక్షిచౌదరి

''సువర్ణ సుందరి' ప్రచార చిత్రం బాగుంది. చక్కటి కథాంశానికి గ్రాఫిక్స్ హంగులను జోడించి అద్భుతంగా చిత్రాన్ని తెరకెక్కించారు' అని అన్నారు దర్శకుడు బి.గోపాల్. జయప్రద, పూర్ణ, సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సువర్ణసుందరి'. ఎం.ఎస్.ఎన్ సూర్య దర్శకుడు. ఎమ్.ఎల్ లక్ష్మి నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు బి.గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'చారిత్రక కథాంశంతో ముడిపడిన సూపర్ నాచురల్ థ్రిల్లర్ చిత్రమిది. సువర్ణ సుందరి ఎవరు? ఆమె చరిత్ర కొందరి భవిష్యత్తును ఎలా ప్రభావితం చేసిందన్నది ఆకట్టుకుంటుంది. గ్రాఫిక్స్ కోసం ఏడాది పాటు శ్రమించాం. ఆలస్యమైనా ప్రేక్షకుల్ని ఈ చిత్రం అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'వినూత్నమైన కథ, కథనాలతో రూపుదిద్దుకున్న చిత్రమిది. సినిమాలో నాపై చిత్రీకరించిన పోరాట ఘట్టాలు అలరిస్తాయి' అని సాక్షిచౌదరి చెప్పింది. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'కథాబలమున్న ఇలాంటి మంచి సినిమాల వల్ల ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతారు. వైవిధ్యమైన ప్రయత్నంగా తెలుగు ప్రేక్షకుల్ని ఈ చిత్రం మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్, రామ్, ఇంద్ర, రామ్ సుంకర, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌లాల్

రాక్షసత్వంపై పోరాటం

మోహన్‌లాల్, నయనతార జంటగా నటించిన మలయాళ చిత్రం 'విస్మయతుంబతు'. ఫాజిల్ దర్శకుడు. ఈ చిత్రాన్ని నిర్మాతలు కె. కస్తూరి, సి.హెచ్ సరోజ గంగారామ్ 'మహాతంత్రం' పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. ఈ నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'మనుషుల్లో ఉండే రాక్షసత్వాన్ని నిర్మూలించడానికి పోరాడే ఓ వ్యక్తి కథ ఇది. శత్రువులపై అతడు ఏ విధంగా ప్రతీకారం తీర్చుకున్నాడు? ఆపదలో ఉన్న ప్రియురాలిని ఎలా కాపాడుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది. మోహన్‌లాల్, నయనతార పాత్రలు, నటన ఆకట్టుకుంటాయి. మలయాళంలో ఘన విజయాన్ని సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం అనువాద కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని తెలిపారు.